# కొండగాలి

## 1

తూర్పు కొండమీద కరకరమని సూర్యుడు ఉదయిస్తున్నాడు. జేగురు రంగులోవున్న కొండలన్నీ బంగారం రంగులోకిమారిపోయినట్టుగా మెరుస్తున్నాయి. తీగలతో, పొదలతో, చెట్లతో, మహావృక్షాలతో దట్టంగా వున్న అరణ్యం నాయుడు వలసకి కొద్దిదూరంలోనే వుంది.

నాయుడువలసలోనుండి చూస్తే కొండలు చాలా దగ్గరగా కనబడతాయి. కొండమీది మహావృక్షాలు గుబురుగా చిన్న చిన్న పొదరిళ్ళలా భ్రమింపజేస్తాయి. నాయుడువలస దాటగానే సరాసరి కొండల్లోనే వున్నట్టనిపిస్తుంది.

ఆ వలసలోని నాయుళ్ళ పెంకుటి గడపలు నాలుగైదు మినహాయిస్తే మిగిలిన వాళ్ళంతా పొయ్యిలోని కర్రలకని నిత్యం కొండల్లోకి పోతుంటారు. ఆడవాళ్ళు కర్రలు ఏరి మోపులుకట్టి తలమీదమోసి తెచ్చుకుంటారు. మగాళ్ళు ఎండిపోయిన చిన్న చిన్న చెట్లను నరికి పేళ్ళుగా చీరి కావిళ్ళుకట్టి భుజాల మీద తెస్తారు.

నాయుడు వలస మొత్తం కొంపల్లో నాలుగు మాత్రమే చాకలి కొంపలు. మిగిలినవి నానాజాతులవి. నానాజాతులవాళ్ళ బట్టలు ఆ నాలుగు కొంపల చాకళ్ళు ఉతకడమే గాకుండా, వాళ్ళ ఇళ్ళలో పెళ్ళిళ్ళకు పల్లకీ మోస్తారు. సారెకావిళ్ళు తీసుకువెళ్తారు. చావుకబుర్లు పొరుగూళ్ళలోనున్న వాళ్ళ వాళ్ళ చుట్టాలకు అందాజేస్తారు. చచ్చిన వాళ్ళకు కర్రలుకొట్టి, చితిపేర్చి బూడిదగా మారినంతవరకు కాపలా కాస్తారు.

వరసగావున్న నాలుగు గడపల్లో తూర్పునుండి వీధిలోకి ప్రవేశిస్తే మొదటిదీ, పడమటినుండి వెళ్తే చివరిదీగడ్డిసెట్టి కొంప.

గడ్డిసెట్టికొంపమీద గడ్డి సరిగా లేదు. రెండు సంవత్సరాలనుండి ఇల్లు నేయించకపోవడంతో ఇంటిమీద గడ్డి కుళ్ళిపోయింది. కుళ్ళినగడ్డిలో

పురుగులు దొరుకుతాయన్న ఆశతో కోళ్ళు దువ్వడంచేత గడ్డిచెదిరిపోయి ఇంటి పైకప్పు కన్నాలు కన్నాలు అయిపోయింది. ఆ కన్నాల్లోనుండి వాన చినుకులూ, సూర్యచంద్రుల కిరణాలూ యధేచ్ఛగా ప్రవేశిస్తాయి.

గడ్డిసెట్టి ఇల్లు అంతకుముందు గట్టిగానేవుండేది. బలంగా, ఎర్రగా, పొడవుగా వున్న గడ్డిశెట్టికి సన్నగా, పొడవుగా, అందంగా వున్న సెట్టిది వుండేది. సెట్టిదాని పేరు గురివి.

గురివి గురివింద గింజలా వుండి గడ్డిశెట్టికి ఆనందాన్నివ్వడమే గాకుండా, చాకిరేవు పనిలో అరిందాలా సహకరించేది. గుడ్డల్ని తెల్లగా మల్లెపూవుల్లా వుతకడమే గాకుండా, వారంరోజులు తొడిగినా నలగకుండా వుండేట్టు ఇస్త్రీ చేసేది. గురివి 'గుంజిన' గుడ్డలు కట్టుకోవడానికి నాలు గయిదు గడపల నాయుళ్ళు ఉబలాట పడేవాళ్ళు.

సాలుకు వచ్చిన జీతపుగింజల్తో, అడవినుండి తెచ్చిన కర్రలు అమ్మగా వచ్చిన డబ్బులతో గడ్డిసెట్టి ఇబ్బంది ఎరక్కుండా గడిపేసే వాడు.

ఇబ్బందిఎరగని గడ్డిసెట్టికి రెండేళ్ళక్రిందట గొప్పఆపదవచ్చింది. అరిందాలాటి గురివికి అమ్మవారు సోకింది.

చూసినవాళ్ళు మొదట వేపపువ్వన్నారు. రెండురోజులు పోయేసరికి ఆటాలమ్మ - అదే పోతుందన్నారు. అయిదురోజులు గడిచేసరికి ఉసిరికాయంతలేసి కుండలు కనిపించేసరికి ఏమీ అనకుండా ఊరు కున్నారు.

గడ్డిసెట్టి మాత్రం లబో దిబో మన్నాడు. గుగ్గిలం ధూపాలూ, వేప మండలతో విసిరించడాలూ, భూతవైద్యుడిచేత మంత్రాలూ అన్నీ చేయిం చినా గురివిని అమ్మవారు మాత్రం వదలకుండా తీసుకుపోయింది.

గడ్డిసెట్టికాళ్ళూ,చేతులూ విరిగిపోయినట్టయిపోయింది. పదిళ్ళగుడ్డలూ ఒక్కడే వుతకవలసి వచ్చేది. చాకిరేవునుండి వచ్చినతరవాత వుతికిన గుడ్డలు ఎవరివి వాళ్ళ ఇళ్ళకు సర్ది వచ్చేటప్పటికి పొద్దుపోయేది. అప్పుడు జానెడుపొట్ట గుర్రుపెడితే గెంజికాసుకొనేవాడు. బద్ధకంగా

వుంటే కడుపులో 'కాళ్ళుపెట్టుకుని' కుక్కిమంచంమ్మీద కూలబడి నిద్ర పోయేవాడు.

బ్రతుకుమీదతీపిపోయిందని అతడెప్పుడూ అనుకోలేదుగానీ, ఒంటి మీదా, ఇంటిమీదా మాత్రం శ్రద్ధలేకుండా పోయింది.

ఒంటిమీదా, ఇంటిమీదా శ్రద్ధ చూపకపోతే ఎవరూ అడగలేదుగానీ చాకిరేవు పెట్టకపోతే మాత్రం చాలమంది కోపగించుకొనేవాళ్ళు.

క్రిందటిరోజు సాయంకాలం నాయుడు గడ్డిసెట్టికి కబురుపెట్టి

"సెట్టోడా: ఇంటికి అల్లుడూ, కూతురూ వచ్చేర్రా! రేపెట్టకపోతే ఎలాగవుద్ది; మాసిపోయిన గుడ్డల్తో ఇల్లంతా కంపుకొడతన్నాది" అని మందలించాడు.

గడ్డిసెట్టి నాయుడుగారి ఇంటి గుడ్డలు మోసుకొచ్చి రేవుకు సరంజామా చూసుకొనేసరికి గూనక్రిందకిఒక్క కఱ్ఱపేడుకూడా కనిపించ లేదు. చీకటితోనే లేచి అడివికి వెళ్ళి కఱ్ఱలుతెచ్చి రేవు పెట్టాలను కున్నాడు.

అలా అనుకున్న గడ్డిసెట్టి ఆ ఉదయాన బద్దల కావిడిలో గెంజి మెతుకులు పెట్టుకుని గొడ్డలి కావిడికి కట్టి కొండలదారి పట్టాడు.

నాయుడు వలస దాటగానే తూరుపుకొండల్లోకి పోవడానికి గోరిజ వుంటుంది. గోరిజకు రెండువక్కలా భూతులసి మొక్కలూ, తంగేడు చెట్లూ, చీపురుపొదలూ దట్టంగా ఒకదానికొకటి పెనవేసుకొనివుంటాయి. ఒక్క వేసవిలోతప్ప మిగిలిన అన్నికాలాల్లోనూ గోరిజవెంట జిల జిల మంటూ ఊటనీరు పారుతుంటుంది.

ఆ త్రోవలోనే పశువుల మందలు కొండలకూ, మెరక భూముల మీదకూ మేతలకు పోతుంటాయి. కఱ్ఱలకు అడవికి వెళ్ళిన బళ్ళు అదే తోవన వస్తూపోతూ వుంటాయి.

కర్రలకూ, కంపలకూ పోయిన జనంకూడా అదేదారిన వెళతారు.

గోరిజలో రెండు ఫర్లాంగులు పైబడి నడిచివెళ్తే ఎత్తుగా చిన్న గుట్ట కనబడుతుంది. దానికి కుడిప్రక్కగా గోరిజను ఆనుకొని గదబవలస తగుల్తుంది.

గదబవలస ప్రక్కనుండి మెట్టదాటగానే సరిగ్గా మలుపులోనాలుగు దార్లు కలుస్తాయి. నాలుగుదార్లు కలిసినచోట పెద్ద మామిడిచెట్టువుంటుంది. కొండలమీదకుపోయి కర్రలమోపులూ, కావిళ్ళూ తెచ్చుకునే ఆడామగా ఆ మామిడిచెట్టుక్రింద మోపులుదించి కొంతసేపు అలుపుతీర్చుకుంటారు.

గడ్డిసెట్టి ఆ నీరెండలో గోరిజ దాటి మెట్టమలుపు తిరిగేసరికి ఆ 'రిజరు మామిడిచెట్టు' క్రింద ముప్పై నలభైమంది వరకూ ఆడా మగా మూగివున్నారు. మధ్యగా కాకీబట్టల్లోవున్న ఇద్దరువ్యక్తులు రెండు చిన్న చిన్న గొడ్డళ్ళు పట్టుకు నిలుచున్నారు.

ఆ దృశ్యం చూసిన గడ్డిసెట్టి గుండెలు గుభేలుమన్నాయి.

"ఓర్నాయినో! పారిస్టోలు. ఈలకి అంవిరిపోనానేటి ఇయాల" అనుకొని అక్కడే ఆగిపోయి వెనక్కిపోవడమా? ముందుకుపోవడమా? అన్న సందేహంతో ఒక్కక్షణకాలం నిలబడిపోయాడు.

అలా నిలబడిన గడ్డిసెట్టిని ఇద్దరు ఫారెస్టువాళ్ళలో ఒకడుచూశాడు. ఫారెస్టువాళ్ళ చూపు తనమీదపడిందని తెలియగానే గడ్డిసెట్టి గిరుక్కున వెనుదిరిగి తడబడుతూ తప్పుకోబోయాడు.

ఫారెస్టరుకూడా మామిడిచెట్టు ముందున్న మూకను త్రోసుకుంటూ గడ్డిసెట్టిపైవువచ్చి

"ఒరే! ఒరే సాకల్నాకొడక! ఏటలాగ పారిపోతున్నావ్? అగారే!" అని ఆగమన్నాడు.

గడ్డిసెట్టి కాళ్ళుఇనుపగొలుసులతో బంధించినట్టు ఠక్కున నిలిచిపోయాయి.

ఫారెస్టురు గబగబా గడ్డిసెట్టి దగ్గరకువచ్చి

"ఎక్కడికలాగ పారిపోతన్నావు ?" అని అడిగాడు.

"ఎక్కడికీ నేదు బావూ !" అని బెరుగ్గా గడ్డిసెట్టి సమాధానం చెప్పాడు.

"వెనక్కి వెళ్ళిపోతూ ఎక్కడికీ లేదని బుకాయిస్తావేమిరా ? పద పద" అని ఫారెస్టరు గడ్డిసెట్టిని ముందుకు త్రోశాడు.

గడ్డిసెట్టి మరిచేసేదిలేక ఫారెస్టరుతో నడిచాడు. గడ్డిసెట్టికూడా మందిలో కలిసిన తరవాత ఫారెస్టరు అందరికీ కనిపించినట్టుగా రిజరు మామిడిచెట్టు మొదలుమీదకు ఎక్కి నిలబడి :

"ఇదిగొండి. ఈ సంగతి వొళ్ళు దగ్గిరుంచుకొని మరీ వినండి. నేనెవర్నో మీరంతా ఎరుగుదురు గదా ! రాజు ఫారెస్టరంటే ఎలాటివాడో : తలచుకుంటే ఏటిజేస్తాడో మీకు తెలుసును గదా ? మీ తాతలెవరో ఉచ్చపోసి ఈ అడివంతా ఉడిచినట్టు మీరంతా రోజూ దీనిమీదపడి కర్రలు నరుక్కుపోతున్నారు. కావిడి రెండుమూడు రూపాయలకమ్మేసి కుడబలుస్తున్నారు. ఫారెస్టోళ్ళు కనబడితే దండాలెట్టేసి పళ్ళిపిపెట్టి తప్పుకుపోతున్నారు.

మేముకూడా చూసీ చూడనట్టు పోన్లే ఏదో కడుపుకక్కుర్తి వెధవలని జెప్పి మీమీద కేసులెట్టకుండా, ఆసీలు వసూలుజెయ్యకుండా వదిలేస్తున్నాం. కానీ మేము తలచుకొంటే గంటకో కేసు, గడియకొక పన్నెన్ని రసీదులు కోస్సి మీపీకలు తీసీగలం. మీలో ఒక్కవెధవ కూడా ఈ అడివిపక్క తొంగి చూడ్డానిక్కూడా భయపడిపోయినట్టు చేసీగలం. మీకు అలాగ మేము ఉపకారం చేస్తున్నప్పుడు ;మాకుకూడా మీరుఅవసరం వచ్చినప్పుడు, ఉపకారం చెయ్యలేకపోయినా, ఉపయోగపడాలి.

ప్రభుత్వంవారు అదిగో కనబడుతుంది గదా ! ఆ బోడికొండ, ఆ బోడికొండనుండి దాని ముందున్న పెద్దకొండవరకూ నీలగిరి మొక్కలు పెంచాలనుకుంటున్నారు. దాన్నే "ప్లానిటేషన్" అని అంటారు. ప్లానిటేషన్ అంటే మీకేటితెలుస్తాదిలే ! అదంటే మరేటీగాదు. పిచ్చిమొక్కలూ

పనికిమాలిన చెట్లూ కొట్టేయించి ఆ భూమినంతా సాపుగా తయారుచేసి నీలగిరిమొక్కలు వెయ్యాలి. మీరంతా ఇప్పుడే పని ప్రారంభించాల. సాయంత్రం ఇంటికెళ్ళిపోతున్నప్పుడు ఎవరు కొట్టినకర్రలు వాళ్ళేపట్టుకు పోదురు. పదండి" అని ముగించి మామిడిచెట్టు మొదలనుండి కిందికి దిగాడు.

అక్కడ వున్నవాళ్ళంతా బిలబిలమంటూ ఎవరి గొడ్డళ్ళు వాళ్ళందు కొని, బయల్దేరడానికి సిద్ధమౌతున్నారు. గడ్డిసెట్టి మాత్రం యిబ్బందిగా ఫారెస్టరు రాజువైపు చూశాడు.

రాజుసంగతి గడ్డిసెట్టికే గాకుండా అడవితో సంబంధంవున్న ప్రతి వాడికీ తెలుసును. పొట్టీ పొడవూ గాకుండా అడ్డంగా బలిసిన అతడిశరీరం ఎర్రగా వుంటుంది. ఎర్రటి శరీరంమీద వెంట్రుకలుకూడా ఎర్రగానే వుంటాయి. జుత్తు వంకీలుతిరిగి ఎర్రగావుండి పెద్ద ఆకర్షణీయంగా వుండదు. అతని ముఖం గుండ్రంగా ఉబ్బిన బుగ్గల్తో చిరుతపులి ముఖంలా వుంటుంది. అందుచేత ఆ ప్రాంతంలో అతనికి "ఎర్రజిందవ" అని పేరు పెట్టారు. అడవిలో అతను కనిపించగానే కర్రలు కొట్టినవాళ్ళు తమలో తాము "ఎర్రజింద వొస్తున్నాది. ఏటిజెయ్యడవు నాయనో !"అని గాభరా పడతారు. కర్రలు ఏరడానికి తుప్పకొకరు, డొంకకొకరుగా చెదిరిన ఆడ వాళ్ళు అతడ్ని చూడగానే ఎక్కడికర్రలు అక్కడవదిలేసి ఒక దగ్గరచేరి దరిదాపుల్లోవున్న తమ ఊరి మగవాళ్ళదగ్గరకు పారిపోతారు.

ఒంటరిగా ఆడదిదొరికితే ఏం జరుగుతుందో వాళ్ళందరికీ బాగా తెలుసు. రాబందులకు శవాలజాడ తెలిసినట్టు, ఎంతగుట్టుగా అడివికి కర్ర లకు వెళ్ళినా ఫారెస్టరు రాజుకిమాత్రం తెలిసిపోతుంది, ఆ కారణంగా ఆ ప్రాంతంతో ఎవరయినా బళ్ళతో కంపలుగానీ, కర్రలుగానీ తెచ్చుకొనే ముందు రాజుకు చెల్లించవలసిన ముడుపుచెల్లించే బయలుదేరతారు. అలా ముడుపు చెల్లించకుండా అర్ధరాత్రి అడవికి వెళ్ళినా ఆ బండీ, పోతులూ

మరి తిన్నగా ఇంటికిరావు. కేసులమీద కేసులు, జరీమానాలమీద జరీమానాలు కట్టవలసిందే!

అటువంటి రాజుకి దొరికిపోయిన గడ్డిసెట్టి తనకున్న ఇబ్బందిని ఏ విధంగా చెప్పుకోవడమో తెలియక కొంచెంసేపటివరకూ తటపటాయించి మరి తప్పదని రాజుకి దగ్గరగా వెళ్ళాడు. గుంపువెనక హుందాగా నడుస్తున్న రాజు గడ్డిసెట్టి వెనక్కి నక్కడంచూసి మందలింపుగా;

"ఎందుకురా ఎనకెనక్కి నక్కుతున్నావ్? తప్పించుకు దొబ్బడానికేటి?" అన్నాడు.

గడ్డిసెట్టి మాత్రం వినయంగా—

"అదికాదు రాజుబావూ! గూనకిందకి పుల్లల్లేక ఇలాగొచ్చినాను ఇయాల రేవుకెల్లాల. గుడ్డలన్నీ దండుకొచ్చేసినాను. ఇంట్లో పోగడిపోనాయి. ఇయాలకి వొదిల్నారంటే, రేపు ఎవల గుడ్డలు ఆలకిచ్చేసి ఎల్లుండి ఎట్టీపనికి తప్పకుండా వొత్తాను" అన్నాడు.

గడ్డిసెట్టి మాటలువిని ఎర్రని రాజుముఖం ఇంకా ఎర్రగా అయిపోయింది. అతడు గాండ్రించుతున్నట్టుగా:

"ఏటేట్రా! సాకల్నాకొడక! మాయమాటలుచెప్పి చల్లగా జారిపోడానికి చూస్తున్నావేటి? రేవు కెల్లాలా? తిన్నగా నువ్వునడకపోతే నేనే నీకు రేవెట్టీగల్ను. నడు నడు" అని ముందుకు తోశాడు.

ఆ తోపుకి గడ్డిసెట్టి తూలి గుంపులో కలిసిపోయాడు. గుంపంతా నిశ్శబ్దంగా అదేదో తాము చెయ్యవలసిన పనిగానే భావిస్తూ, ఏ మాత్రం బాధపడకుండా ఉలుకూ, పలుకూ లేకుండా నడిచిపోవడం చూసి గడ్డిసెట్టి చాలా ఆశ్చర్యపడ్డాడు.

"ఏటీలు?! ఏటే మాట్లాడకుండా పల్లకున్నారు. ఆ ఎర్రజిందవగాడి దగ్గిర ఏటిసెప్పినా సెల్లదని గావాల పల్లకూరుకున్నారు" అనుకొని తానూ గుంపుతోపాటు నడిచి బోడికొండ మలుపు తిరిగాడు.

బోడికొండకీ, పెద్దకొండకీ మధ్యన రకరకాల చెట్లతో, పొదలతో తుప్పలతో, డొంకలతో, తీగలతో నిండివుంది మైదానం. పెద్ద కొండమీదకి పదిబారలు వచ్చిన సూర్యుడు మైదానమంతా ఎండని పరిచాడు. ఎండిన చీపురుతుప్పలూ గచ్చపొదలూ, పిట్టపళ్ళ తీగలూ, చిన్నచిన్న డొంకలూ వున్నదగ్గర నిలబడి ఫారెస్టరు రాజు జేబులోనుండి అగ్గిపెట్టెతీసి ఒక పొదకు నిప్పు అంటించాడు.

చిన్నగా ప్రారంభమైన ఆ మంట కొన్నిక్షణాల్లోనే చిట చిట పట పటమని నాలుగువైపులకూ పాకడం మొదలెట్టింది. మంటవైపు ఒకసారి తృప్తిగా చూసి ముందుకుపోతున్న గుంపు నుద్దేశించి;

"ఓర్రె మనోలూ! ఉండండర్రా! గొర్రిల్లాగ ఏటలా వెళిపోత న్నారు. ఇదిగో ఈపక్కన నేనుమంటపెట్టాను. మీరు ఆ తూరుపు పక్క నుండి తుప్పా, డొంకా నరకడం మొదలుపెట్టండి" అని చెట్లు నరక వలసిన స్థలం చూపుడు వ్రేలితో చూపించాడు.

గుంపులో వున్నవాళ్ళంతా ఉట్టిల్లో తెచ్చుకున్న అంబళ్ళనీ, గెంజి తపేలాల్నీ త్రోవపక్కనున్న చింతచెట్టు కొమ్మలకుకట్టి అడివి నరకడం మొదలుపెట్టారు.

ఎండిపోయిన తుప్పా, డొంకా చిటపటమని కాలిమసైపోతుంటే మొదళ్ళు నరికినచెట్లు ఒకటొకటిగా పటపటమని విరిగి నేలకి వొరిగిపోతు న్నాయి. పని చురుకుగా జరుగుతూందని తృప్తిపడిన ఫారెస్టరు రాజు చింత చెట్టు మొదలుమీద కూర్చొని గార్డుని పిలిచాడు. ఫారెస్టుగార్డు పళ్ళికిలిస్తూ దగ్గరకు వచ్చాడు.

గార్డు కారునలుపుగా వుంటాడు. అతనిముక్కు బండగా బుడంపండు లాగా వుంటుంది. అతడి జుత్తు గుర్రపు జుత్తులా ఎర్రవాగ్గా వుంటుంది అతనిపళ్ళు గారపట్టిఉంటాయి. అతడి కళ్ళుమాత్రం తాగుడువల్ల ఎప్పుడూ ఎర్రని చింతనిప్పుల్లా వుంటాయి. కనుపొట్టలుపొంగి వొబుడు తేరినట్లుగా స్పష్టంగా కనపడతాయి. అతడిపేరు అప్పారావు అయినప్పటికీ అతడిదగ్గర చనువుగా వున్నవాళ్ళూ, తోటిగార్డులూ ఫారెస్టర్లూ "ఒరే అప్పారావూ!"

అని పిలవరు. "ఏంట్రోయ్! తల్లికి మొగుడూ!" అని పలకరిస్తారు.

తల్లికి మొగుడని తనను పిలిచినందుకు గార్డు అప్పారావు కించిత్తు కూడా చింతపడడు. సరిగదా అలా పిలిచినప్పుడు గర్వంగా నవ్వుతాడు.

అతన్ని అలా పిలవడానికి అనేక కథలూ కారణాలూ ఉన్నప్పటికీ ముఖ్యంగా అతడు దేవుడితోకూడా నిజం చెప్పడు. దేవేంద్రుడి పనైనా తనకు పడవలసింది పడకపోతే చెయ్యడు. తల్లిగానీ, తండ్రిగానీ, బంధువులుగానీ, స్నేహితులుగానీ తనవాటా తనకు యివ్వకుండా అడివినుండి ఆకు తెంపి పట్టుకొస్తే అరవైయ్యారు కేసులు పెడతాడు. అందుచేతనే అప్పారావు గార్డుని అంతమందీ తల్లికి మొగుడన్నారు.

తన దగ్గరకువచ్చి గారపట్టిన పళ్ళికిలిస్తున్న అప్పారావు గార్డుతో ఫారెస్టరు రాజు

"ఒరే తల్లికి మొగుడూ! పని బాగానే జరుగుతుంది. నువ్వు మరి చూడక్కర్లేదుగానీ ఆ పెద్దకొండ దిగువనున్న జీలుగుచెట్టు ఎక్కి ఒక బిడ్డి పట్రా! కల్లు తాగప్పోతే కళ్ళు తిరుగుతున్నట్టున్నాయి. అట్నుండి తిరిగి వచ్చినప్పుడు అదుగో ఆ కొసాని డొంకలు నరుకుతుందే ఆ ఎర్రకోక గుంట, అది మన పాతకాతా గదా! దాన్ని కేకేసుకొనిరా! బేగెళ్ళు" అని వెళ్ళమన్నాడు.

అప్పారావుగార్డు తలూపి కళ్ళొకసారి ఎగరేసి పెద్ద కొండవైపు వెళ్ళాడు.

# 2

నడినెత్తికి వచ్చిన సూర్యుడు చుర్రున మండుతున్నాడు. ఎండకి వేడెక్కిపోయిన కొండరాళ్ళమీదనుండీ, మండుతున్న తుప్పలమీదనుండీ వస్తున్నగాలి అడివిని సరుకుతూ చమటపట్టిన శరీరాల్ని మరింతగా చమట పట్టిస్తున్నాయి. అప్పటికేబాగా అలసిపోయిన గడ్డిసెట్టి గొడ్డలి నేలను పడేసి చుట్టూ చూశాడు.

జీలుగు కల్లుతాగిన ఫారెస్టరు రాజూ గార్డుఅప్పారావూ చింతచెట్టు క్రింద తువ్వాళ్ళు పరుచుకొని నిద్రపోతున్నారు. చెట్టుకొకరుగా పని చేస్తున్నజనంకూడా గొడ్డళ్ళు క్రిందపడేసి శరీరాలకు పట్టిన చమటను తుడుచుకుంటున్నారు.పదిబారల దూరంలోవున్న పొడుగాటివ్యక్తి మాత్రం ఇంకాచెట్టు నరుకుతూనే ఉన్నాడు.

అంతవరకూ గడ్డిసెట్టి తనతోపాటుగా పెట్టిచేస్తున్నవాళ్ళు ఎవరో, ఏ ఊరివాళ్ళో, అందులో తనకు తెలిసినవాళ్ళున్నారా? లేదా? అన్నది ఆలోచించలేదు.

"ఈ ఎర్రజిందవగాడికి మాబాగా అఁవిరిపోనాన్రా నాయనా! ఇయాల్టికి ఈ సాకిరీ తప్పదురోరె బావూ!" అని విచారిస్తూ పని చేసాడు. చేస్తున్నపని ఆపి చెట్టును సరుకుతున్న వ్యక్తిని చూసేసరికి గడ్డిసెట్టికి చప్పున గుర్తుకువచ్చి

"అరె! గదబొలస సోఁవన్న నాగున్నాడు. ఇప్పుడిదాకా సూడ్లే దేటి?" అనుకొని పలకరిద్దామని నేలనున్న గొడ్డలిచేతిలోకి తీసుకొని సోమయ్య వైపు వెళ్ళాడు.

సోమయ్య చెట్టుకి కంజాకొట్టి సగానికిపైగా నరికేశాడు. మరి పది గొడ్డలిదెబ్బలుపడితే చెట్టువిరిగి నేలమీద పడిపోతుంది. గడ్డిసెట్టి దగ్గరకు వెళ్ళి

"సోవియ్యా! నానొః దెబ్బేసి సాయిం సేతునేటి?" అని అడిగాడు.

గడ్డిసెట్టి మాటవిన్న సోమయ్య చెట్టు నరకడం ఆపి తల పైకెత్తేడు.

అంతలో దూరంగామండుతున్న తుప్పలమంటల మధ్యనుండి చెంగు చెంగున ఎగురుతూ బెదురు బెదురుగా ఒక చెవులపిల్లి గడ్డిసెట్టి, సోమయ్య వున్నపైపు వస్తూంది. అది చూసి సోమయ్య గడ్డిసెట్టిని మాటాడవద్దన్నట్టుగా సౌజ్ఞచేసి గొడ్డలి విసరడానికి అనువుగా ఎత్తిపెట్టుకున్నాడు. పరుగున వస్తున్న చెవులపిల్లి కొంచెం దగ్గరగా వచ్చేసరికి గురిచూసి గొడ్డలి విసిరాడు. గొడ్డలి తిన్నగావెళ్ళి చెవులపిల్లి నెత్తికి తగిలింది. పిల్లి నెత్తురు కార్చుకుంటూ మీదకి ఒక గెంతు గెంతి పడిపోయింది.

గడ్డిసెట్టీ సోమయ్యా పరుగెత్తి చెవులపిల్లి దగ్గరకు వెళ్ళారు. చివరి ప్రాణంతోనున్న దాన్ని పట్టుకొని సోమయ్య గడ్డిసెట్టితో సంతోషంగా

"సూసినావా గడ్డిసెట్టీ ఎంతోటున్నాదో! సరింగా నక్కపోతం తున్నాది గాదా ఈ సెవరపిల్లి" అన్నాడు.

గడ్డిసెట్టి దానికి జవాబుగా

"సోవయ్యా! గట్టిగా కేకలెయ్యబోక. తాగేసితొంగున్న ఆ ఎర్ర జందవగాడుగానీ, ఆ తల్లికి మొగుడుగాడుగానీ సూసినారంటే మనకిదక్కకుండా గెద్దల్నాగ తన్నకపోతారు. అది వొట్టుకోని అల్లా తుప్పల్లోన దాసిద్దుం. ఎలిపోయినప్పుడు పట్టుకెల్లిపోదుంగాని" అని చెప్పాడు.

చచ్చిన చెవులపిల్లిని దట్టంగా ఆకులున్న పొదలో గట్టికొమ్మకు వేలాడగట్టి మరికొన్ని చిన్న చిన్న కొమ్మలు విరిచి యెవరికీ కనబడనీయకుండా కప్పేసివచ్చి సోమయ్యకొట్టగామిగిలిన చెట్టుమెదలు ఇద్దరూ కలిసి నరికేసి అన్నాలకోసం చింతచెట్టుదగ్గరకు వెళ్ళారు.

అప్పటికే ఆడా మగా చెట్టుకి ఉట్టిల్తో కట్టిన తపేలాలూ, కుండలూ దించుకొని గుగ్గిలపు ఆకులు దొన్నెలుగాచేసి అందులో తింటున్నారు. తినేసినవాళ్ళు లేచి దగ్గరగానున్న గెడ్డజాలపైపుగా చేతులూ తపేళాలూ కడగడానికి వెళ్తున్నారు.

సోమయ్యా గడ్డిసెట్టీ చెట్టుకు కట్టిన ఉట్టిలు దించుకొని అందులో వున్న తపేళాలు తీసి తినడానికని ఎదరెదరగా కూచున్నారు. సోమయ్య తపేళాలోవున్న గంజిలో చెయ్యిపెట్టి కలుపుతూ

''ఏటి గడ్డియ్యా! ఈ మద్దిన నీ అలికిడే నేదేటి?" అని అడిగాడు.

గడ్డిసెట్టికూడా గెంజిలోని మెతుకులు దేవుతూ

"అది పోనాదిగదా! నావొక్కడికోసం కర్రలు కొట్టి అమ్మి సంపాదన సెయ్యాలా!? నాలుగిళ్ళగుడ్డలు గుంజుతున్నానుగదా! ఆలిచ్చిన గింజలే సరిపోతన్నాయి" అని ముద్ద నోట్లో పెట్టేడు.

సోమయ్య గెంజిలోన మెతుకులుతీసి తింటున్నాడు. గడ్డిసెట్టి అది చూసి

"కూరేటీ తెచ్చుకోనేదా?'' అని అడిగాడు.

"నేదు." అని సోమయ్య తపేలా యెత్తి మింగిన అన్నంముద్ద గొంతునుండి లోపలికి పోవడానికి కొంచెం గంజితాగేడు. తాగి

"నా బతుగ్గూడా నీలాగే అయిపోనాది. మొదటిదాన్ని పెల్లిసేసుకొన్నాను. రెండుపంటలు కాపరంచేసి అది కునికేసినాది. మరొకదాన్ని తెచ్చుకున్నాను. అదికూడా ఏడాది తిరగనేదు ఎల్లిపోనాది. సానాకాలం పల్లకున్నాడు. మా అమ్మి అదెమ్మనేదా! అది కాపరానికెలిపోయిన తరవాత మరొకదాన్ని తెచ్చినాను. అదీ సచ్చినాది. నా మనసు ఇరిగిపోనాది" అని ఊరుకున్నాడు.

గడ్డిసెట్టి తను తెచ్చుకున్న తెలగపిండి వడియాల్లో రెండు సోమయ్యకు ఇస్తూ

"నాను పిండొడేలు తెచ్చుకున్నాను, రెండు నంజుకో!" అని ఇచ్చాడు.

సోమయ్య వాటిని తీసుకొని చిన్న ముక్కకొరికి

"వర్రగా మా బాగున్నాయి" అని గెంజి మరి రెండు బుక్కలు తాగేడు. తరువాత

"నామాట కేటిగానీ, నువ్వింకా గుంటడివిగాదా ! గురివి సచ్చిపోయి రొండు పంటలు దాటిపోనాయి. పెల్లి సేసుకోరాదా ?" అన్నాడు.

దానికి గడ్డిసెట్టి సమాధానం చెప్పకుండా గటగటా గెంజి తాగి మరొక అన్నంముద్ద నోటిలో పెట్టుకున్నాడు. సోమయ్య తనలో తను గొణుక్కుంటూ

నాబతుకినాగై పోనాది. నా సెల్లిలు అదెమ్మనేదా దాని బతుకూ అలాగే అయిపోనాది. సేతగాని నంజికొడుక్కి దాన్నిచ్చినాము. ఆడు కట్ట పడ్డు తాగుడుకీ సుట్టపీక్కి ఆడికాలో ఈడికాలూ వొట్టుకోనిఅకరికి పెల్లాన్ని గూడా తారసనానికి.... సీ యదవ. ఆడు యాదలబడితేనే వావనంవొత్తాది. సీ...."అని చీదరించుకుంటూ గెంజి తాగడం పూర్తిచేశాడు.

గడ్డిసెట్టికూడా తినేసి ఇద్దరూ జొలదగ్గర నీటిలో చేతులూ తపేలాలూ కడుక్కొని చెట్టుకిందకి వచ్చారు.

అన్నాలు తిన్న ఆడవాళ్ళు జతలు జతలుగా కూర్చొని తల్లో 'పేలు' నొక్కుకుంటున్నారు. మగవాళ్ళు బార్లా చాపుకొని విశ్రాంతిగా చుట్టలు ముట్టించారు.

అంతవరకూ తాగుడు మైకంలో పడుకున్న ఫారెస్టరు రాజూ, గార్డు అప్పారావూ లేచి బద్ధకంగా ఒకసారి వొళ్ళువిరుచుకొని పనెంతవరకూ జరిగిందో చూశారు.

కాలిపోయిన తుప్పా దొంకల్లోనుండి పొగలేచి సుళ్ళు తిరుగుతూ ఆకాశంమీదకు పోతూంది. నరకినచెట్లు పడిపోయి చాలాభాగం ఖాళీగా కనబడుతున్నది.

పని బాగానే జరిగిందని తృప్తిపడి ఒకర్నొకరు చూసుకొని నవ్వుకున్నారు. తరువాత చెట్టుకింద విశ్రాంతి తీసుకుంటున్న వాళ్ళ నుద్దేశించి ఫారెస్టరు రాజు

"ఓర్రెమనోలూ ! మాకు టయిమయిపోయింది. ఆపీసుకెళిపోతాం. కేంపెళ్ళిన రేంజరు ఈపాటికి తిరిగివచ్చేసుంటాడు. అతగాడితోటి మీరెంత

పని జేసారో చెప్పాలి. మీరు మీకు కావలసినకర్రలు పట్టుకువెళ్ళండి. రేపు కూడా మళ్ళా పనిలోకి తప్పకుండా రండి. ఒకవేళ ఎవరైనా ఎగ్గొట్టేరో మరాలు అడివి మరిచిపోతారు. నాకు మీరందరూగుర్తే! జాగ్రత్త!" అని హెచ్చరించి రాజు ముందు నడవగా అప్పారావుగార్డు అతన్ని అనుసరించి వెళ్ళాడు.

# 3

సాయంకాలం సూర్యుడు చల్లబడ్డాడు. చల్లబడి చల్లగా అస్తమించాడు. ఇప్పలపూతల కాలంగాబట్టి కొండలుకూడా చల్లబడిపోయి చల్లని గాలి వీస్తున్నది. తెల్లకొంగలు బారులుతీరి గూళ్ళకు చేరుకుంటున్నాయి, తూర్పుకొండలకు దూరంగా చంద్రుడు ఉదయించడానికి గుర్తుగా ఎర్రటి కాంతి కనిపిస్తున్నది. రకరకాల అడవిపూల వింత వాసనల్ని గాలి ఉండీ ఉడిగీ మోసుకొని వస్తున్నది. చల్లగానేకాకుండా హాయిగా ఆహ్లాదకరంగా వున్న ఆ సమయంలో గదబవలస ఎగువగా ఉన్న మెట్టదాటి గడ్డిసెట్టీ సోమయ్యా ఊరి పొలిమేరల్లోకి వచ్చారు. ఇద్దరి భుజాలమీదా కర్రల కావుళ్ళు బరువుగా ఉన్నాయి.

బరువైన కర్రల కావుళ్ళు మోస్తున్నప్పటికీ ఆ ఇద్దరికీ కష్టంగా ఉన్నట్టులేదు. ఇద్దరూ పరుగులాంటి నడకతో ఉత్సాహంగా వస్తున్నారు. ముందునడుస్తున్న సోమయ్య కావిడికి కుడిపక్కన చచ్చిన చెవులపిల్లి వేలాడుతూంది.

గదబవలస దగ్గరపడేసరికి ముందు నడుస్తున్న సోమయ్యా నడక కొంచెం తగ్గించి గడ్డిసెట్టితో

“గడ్డియ్యా! మాఇంటికెల్లి సెఁవరపిల్లి కోస్సి వొంతులేసు కుందుం” అన్నాడు.

గడ్డిసెట్టికూడా తాపీగా నడుస్తూ

“నా కెవులున్నారు సోఁవయ్యా! ఇంటికాడకెల్లి నానివ్వుడు యీసలికి గెంజికాసుకుంటానో; నేదో! సెఁవరపిల్లి నువ్వొట్టుకో నెలి పోదూ!” అన్నాడు.

అదివిని సోమయ్య కాస్త బాధపడ్డాడు.

“అలాగైతే నువ్వు మా ఇంటికెలిపోయిరా! మా అమ్మి ఆది పిటం లోన వొంటసేసెత్తాది. అది బియ్యం ఎసరెట్టి ఉడకెట్టిన లోపల నాను పిల్లిని సేసెత్తాను. జీలుగుకల్లు ఉన్నాది. అదేసుకోని పిల్లి మాంసం తింతే మా సెడ్డ మజాగా ఉంటాది. నువ్వు వొణ్ణం తినీసి మీ ఊరెలి పోదువుగాని. దేగింటకెల్లి మాత్తరం నువ్వేటి సెయ్యాల!” అన్నాడు.

గడ్డిసెట్టికి ఆ మాట చాలా సంతోషమనిపించింది. చుక్కేసుకొని మాంసంతిని చాలారోజులైంది. కానీ మొహమాటం అడ్డువచ్చి

“ఎందుకునే సోఁవయ్యా! నా నింటికాడకెల్లి గెంజికాసుకుంటాన్నే!” అని మాట చప్పరించాడు.

సోమయ్య పట్టుదలగా

“అదేటీ కుదరదు. నువ్వు ఇయాల మా ఇంటికాడ వొణ్ణంతిని ఎల్లవాలిసిందే!” అన్నాడు.

గడ్డిసెట్టి మరి జవాబు చెప్పకుండా ఊరుకున్నాడు. ఇద్దరూ గదబ వలసలోవున్న సోమయ్య ఇల్లు చేరుకున్నారు. ఇంటి గోలి గోడకి ఇద్దరూ కావుళ్ళు చేరవేశారు. సోమయ్య కావిడికి కట్టిన పిల్లిని విప్పిచేత్తోపట్టుకొని

“రా గడ్డియ్యా!” అని గడ్డిసెట్టినిపిలిచి ఇంటిలోనికి వెళ్లాడు. గడ్డి

సెట్టి గడపలో కూర్చొని ముఖం ఒకసారి తుడుచుకున్నాడు. నట్టింటిలోనికి చెవుల పిల్లిని పట్టుకు వెళ్ళిన సోమయ్య

"అమ్మీ! ఆదెమ్మా! సెవరపిల్లి కొట్టుకొచ్చినాను. కత్తిపీటొట్టుకోని ఇటుకాసి రమ్మీ" అని పిలిచాడు.

ముఖం తుడుచుకున్న గడ్డిసెట్టి ఇంటిలోనికి ఒకసారి తొంగి చూశాడు.

నట్టింట్లో కుదురుమీద చిన్న దీపంబుడ్డి ఎర్రగా వెలుగుతూంది. కుదురుకింద మూలగా రెండు గుమ్మడికాయలు ఒకదానిమీద ఒకటి పేర్చి ఉన్నాయి. కుదురుపక్కగా తూరుపుగోడకి వెదురుబొంగు వ్రేలాడుతూంది. దానిమీద కొన్ని మాసినబట్టలు పడేసి ఉన్నాయి. గోడ దిగువు అంచులకు ఎర్రమన్నుతో ఓర్లు దిద్ది ఉన్నాయి. గోడలన్నీ పేడతో శుభ్రంగా 'చేమాకు' పెట్టి ఉన్నాయి. నేలంతా పేడతో అలికి పరిశుభ్రంగా ఉంది కుదురుమీద దీపం పక్కన రెండుకడవల్లో నీళ్ళున్నట్టున్నాయి. కుదురుకు తిన్నగా వంటింటి ద్వారం పక్కన రెండు సత్తుగిన్నెలూ ఒక తపేలా, రెండుదాకలూ ఉన్నాయి. వంటఇంటిలోనుండి మండుతున్న పొయ్యి వెలుతురు సోమయ్య మీదా, చెవులపిల్లి మీద ఎర్రగా పడుతున్నది.

"సోమయ్య ఇల్లు బాగున్నాదే" అని గడ్డిసెట్టి అనుకుంటుండగా వెనక ద్వారందాటి కత్తిపీట పట్టుకొని వస్తున్న ఆదెమ్మ కనపడింది.

ఆదెమ్మను చూసిన గడ్డిసెట్టి గుండె ఎందుచేతనో ఒక్కసారి గుబగుబలాడాయి. పగలుపడిన కష్టమంతా ఎవరో చేతితో తన శరీరంలోనుండి తీసిపారేసినట్టనిపించింది.

వంటపంచలోనుండి వస్తున్న పొయ్యిలోని మంటఎర్రని వెలుగూ, కుదురుమీద దీపంబుడ్డీ మసక వెలుగూ ఆదెమ్మమీదపడి ఆమె శరీరం కొత్తరంగులో కనబడుతున్నది. ఎర్రంచు తెల్ల కోకలో ఆదెమ్మ శరీరం పెటపెటలాడుతున్నది. కుంద్రనిముఖంలో మెరుస్తున్న చిన్నకళ్ళూ,నల్లని జుత్తుతో సగభాగం కప్పబడిన చిన్న నుదురూ ఎత్తుగా, భారీగా బలంగా

ఉన్న శరీరం, జాకిట్టులేక పైట తగుమాత్రంగాఉన్న గుండెల పొంగులూ చూసి

"సోమయ్య సెల్లిలు సాన బాగున్నాదే" అనుకొన్నాడు. గడ్డిసెట్టి కళ్ళు ఆదెమ్మమీదనే ఉండిపోయాయి.

ఆదెమ్మ గడ్డిసెట్టిని చూడలేదు. సోమయ్య చేతిలోని చెవుల పిల్లిని చూసి

"బాగున్నదికన్నా! దున్నపోతంత ఉన్నాది. ఎనాగకొట్టినావేటి?" అని అడిగింది.

సోమయ్య సమాధానంగా

"నా నొక్కడ్నే కొట్టనేదులేయే! అదిగో గడపల కూకొనున్నాడు గడ్డియ్య! గడ్డియ్యానానూ కలిసి కొట్టినాం. నువ్వు గబుక్కన వొంట సెయ్యాల. నానూ గడ్డియ్యా దీన్ని సేసెత్తాం. ముగ్గురిఁవీ కలిసి వొణ్ణం తినాల. నిన్ననొట్టుకొ నొచ్చిన జీలుగుకల్లు ఉన్నాది గాదా! బేగి నేమరి." అన్నాడు తొందరచేస్తూ.

ఆదెమ్మ గడపలో కూర్చొని తనవైపు చూస్తున్న గడ్డిసెట్టిని ఒక మారు చూసింది. చూసింతరువాత రెండడుగులు ముందుకు నడిచి మరొక సారి గడ్డిసెట్టిని పరీక్షగాచూసి

"నాయుడొలప గడ్డిసెట్టినాగున్నాడు. ఇదుగోటి సిటంలోన వొణ్ణం వొండేత్తాను. మీరు మాంసం బేగిసేసీయండి." అని వంట ఇంట్లోకి నడిచింది.

వెనుదిరిగి నడుస్తున్న ఆదెమ్మ వెనక భాగంచూసి గడ్డిసెట్టి గుండెలు మరొక్కసారి గట్టిగా కొట్టుకున్నాయి.

సోమయ్య కత్తిపీటా చెవుల పిల్లితో గడపలోనికి వచ్చి గడ్డిసెట్టి ముందుపడేసి దీపం బుడ్డీ చిరిగిన చిన్న చాపా తెచ్చాడు. గడ్డిసెట్టి సాయంతో చెవుల పిల్లిని చిన్న చిన్న మాంసం ముక్కలుగా తరుగుతూ పిచ్చాపాటిగా అదీ ఇదీ మాటాడుకుంటున్నారు.

వంట పంచలో పొయ్యిమీద ఎసరులో బియ్యంపోసి కారం గుండ తేవడానికి చిన్న డబ్బా దొక్కుపట్టుకొని అదెమ్మ గడపలోకి వచ్చింది. గడ్డిసెట్టి మళ్ళీ అదెమ్మని చూసాడు. అదెమ్మకూడా గడ్డిసెట్టిని చూస్తూ

"అన్నా! వర్రగుండనేదు. సొండిసాంబన్న మావ ఇంటికాడ కెల్లి కామక్కొనొత్తాను." అని బైటకు వెళ్ళిపోయింది.

సోమయ్య అదెమ్మ మాటకు జవాబు చెప్పకుండా చెవులపిల్లి గుండెను కత్తిపీటతో కోసి గుండెకాయ బైటకులాగి

"గడ్డియ్య! దీని గుండికాయ సూడిమీ, ఎంతోటున్నాదో! ఇది గిది వొండకండా కాలుసుకోని జీలగుకల్లుతోటి సంజాకుతిందుఁవేటి?" అని అడిగాడు.

గడ్డిసెట్టి తల ఊపుతూ

"అనాగేసేతుంగాని." అన్నాడు.

ఇద్దరూ గబా గబా చెవులపిల్లిని చీరి మాంసం చెయ్యడంలో మునిగిపోయారు.

## 4

గడబవలసకి సొండి సాంబన్న ఎక్కడనుండి వచ్చాడో ఏ పరిస్థితుల్లో వచ్చాడో గడబవలసలో ఏ ఒక్కరికీ తెలియదు. ఇద్దరు తెల్లని నక్క ముక్కల్లాంటి పెళ్ళాలతో, ముగ్గురు గుమ్మడికాయలాటి పిల్లలతో నల్లగా కురచగా గుర్రపుజుత్తుతో పెద్దపొట్టతో నల్లటిపళ్ళికిలించుకుంటూ రెండుబళ్ళమీద సామానుతో సాంబన్న గడబవలసలో ఒకానొకనాడు తెల తెలవారు తుండగా దిగేడు.

అప్పటికే గొడ్డళ్ళుభూజాన వేసుకొని కర్రలకనీ పోడుకొట్టడానికనీ బయల్దేరిన ఆడా మగా ఊరు మొగని సామాన్ల బళ్ళతో దిగిన సాంబన్నని ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు.

బళ్ళు అగగానే బండిమీదనుండి మొదట సాంబన్న దిగి ఇద్దరి పెళ్ళాల్నీ చెయ్యి సాయంతో దింపేడు. సాంబన్న పెద్దకొడుకు తుప్పున కిందకి గెంతేడు. సాంబన్న పెద్ద పెళ్ళాం మిగిలిన ఇద్దరి పిల్లల్నీ ఎత్తుకొని కిందికి దింపింది.

సామానంతా బండిమీదనే ఉంచి, తమపైపు వింతగా చూస్తున్న గుంపుపైపు సొండి సాంబన్న చిరునవ్వు నవ్వుతూ పెళ్ళి

'సోమయ్య ఇల్లెక్కడ నేస్తం ?" అని ఒకర్ని అడిగాడు.

అతడు

"సోఁవయ్యకి మీరేటి సుట్టాలేటి ? ఏవూరేటి మంది ?" అని తిరిగి ప్రశ్నించాడు.

"సుట్టాలంకాదు." అని సాంబన్న నసిగాడు. అప్పుడు గుంపులో నుండి మరొకరు

"అదిగదే ! సోఁవియ్య దద్ద ఇల్లు. అదిగోటి" అని చేత్తో చూపెట్టాడు.

"అతగాను ఇంటిదగ్గరే ఉన్నాడా ?" అని తిరిగి అడిగేడు.

"ఉన్నాడు." అన్నట్టు ఆ వ్యక్తి తలవూపేడు.

బళ్ళనీ, పెళ్ళాల్నీ వీధిలోనే నిలబెట్టి సాంబన్న తిన్నగాసోమయ్య ఇంటికి వెళ్ళాడు.

సోమయ్య గడపలో కూర్చొని నల్లటి పలకరాతిమీద గొడ్డలిసాన బడుతున్నాడు. కొత్తవ్యక్తి చూరుముందల నిలబడేసరికి సోమయ్య ఆశ్చర్యంగా చూస్తూ

"వొవుళు బావూ నువ్వు ?" అని పరామర్శించాడు.

సొండి సాంబన్న, సోమయ్య సానబడుతున్న రాయికి ఎదురుగా కూర్చొని

"నన్ను సొండి సాంబన్నంటారు. పల్లంల బతుకులేక ఇలాగ పెళ్ళాం పిల్లల్ని వెంటేసుకొని నాలుగైదు ఊళ్ళు తిరిగాను. అయినా అక్కడా బతకలేకపోయాను. ఇదిగీవూరుమంచిదనీ ఇక్కడ సోమయ్య సాయం చేస్తాడనీ తెలుసుకొని వచ్చాను. కిరాణాకొట్టెట్టి బతకాలనుకొంటున్నాను. నువ్వుసాయం చెయ్యాల." అని ఊరుకున్నాడు.

సోమయ్య ఆశ్చర్యపోయాడు. తెల్లారి లేచింది మొదలుకొని పొద్దు పోయినంతవరకూ అడవిలో బ్రతుకుతున్న తనుసహాయపడగలనని ఇతను ఎలా అనుకుంటున్నాడో అనుకొని

"బావూ ! ఇక్కడ మా కడుపులికే తిండినేక పొద్దస్తమానం అడివిలోన తిప్పలు పడతన్నాం. నీకేటిసాయం సేత్తాం." అన్నాడు.

"నువ్వేటీ సెయ్యక్కర్లేదు సోవయ్య బావా ! ఉండడాని కింత చోటి స్తేచాలు. నా తిప్పలు నేను పడతాను. మీ చెల్లెళ్ళకీ పిల్లలకీ తలదాచుకోడానికి ఇంత చోటు చూపెట్టు." అన్నాడు.

"బావా !" అని పిలిచేసరికి సోమయ్య అదొకలా అయిపోయాడు. ఎప్పుడూ ముఖమైనా చూడని మనిషి పల్లంలో బ్రతికి నాగరికతా అదీ తెలిసిన సొండిబాబు తనని బావా! అని వరసకట్టడమే గాకుండా అతడిపెళ్ళాల్ని తన చెల్లెళ్ళను చెయ్యడం అతనికి ఏదో తెలియని ఆనందం కలిగించింది.

అతను కోరింది కూడా పెద్దగా ఏమీలేదు. ఉండడానికి కొంచెం స్థలం. ఆ మాత్రం చూపితే అతడి తిప్పలేవో అతడు పడతానంటున్నాడు. స్థలం ఇవ్వడం పెద్ద విషయమేమీకాదు. అలా క్షణకాలం ఆలోచించి

జాగాకేటి బంగారం బావూ ! ఊరంతన్నూ దిబ్బలే ! ఎక్కడ బాగుందంతే అక్కడే ఇల్లునేపుకో ! ఇల్లు నెగిసిందాకా అడుగోటి నాసాల ఉన్నాది, అందలున్ని మేకల్ని అందాకా మరొకడి సాల్లో కడతాను, అక్కడ దిగు బావూ !" అన్నాడు.

సొండిసాంబన్న కళ్ళు సంతోషంతో మిలమిల మెరిశాయి. పెళ్ళాం పిల్లల్ని సోమయ్య సాలలో దింపేడు.

అలా దిగిన తరువాత సాంబన్న సాలచుట్టూ వాడిసె కంపతో దడి పెట్టించి మన్నుమెత్తి చిన్న గుడిసె ఆకారానికి తెచ్చాడు. ఉప్పూ, కారం గుండా, బెల్లం, పొగాకూ, ఇతర దినుసులూ చిన్న చిన్న డొక్కుల్లో పెట్టి గడపలో దుకాణం వేయించి, డొక్కులమధ్యన పీటమీద చిన్నపెళ్ళాన్ని కూచోబెట్టాడు. పంచదారా టీ గుండా తెచ్చి సోమయ్యలాంటివాళ్ళకూ, గదబవలస పనిమీద వచ్చిపోతున్న ఫారెస్టు వాళ్ళకూ టీ కాచి చిన్న పెళ్ళాంచేత డబ్బులు పుచ్చుకొనకుండానే ఇస్తుండేవాడు. వలసలోని ఆడ వాళ్ళను అప్పా, చెల్లి, కోడలూ, మరదలూ అత్తా, అమ్మా వరసలతోనూ, మగాళ్ళను అన్నా, మావా, అల్లూడూ, దద్దా, చిన్నయ్య, పెద్దయ్య, ఇత్యాది వరసలతోనూ పిలిచి కొద్దికాలంలో మంచి నమ్మకస్తుడుగా తయా రయాడు.

నమ్మకస్తుడుగా గదబవలసలో గుర్తింపబడగానే వలసలోనిచిన్నా పెద్దా వారంరోజులు పనిమానుకొని సొండిసాంబన్నకు రెండు మిద్దియిళ్లూ ఒక గాదె కట్టిచ్చారు. కట్టుపని అవుతున్న రోజుల్లో సాంబన్న పనిలోకి వచ్చిన వారందరికీ టీ చేయించి పెళ్ళాం చేత ఇప్పించాడు.

అలా రెండేళ్ళవాడైన తరువాత తనస్వంత ప్రతిభమీద పదిగాదెల వాడుగా పెరిగాడు. పదెకరాల భూకామందుగా మారేడు. అలా ఆ మాత్రం వాడైన తరువాత ఒకరోజు ఫారెస్టు రాజు గదపవలసలో రాత్రి మకాం చెయ్యవలసి వచ్చింది.

పల్లంలోని రైతులు కొందరు దొంగతనంగా గుగ్గిలం దులాలు బళ్ళమీద పెరిగెస్తున్నారని భోగట్టా తెలిసింది. పల్లానికి అడివినుండి బళ్ళు రావాలంటే గదబవలస పక్కనున్న గోరిజిలోనుండే వెళ్ళాలి. వాటిని పట్ట డానికి పారెస్టరురాజు గదబవలసలో మకాం చెయ్యవలసి వచ్చింది. చీకటి పడిన పరువాత రాజు తిన్నగా సాంబన్న యింటికి వచ్చి

"సాంబన్నా! రాత్రికి నేనిక్కడ ఉండాల. నేనిక్కడ మకాం వేసి నట్టు ఎవరికీ తెలియగూడదు. దొంగలంణికొడుకులు డిపార్టుమెంటుకి తెలియ

కుండా గుగ్గిలం దూలాలు పెరిగేస్తున్నారు. వాళ్ళని పట్టుకొని బుగ్గిచేసె య్యాల. వాళ్ళ పోతుల్ని బందిలదొడ్డిలో పెట్టించేసి, వాళ్ళ బళ్ళ జప్తు చేయించేసి చెదలుపట్టించెయ్యాల. ఆ నా కొడుకులమీద కేసులు పెట్టించేసి ఒక్కొక్క నాకొడుక్కి ఐదేసివందలు జరీమానాలు వడ్డించెయ్యాల. అలాగ చెయ్యకపోతే నా పేరు ఫారెస్టరు రాజేకాదు."అని శపథంచేసాడు.

సాంబన్న, ఇంటిముందలనిలబడి అతితీవ్రంగా ఉపన్యసించుతున్న రాజుని గౌరవంగా

"బాబు నిలబడే మాట్లాడుతున్నారు. రండి కూచొండి." అని "ఒలే సిన్నా! రాజుబాబుకి మంచం బొంతా తెచ్చి పక్కగదిలోన యెయ్యిమీ!" అని చిన్న పెళ్ళానికి కేకవేసి చెప్పాడు.

చిన్న పెళ్ళాం చిలకలా పలికి మంచం బొంతా పట్టుకొని వయ్యారాలుపోతూ రాజు ముందునుండి పక్కగదిలోకి వెళ్ళి మంచంమీద బొంత పరిచి

"రండి బాబూ!" అని ముద్దుగా పిలిచింది.

ఫారెస్టరు రాజు నరాలు జివ్వుమనగా నడిచివెళ్ళిపోతున్న చిన్నని చూసిన కళ్ళు జిగేలుమన్నాయి.

రాజు గదిలో మంచంమీద కూర్చున్న తరువాత సాంబన్న మంచాని కెదురుగా శ్రీరాములువారి ముందర ఆంజనేయుడు కూర్చున్నట్టు నేలమీద కూర్చొని

"అయితే రాజు బాబూ! తమకి తెలకుండా గుగ్గిలం దులాలు పట్టు కెళ్ళడానికి అలకెన్ని గుండె లుండాల?" అన్నాడు రాజుని రెచ్చ గొడుతూ.

"గుండెలా.........?!" అని రాజు ఒకసారి పళ్ళు పటపటమని కొరికి

"ఇంకా అ నా కొడుకులికి నా సంగతి పూర్తిగా తెలదు. నేను గుండిలుతీస్సిన బంటుననీ, నాకు తెలియకుండా ఈఅడివిలోని పూతికపుల్ల

పోవడానికి అవకాశంలేదనీ వెధవలకి తెలదు. ఈ దెబ్బతో తెలుస్తాది." అన్నాడు.

"తెలిసినట్టిగ తమరు చెయ్యాల బాబూ ? దూలాం బళ్లు ఇక్కడికి చేరీవరికి సగంరాత్రి దాటతాదిగదా ! తమరు పుచ్చుకుంటానంటే ఇప్పుడే చెట్టునుండి దింపించి ఈతకల్లు తెప్పిస్తాను. గోధుమనూకఉన్నాది. ఉప్మా చేయిస్తాను." అని సాంబన్న లేచాడు.

లేచి వెళ్తున్న సాంబన్నని ఆపుతూ రాజు

"ఒద్దులే సాంబన్నా ! ఈ రాత్రప్పుడు నీకెందుకు శ్రమ!" అన్నాడు.

సాంబన్న అది అవకాశంగా తీసుకొని

"నాకు కష్టఁవని సెలవిస్తారేటిబావు ! తమ లాటోళ్ళకి నాలాటోడు ఏటి సెయ్యగల్డు. ఏదో ఉడతాభక్తి. బతుకులేక గంపడు సంసారంతోటి ఈ అడివిపట్టేను. ఇక్కడేదో తిండిగడిసిపోతంది. ఇప్పుడిదాకా మరేటి పెద్దగా మిగల్లేదు. అయినా ఇంత పిసర ఉప్మా ఇవ్వలేనా ! ఎంతకి లేనోడినయినా !" అని వినయంగా నవ్వేడు.

రాజు సాంబన్న సద్బుద్ధికి సంతోషిస్తూ

"నీ సంతోషాన్ని నేనెందుకు కాదనడం. కానియ్ !" అని కానిచ్చి మన్నాడు.

పది నిమషాల్లో ఈతకల్లు రాజు గదిలోకి వచ్చింది. తెల్లటి తియ్యటి ఈతకల్లు తలకెక్కుతుండగా సాంబన్న రెండో పెళ్లాం చిన్న స్టీలు పళ్ళెంలో వేడి ఉప్మా, కంచు చెంబుతో నీళ్లూ పట్టుకొని గదిలోకి వచ్చింది.

నిషాఎక్కుతున్న సమయంలో వచ్చిన చిన్నని చూసి అడివిలో అప్సర దిగిందనుకున్నాడు రాజు. ఇంతకుముందు చూసినకంటె కిక్కులో చిన్న పదిరెట్లు అందంగా కనబడుతున్నది. హరికేన్ లాంతరు వెలుతుర్లో ఎర్రటి వాళ్లూ నల్లటిజుత్తూ మెరుస్తున్నది. ఎత్తుగా కనిపిస్తున్న గుండెలు

ఈతకల్లుకంటే మత్తును కలిగిస్తున్నాయి. సంతానం లేనిది కావడంచేత వొంట్లోని వొంపులూ, అవయవాల బిగువులూ రాజుని రాజేస్తున్నాయి.

రాజుకుంటున్న రాజు కొద్ది సేపట్లోనే పరిసరాలు మరచిపోయాడు. బిడ్డిలోని ఈతకల్లు పూర్తిచేస్సి ముందు వయ్యారంగా నిలబడి ఉన్న చిన్నతో

"నిలబడే పోయేవు." అని పెకిలిగా మత్తునవ్వు నవ్వేడు.

వొడ్డిస్తాను. తినండి." చిన్న చిరునవ్వు నవ్వుతూ ముత్యాలు రాల్చింది.

తిండికే టుందిలే !" ఇంకేదో కావాలన్న ధ్వనిలో రాజు అన్నాడు.

"మరేటి కావాలో బాబుగారికి?" ఏదైనా ఇస్తాను ఫరవాలేదన్న ధ్వనిలో చిన్న జవాబిచ్చింది.

రాజు తను చదివిన పుస్తకాల్లోని మాటలు జ్ఞాపకం చేసుకొని

"అందాల బరిణివి. అపరంజి బొమ్మవి. నీదయ కావాల." అన్నాడు.

"అదేపాటిది. మీలాటి బాబులడిగినప్పుడు"

మరి రాజు ఉప్మాతినలేదు. వడిలో కూచున్న చిన్నకి తినిపించాడు.

చిన్న గోముగా ఉప్మాతింటూ రాజు నరాలు జివ్వుమనిపిస్తూ భర్త అసమర్ధపు బతుకంతా రాజుకి చెప్పి

"అతగాడ్ని కట్టుకొన్నాను. అన్నానికని అతడు తిప్పినన్ని ఊర్లు తిరిగాను. మీరు రచ్చించితే మా బతుకు బాగు పడతాది. రచ్చించాల." అని రాజుని ముద్దుపెట్టుకుంది.

రాజు మురిసిపోతూ, వొళ్లూ పై మరచిపోతూ

"రక్షిస్తాను. రాజు రక్షిస్తాడని అభయం ఇచ్చిన తరువాత మీకీ అడివిలో పెరగడానికి ఏ అభ్యంతరం ఉండదు. నేను అభయం ఇచ్చి కుచేలపు వెధవల్లాటి ఫారెస్టు కంట్రాక్టర్లని కుబేర్లుల్ని చేశాను. తప్ప

కుండా నీ మొగుడ్ని రక్షించి నిన్ను ఉద్ధరించుతాను." అని చిన్నతో మూడోసారి మైమరచి పోయాడు.

రాజు ఆ రాత్రి పాతిక బళ్ళమీద తెస్తున్న గుగ్గిలం దూలాలు పట్టేశాడు. వాళ్ళ ప్రతిమాలగా సాంబన్నని మధ్యవర్తిని చేశాడు.

మధ్యవర్తిగా సాంబన్న తన పాత్రని చక్కగానే నిర్వహించాడు. రాజు సాంబన్న అతిథి సత్కారానికి సంతోషించి వచ్చిన సొమ్ములో పైసా ముట్టకుండానే అంతా సాంబన్నకి వదిలేసి చిన్నకినపడేట్టుగా చిన్న ఉపన్యాసం ఇచ్చాడు.

"చూడు సాంబన్నా! ఈ డబ్బునాకేపాటిది? నేను తలచుకోవాలే గాని రాత్రికి రాత్రి వేలకువేలు ఆకాశంమీదినుండి అడవిలోకి రాల్చగలను. నీ మంచితనమూ, నామీద నీ అభిమానమూ చూసి నిన్ను బాగా బాగుచెయ్యాలనుకొన్నాను. ఈ చుట్టుపక్కల కోదు గ్రామాల్లో చింతపండూ, కరక్కాయలూ, అడ్డాకులూ, ఇప్పపప్పూ, ఒకటేవిటి అడివి దినుసునంతా నీకే అమ్మేటట్టు చేస్తాను. నిన్ను ఈ ఏరియాకి సావుకార్ని చేస్తాను. నువ్వు మాచెడ్డ మంచివాడివని అందరికీ చెప్తాను. నిన్ను కాదని మరొక సావుకారు ఎవడైనా కొన్నాడా! "ఫారెస్టు ప్రొడ్యూస్" కింద పట్టేసి సీలు చేయించేసి లాభంగాదు సరిగదా అసలుకూడా కానకుండా చేస్తాను. నువ్వు మాత్రం మెత్తగ ఉంటూనే ఈ గొర్రిల్లాంటి జనానికి పులిలాగ వుండాల. క్షణంలో నువ్వు లక్షాధికారివైపోతావు." అని చిన్నని చూశాడు.

చిన్న చిరునవ్వు నవ్వింది.

అది గమనించికూడా ఏమీ ఎరగనట్టు సాంబన్న

"తమదయ. పిల్లలోడ్ని. తమదయ". అని ఊరుకున్నాడు.

ఫారెస్టరు రాజుమాత్రం ఊరుకోకుండా అన్నంతపనీ చేశాడు.

సాంబన్న అడవిసరుకు దాచడానికి మరొక ఆరు కొట్టుగదులు కట్టాడు. దగ్గరగా పట్నంలోనున్న షాహుకార్లతో సంబంధం పెంచు

కొన్నాడు. పిల్లలు పిప్పిళ్ళ బస్తాల్లా పెరిగిపోయారు. పెళ్ళాలిద్దరూ వెండి బంగారు నగలతో గంగిరెద్దుల్లా కనిపిస్తున్నాడు. సాంబన్న జీవితం అడవిలో చిక్కబడిపోయింది. అతడు ధన కనక వస్తు వాహనాల్తో చిక్కబడిపోయాడు.

అలా చిక్కబడిపోయిన సాంబన్న, ఆదెమ్మ కారంగుండకి వచ్చే సరికి రాత్రిభోజనంముగించి తాంబూలంవేసుకొంటూ దినుసుల డొక్కల మధ్యన కూర్చున్నాడు.

ఆదెమ్మ తాంబ్రేలు డొక్కతో సాంబన్న కొట్టువగ్గరకు వెళ్ళే సరికి సాంబన్న తాంబూలం నముల్తూ

"ఏటి మరదలా? ఏటీలాగొచ్చీసినావు. బావని చూడాలనిపించిందేటి?" అని వికటం ఆడేడు.

ఆదెమ్మ నవ్వుతూ

"ముసిలోడివయిపోనావు గాని ముచ్చట్లుపోనేదు. మాతికి పళ్ళే నేవు, నీలాటోడికి మరదలేల?" అంది.

అ హాస్యానికి సాంబన్న బుసబుస నవ్వేడు. ముందుపళ్ళు రెండూ ఊడిపోయిన సందునుండి తాంబూలం తుంపర్లు తుంపర్లుగా తుళ్ళి ముందున్న సామాన్ల డొక్కల్లో పడింది.

ఆదెమ్మ నవ్వుతున్న సాంబన్నతో

"ఆసికాల మాటకేటిగాని! బేడ వర్రగుండ బేగిద్దూ!" అని అడిగింది.

సాంబన్న నవ్వడం ఆపేసి ఆదెమ్మ ఇచ్చిన పన్నెండు పైసలు పెట్టెలోవేసి కారంగుండ ఆకులో పొట్లం కట్టి చేతికి అందిస్తూ

"బావ ఈ మద్దిన ఈ పక్క అలికిడి లేదేటి? ఊర్లున్నాడా?" అని అడిగాడు.

"ఉన్నాడు" అని ఆదెమ్మ సమాధానం చెప్పి గబగబా ఇంటికి నడిచింది.

ఆదెమ్మ అన్నం వార్చేసరికి గడ్డిసెట్టీ, సోమయ్యా మాంసాన్ని వండటానికి తయారుగా వుంచారు.

అన్నం వార్చేసి ఆదెమ్మ వచ్చింది.

"వాణ్ణం అయిపోనాది. మాంసం బేగి వొండేత్తాను తేండి." అని అడిగింది.

సోమయ్య ఆదెమ్మకు మాంసాన్ని ఇచ్చాడు. వేరేగా ఉంచిన

చెవులపిల్లి గుండెను ప్రత్యేకంగా ఇస్తూ

"అమ్మీ ఈ గుండెకాయ కాలిసీసి బేగితెమ్మీ ! నువ్వు మాంసం వొండేతప్పుడికి మాఁవు జీలుగుకల్లు తాగేత్తాం" అన్నాడు.

ఆదెమ్మ మాంసాన్నంతటిని దాకలోనికి ఎత్తి గుండెకాయనుచేతితో పట్టుకొని వంటపంచలోనికి వెళ్ళింది.

సోమయ్య ఉట్టిమీద బిడ్డితోదాచిన జీలుగుకల్లు దించి, గడ్డిసెట్టిని నట్టింట్లోనికి పిలిచాడు. గడ్డిసెట్టీ సోమయ్యా నట్టింట్లో ఎదురెదురుగా కూర్చుని మధ్యన బిడ్డి ఉంచుకున్నారు. కమ్మని వాసన కొడుతున్న కల్లును చూసి ఇద్దరూ లొట్టలు వేస్తున్నారు. సోమయ్య ఆలస్యాన్ని సహించలేక

"అమ్మీ ! గుండికాయ ఇంకా కాల్సనేదా ?. బేగి తెమ్మీ !" అన్నాడు.

పొయ్యి ఊదుతున్న ఆదెమ్మ

"అయిపోనాది, సిటం తాలండి," అంది.

గడ్డిసెట్టి సోమయ్యా బిడ్డిలోని కల్లు చెరొక గ్లాసు తాగేరు. గ్లాసు పూర్తిచేసి గడ్డిసెట్టి

"సోఁమయ్యా....కల్లు మా బాగున్నాది, బుక్కుడు ఏసే తప్పిడికే నిసా ఎక్కిపోతన్నాది." అన్నాడు పొగుడుతూ.

సోమయ్య మళ్ళీ గ్లాసుల్లో కల్లుపోస్తూ

"కుసింత పులిసినాది మాసెడ్డ నిసా సేత్తాదిలే". అంటుండగా గడ్డిసెట్టి సోమయ్య పోసిన రెండో గ్లాసులో బుక్కుడు మింగి

"అదిగా ఎర్ర జెండవగాడు రేపుగూడా ఎట్టిసెయ్యనానికి రమ్మన్నాడు గాదా. రేపు నాను రేవుకెల్లాల. ఎట్టికి ఎలాగొత్తాను. రాపోతే అడుకేసెట్టేత్తాదేటో బయ్యింగా ఉన్నాది." అన్నాడు.

"ఇప్పుడాడి ఊసెందుకు నెత్తూ! అదిగాడు కేసెట్టి నపుడిమాట సూసుకోవచ్చును. ఈ మద్దిని మా పారిటీ గురవు రావొచ్చు నన్నట్టిగ తెలిసినాది. గురువు కియ్యన్నీ కొట్టిసిన పిండి. అతగాడితోటి ఆలోసన సేసి ఆ ఎర్రజెండవగాడి జులువేఁదో తెలుసుకుందుం. ఆ రాజుగోడు మనమీదన ఎర్రజెండవనాగ బిగురుతాడా?! మా గురువు దగ్గిటపిల్లి కూన. వొంగొంగి దండాలెట్టి పళ్ళిసిపెడతాడు." అంటుండగా అదెమ్మ కాల్చిన చెవులపిల్లిగుండె తెచ్చి సోమయ్యకు ఇచ్చింది. సోమయ్య వేడిగా కాలిన గుండెను చేతితో పట్టుకొని, చురగ్గానే క్రింద పడేసి చేతులు రుద్దుకుంటూ

"మా సెడ్డ ఉడుగ్గావున్నాది. ఊదుకొని తిను గడ్డియ్యా! నోరు కాలిపోతాది." అని గడ్డిసెట్టిని హెచ్చరించాడు.

గడ్డిసెట్టి నేలనున్న గుండెను కొంచెం చిదిమి నోట్లో వేసుకొని నమిలి

"సొనా బాగున్నాది. మా సెడ్డ రుసికారంగా ఉన్నాది. నా నిదిగిదే తొలిపాలి సెవరపిల్లిని తిండం." అని మరొక్క గుక్కెడుకల్లు త్రాగేడు తాగి

"పారిటీ అంటున్నావు. కమీనిస్టు పారిటీ ఏటి?" అని అడిగాడు.

"అదిగదే! ఎర్రజెండాపారిటీ" అని సోమయ్య గర్వంగా జవాబు చెప్పాడు.

గడ్డిసెట్టి గ్లాసు పూర్తిచేసి

"అదిగదంటే మా వూరి నాయిడికి మా సెడ్డ గుండిదడ. ఉట్టి పున్నెనికే తిడతాడు. మా నాయిడు గాంధీగోరి పారిటీ అట! అదిగా పారేటో నాకేటీ తెలదు." అన్నాడు,

అప్పటికి ఇద్దరికి బాగా నిషా ఎక్కింది. కాల్చిన గుండెను

పూర్తిగా తినేసి సోమయ్య ఆదెమ్మను కేకవెయ్యబోతుండగా నల్లగా పొడవుగా రివటలా ఉన్న ఒకవ్యక్తి ఇంటిముందల చూరు దగ్గర నిలబడి

"సోఁవియ్యబావా !!" అని కేక వేశాడు.

కొంచెం పట్టుమీద వున్న సోమయ్య

"వొవులది ? వొవులాలు ?" అని అడిగాడు.

చూరుముందు నిల్చున్న వ్యక్తి జవాబు చెప్పకుండా ఇంటిలోనికి వచ్చాడు. వచ్చిన వ్యక్తిని చూసి సోమయ్య ముఖం పక్కకు తిప్పుకున్నాడు. గడ్డిసెట్టికి ఆ వ్యక్తిని చాలాసార్లు చూసినట్టనిపించి ఎవరా?; అని జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు.

నిల్చున్న వ్యక్తి చిరిగిన పంచెముక్క ముణుకుఁవరకూ కట్టుకున్నాడు. ఒఁటిపై భాగంమీద బట్టలేదు. జుట్టంతా పీచుపీచుగా రేగిపోయి ఉంది. కళ్ళు గుంటలుపడి కనుపొట్టలు వాచినట్టున్నాయి. బుగ్గలు వొబుడు తేలి పాండురోగం ఉన్నవాడిలా కనిపిస్తున్నాడు. అతడు అప్పటికేచుక్కేసినట్టుగా చిన్నగా ఊగుతున్నాడు. సోమయ్య ముఖం తిప్పుకోవడం చూసి ఆ వ్యక్తి

"సెఁవరపిల్లిని కొట్టినావట ! పిలిత్తేతప్పేటి?అదిగదిగోవొంటొండుతన్నాది ; దానికీ నానక్కర్నేకపోనాను. నీకూ నామీదఅసేయఁవై పోనాది" అని కూర్చున్నాడు.

అప్పటికి సోమయ్య మాట్లాడలేదు. కూర్చున్నవ్యక్తి గడ్డిసెట్టికి సోమయ్యకూ మధ్యనున్న బిడ్డిని చూస్తూ

"అబ్బోసిడి. జీలుగుకల్లు నాగున్నాదే ! సెఁవరపిల్లి మాఁవసం జీలుగుకల్లూ మా దుమాగుంతాది" అని పొగిడాడు.

అప్పటికేకోపాన్ని దిగమింగుకుంటున్న సోమయ్య వచ్చినవ్యక్తిని చూడనుకూడా చూడకుండా

"నీ కొవులురా పిలిసినారు ? నీ మొకంనాకు సూపెట్టొద్దని ఎన్ని సార్లు సెప్పాల ? సిగ్గునేదురా ;" అన్నాడు.

వచ్చిన వ్యక్తి పళ్ళికిలించాడు.

"నా జారియా పెల్లాం ఇంటికి రానానికి నాకుసిగ్గేటి ?" అని మళ్ళీ పళ్ళికిలించాడు.

సోమయ్యకు చాలాకోపం వచ్చింది. కోపంలో

"నీమొకానికి పెల్లాంఏట్రా? అడికి ఈడికీ కాలుపిసికి అనాడబ్బులు అడుక్కోని కల్లుసుక్కలు తాగి తొంగోక ! ఇకమట్టి ఆదెమ్మ ఊసెత్తితే జోరగమీద పొడుత్తాను. ఏటనుకొన్నావో !" అన్నాడు.

వచ్చినవ్యక్తి నవ్వడం మానేశాడు. కొంచెం కోపంకూడా వచ్చినట్టుంది. ముందున్న గ్లాసు కల్లు బిడ్డిలో చటుక్కునముంచి గుటుక్కున గ్లాసుడు సారా మింగేసి

"ఒరే ! నువ్వు సానాసార్లు తిడితే నాను వల్లకున్నాను. ఇయాల అటో ఇటో తేలిసేత్తాను" అని లేచి పెరటిలోనున్న ఆదెమ్మవైపు వెళ్తూ

"ఓ లోలె ; ఓలె ఆదీ ! ఇయాల; ఇదిగీయాల ఆకరిమాటు పిలుస్తన్నాను. వొత్తావా ? రావా"! తేలిసీ!" అనీ రెండడుగులు వెయ్యబోయాడు

కూర్చొని ఉన్న సోమయ్య వెంటనే లేచి, వెళ్తున్నవాడి చెయ్యి పట్టుకున్నాడు.

"ఒరే! అటెటుకాసెలతన్నావు; ఎదవగద ఎదవ. బోరమీదన పొడిత్తే బుక్కెడు రగతాన్ని కక్కేత్తావు. రారిటు" అని రెక్కపట్టుకొని ఒక గుంజు గుంజి బరబరా వీధిలోనికి లాక్కొనిపోయి ఒక్క విసురు విసిరాడు.

వచ్చినవ్యక్తి ఆ విసురుకి మూడుబారలు ముందుకు తూలిపోయాడు. ఇదంతా చూస్తున్న గడ్డిసెట్టి పెద్దదెబ్బలాట జరిగిపోతుందేమోనని అనుమానిస్తూ ఏమి చెయ్యడానికి పాలుపోక మరొకగ్లాసు జీలుగుకల్లు తాగి కూర్చున్నదగ్గరే ఉండిపోయాడు.

తూలి మూడుబారలు ముందుకుపోయిన వ్యక్తి మరి తిరిగి రాకుండానే బూతులుతిడుతూ వెళ్ళిపోయాడు. సోమయ్య తిడుతూ వెళ్ళిపోతున్న

వాడ్ని రెండునిముషాలపాటు చూసి తిరిగివచ్చి గడ్డిసెట్టిముందు కూచొని పెద్దగా నిట్టూర్చి గ్లాసుడు కల్లుతాగేడు. అంతవరకూ ఆయోమయంగా చూస్తున్న గడ్డిసెట్టి సోమయ్యతో

"సోఁవియ్యా! వొవులాడు? ఆదెమ్మంతాదేటి?" అని అడిగాడు.

అంతవరకూ బాధని తనలోనే దిగమింగుకున్న సోమయ్యకు గడ్డిసెట్టి అడిగేసరికి కడుపులోని సొదనంతా గడ్డిసెట్టికి చెప్పి ఊరటపొందాలనుకొని

"ఏటి సెపతాను గడ్డియ్యా! అదిగాదే! ఆ పనికిమాల్ని ఎదవనా ఎదవకే, ఆదెమ్మ నిచ్చినాను. అడు మా సుట్టపోడు. సుక్కడు. నీ కెరిక నేదా?" అని అడిగేడు.

"సుక్కియ్యా!?" అని గడ్డిసెట్టి ఖణం ఆశ్చర్యపడి

"నాకెరికేనే! ఇనాగైపోనాదేటి? ఫోనసనేక పోనాను" అన్నాడు.

సోమయ్య మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు.

"వయిదారు పంటలాయి ఈఁడు ఇప్ప సారా అదిగదేపనిగా తాగడం మొదలెట్టినాడు. ఈఁడికి పదిపుట్ల కంరులుఁపండిన గుడ్డిముక్క వయిదుపుట్ల దాన్నెంగింజీలు పండిన పల్లపు మడిసెక్కా ఉండీయి. అయిగయి తాగనానికే ఈఁడు సొండి సాంబన్నకి తనకాట్టీసినాడు. పొద్దస్తమానం తాగడం వొణ్ణుం తెచ్చెట్టమని దీనిని తన్నీడం ఈఁడికి పనైపోనాది. నాకిల్లతోని ఇదిగిదంతా సూత్తూనే ఆల మొగుడూ పెల్లాల మద్దిన నాను దూరడఁవేల, అని వల్లకున్నాను.

"ఆడికి సుక్కెయ్యనానికి డబ్బుల్నేకపోయినప్పటికి ఎనాటి ఎదవ పనయినా సెయ్యనానికి సిద్దపడిపోయీవోడు.

అయాల నా మూడో పెల్లం సావుబతుకులమీద ఉన్నాది. అదిగాయాల అడేటి సేసినాడనుకున్నావు గడ్డియ్యా! అ దెవుడోటేకాపీసుబావుట! అడికాలొట్టుకోని ఈఁడుపీకిమొయ్యా ఇప్పకల్లు తాగీసినాడు. అబావుగూడా పీకమొయ్యా పట్టీసినాడు. రేత్తిరయిపోనాదని అడినొట్టుకోనొచ్చి గడపల

మంచం ఏయించినాడు. అందరూ తొంగున్నేలకి ఆ బేకాపీసు నాకొడుకు నెగిసి

ఆదెమ్మ నొట్టుకోబోనాడు. ఇదిగీడు సూత్తా ఏటనకుండా టక్కేసీసి నాడు. అదిగలాపింటిది ఎరికనేని ఆదెమ్మ బెంబేలుపడిపోయి నా ఇంటికి పా్రాబోనాది. అప్పుడాడు.... ఆ నంజికొడుకు.... నాఆదెమ్మని ఎక్కడకరి సీసి నాడనుకొన్నావు...." అని పళ్ళు పటపట కొరికి బొటబొట కన్నీరు కార్చేడు.

గడ్డిసెట్టి మారుమాటలేకుండా సోమయ్యని చూస్తూ ఉండిపోయాడు సోమయ్య తేరుకొని మళ్ళీ చెప్పబోతుండేసరికి మాంసం దాకతో ఆదెమ్మ వచ్చి

"ఆ సొదల్లా ఎందుకనే అన్నా, మాంసం కూడు తిను" అని మాట తప్పించింది.

"తింతాన్నేయే! ఎదవతిండి, ముగ్గురుపెల్లాలు సచ్చి నన్నీపింటి ఇదిగా నట్టేట్ల ముంచీసినారు. బతికుండి ఆ నంజికొడుకు నీ బతుక్కెయాద పెట్టినాడు" అన్నాడు.

ఆదెమ్మ కసురుకుంటూ

"నీకెప్పుడూ ఈ సొదేనేటి? నెగండి. నెగండి. మాంవసం వొణ్ణం ఎడతాను" అని లేవబోయింది.

సోమయ్య లేవకుండా

"ఉండే! నానింకా తాగనేదే! గడ్డియ్యా మరి రెండు గలాసులేత్తా వేటి?" అని అడిగాడు.

గడ్డియ్య అడ్డంగా తలూపుతూ

"నా కిప్పుడికే తలకెక్కెపోనాది. మరొద్దు. ఇంటికెల్లాలగాదా." అన్నాడు.

సోమయ్య మరి గడ్డిసెట్టిని అట్టే బలవంతం చెయ్యకుండా మూడు గ్లాసులు తాగేడు. అప్పటికి అతడు బాగా తాగినట్టు స్పష్టంగా కనిపిస్తు న్నాడు. అప్పుడు ఆదెమ్మతో

"అమ్మీ! రెండు గలాసులేసుకో!" అన్నాడు.

ఆదెమ్మ సిగ్గుపడిపోయింది. అదిచూసి సోమయ్య

"అదేఁటే సిగ్గుపడతన్నావు. గడ్డియ మనోడేనే!" అని గ్లాసు అందించాడు.

ఆదెమ్మ గటాగటా తాగేసింది. గ్లాసు మరొకసారి బిడ్డిలో ముంచి అందిస్తూ

"మూడాకు లెయ్యే అదీ! వొణ్ణం వొక్కపాలే తిందు"ంగాని. అన్నాడు.

ఆదెమ్మ సోమయ్య అందించిన గ్లాసుకూడా తాగి ఆకులు తెచ్చి వడ్డించింది. గడ్డిసెట్టి అన్నం తినకుండా ఉత్త మాంసం తిన్నాడు. సోమయ్య అన్నమూ మాంసమూ తృప్తిగా తిన్నాడు. ఆదెమ్మ మాత్రం సంజుడుగా మాంసం తిని అన్నం ఎక్కువతింది.

ఆదెమ్మ ఆకులుతీసి ఎంగిలెత్తి వచ్చేసరికి సోమయ్య రెండు చింకి గుడ్డలు నేలపరుచుకొని మత్తుగా

"అమ్మోలె.... ఆదెమ్మా! నాకు మా సెడ్డ కునుకొ స్తన్నాది. ముసిలి ముండాకొడుకుని గాదా! గడ్డియ్య నిసామీద నున్నాడు. తోవ తప్పోతా డేటో! గోరిజదాకా దిగబెట్టేసి రమ్మీ" అని అంతలోకే నిద్రలోకి జారి పోయాడు.

గడ్డిసెట్టి ఇంటినుండి వచ్చి గోలిగోడకు చేరవేసిన కర్రలకావిడి భుజానికెత్తుకోబోయి తూలి మళ్ళీ తమాయించుకుంటున్నాడు. అది చూసిన ఆదెమ్మ

ఉండుండు నాను గోరిజ దాకా వొత్తాను." అంది

గడ్డిసెట్టి తడబాటుగా

"వొద్దునే నానెలిపోగల్ను" అన్నాడు.

అయినా ఆదెమ్మ అగిపోకుండా గడ్డిసెట్టి కావిడికొమ్ము పట్టుకొని తూలినప్పుడు కాపు కాస్తూ బయల్దేరింది.

ఆకాశంమీద చంద్రుడు నిండుగా వెలుగుతున్నాడు. వెండిలాంటి ఆ వెన్నెల వెలుగులో గదబవలస కంకరదిబ్బలమీద తంగేడు చెట్లూ బలుసుపొదలూ అందంగా కనిపిస్తున్నాయి. కొండమీదనుండి గాలిచల్లగా చిరుచలి కలిగిస్తుంది. మంచు కురిసి పచ్చని ఆకులన్నీ అ పండువెన్నెల్లో తళతళమని మెరుస్తున్నాయి.

ఊరుదాటి గోరిజ చేరిన లోపల గడ్డిసెట్టి నాలుగైదుసార్లుముందుకు తూలి పడబోయాడు. ఆదెమ్మ కావిడికొమ్ము వదిలి గడ్డిసెట్టిని పట్టుకొని ఆపింది. గడ్డిసెట్టి శరీరం గగుర్పొడవగా మనిషి పూర్తిగా సిగ్గుపడిపోయి

"పడిపోన్నే! పడిపోన్నే?" అంటూ మళ్ళీ పడబోయాడు.

తాగింది తలకి పట్టేసినట్టుగున్నాది. కావిడిదించి ఒకసిటం కూకో!" అంది ఆదెమ్మ గడ్డిసెట్టిని వదలకుండానే!

"తాగుడు అలవాటునేదు. పండుగు పున్నాలికి తాగేనంతే. ఇదిగీ పింటి ఇదిగా పట్టేత్తాది" అంటూ గడ్డిసెట్టి మళ్ళీ తూలేడు.

"దించు. దించు. మరి నడినేవుగానీ కావిడి దించు" అని ఆదెమ్మ బలవంతం చేసింది.

గడ్డిసెట్టికి ఆదెమ్మతో మాట్లాడుతూ కూచోవాలని మనసులో ఉంది. ఆదెమ్మకూడా దానికి దోహదం చేసేసరికి భుజానున్న కావిడిదించి మెల్లగా పక్కనున్న కంకర దిబ్బమీద కూచున్నాడు.

ఆదెమ్మ గడ్డిసెట్టిని కావిడిదింపి కూచోమందిగానీ తీరా గడ్డిసెట్టి అ విధంగా చేసెసరికి తను ఏమి చెయ్యాలో అర్ధంకాలేదు.

గడ్డిసెట్టిని అక్కడ అలా వంటరిగా వదలి తిరిగి ఇంటికి వెళ్ళడమో; లేకపోతే మత్తుకాస్త దిగినవరకూ అక్కడే ఉండి తరువాతవెళ్ళడమో తేల్చుకోలేక కావిడి పక్కనే నిలబడిపోయింది ఆదెమ్మ.

ఆలోచిస్తూ అలా నిలబడిపోయిన ఆదెమ్మని చూసిన గడ్డిసెట్టిలో కోర్కెలు కోడెత్రాచుల్లా బుసలుకొట్టి లేచేయి.

వెన్నెల వెలుగులో ఆదెమ్మ వింతగా కనబడుతున్నది. ఆరోగ్యంగా పుష్టిగా ఉన్న ఆదెమ్మ అతనికంటికి అప్సరసలా ఉంది. భార్యపోయిన

తరువాత అంతవరకూ ఆడసుఖం అనుభవించని గడ్డిసెట్టి అదెమ్మపైపు ఆశగా చూస్తూ పులకించిపోతున్నాడు.

అదెమ్మకూడా ఆ క్షణంలో అదే విధంగా ఆలోచిస్తున్నది. జీలుగు కల్లు ఆదెమ్మలో కూడా తనపని తను చేస్తూంది. కండలు తిరిగిఉన్న గడ్డిసెట్టి శరీరాన్ని అప్పటికే ఒకటి రెండుసార్లు ముట్టుకోవడం చేత కలిగిన ఆనందం అణిగిపోయి ఉన్న ఆదెమ్మ కోర్కెల్ని రాజేసింది.

ఆదెమ్మకూడా ఇతర ఆలోచనల్ని వదలి గడ్డిసెట్టిని చూసింది.

గడ్డిసెట్టి కొంచెం ధైర్యంగా

"నిలబడిపోనావేటి? రా! కూకో?" అని పిలిచాడు.

ఆదెమ్మ మారుమాట లేకుండా గడ్డిసెట్టి పక్కన కూచుంది.

చంద్రుడు ఆకాశంమీద చక్కగా వెలిగిపోతూనే ఉన్నాడు. వెన్నెలలో కొండలు కదలని ఏనుగుల్లా గంభీరంగా హుందాగా కనబడుతున్నాయి. చెట్లమీదనుండి వస్తున్న చల్లని గాలి ఇద్దరి శరీరాల్ని తాకి వారికి తెలియని ఆనందాన్ని కలిగిస్తున్నది. కంకరదిబ్బల మీదనున్న తుప్పల్లోనుండి ఇలకోళ్ళు గీపెడుతున్నాయి. హాయిగా, ఆనందంగా ఆహ్లాదకరంగా నిశ్శబ్దంగా గంభీరంగా ఉన్న ఆ సమయంలో గడ్డిసెట్టి

"ఆదెమ్మా!" అని పిలిచి మరేమి మాటాడాలో తెలియక ఊరుకున్నాడు.

అదెమ్మకూడా ఏమి జవాబు చెప్పాలో తెలియక గడ్డిసెట్టిని చూసింది.

గడ్డిసెట్టి ఒక నిముషం తటపటాయించి

"నువ్వు సానా బాగున్నావు. వానదేవతనాగున్నావు" అని పొగిడాడు.

ఆదెమ్మ నవ్వింది.

జాకెట్టులేని ఆదెమ్మ భుజంమీద చెయ్యివేసి గడ్డిసెట్టి మృదువుగా నిమిరాడు. అదెమ్మ మారుమాట లేకుండా గడ్డిసెట్టికి దగ్గరగా జరిగింది.

దూరానున్న కొండలు ఒకదాని దగ్గరకు మరొకటి జరిగివచ్చి కలిసి

పోయినట్టుగాకనిపించాయి. చెట్లను లతలు మరింతగట్టిగా పెనవేసుకుంటున్నట్టున్నాయి. గూళ్ళలోని అడవి పక్షులు గుసగుసలాడుతూ ఒకదాని రెక్కల్లో మరొకటి దూరి సుఖసాగరాల్లో మునిగితేలుతున్నట్టుగా అనిపించింది. సకల ప్రకృతి సంతోషాతిశయంతో పులకరెత్తి పరవశించిపోయినట్టుంది.

గడ్డిసెట్టి లేచి నిలబడ్డాడు. అతడు చాలాఆనందంగా కనిపిస్తున్నాడు. అదెమ్మ కోక సర్దుకొని ఎదరగా నిలబడిన గడ్డిసెట్టి పాదాలకు సమస్కరించింది.

గడ్డిసెట్టికి ఆశ్చర్యంవేసింది.

"ఏటిది?" అని అడిగాడు.

"ఇదిగిది మా గదబల్లోన ఆసేరం"అని అదెమ్మనిండుగానవ్వింది.

పైన చంద్రుడు వెన్నెలనవ్వు నవ్వేడు. చెట్లు తలలు ఊపుతూ చల్లనిగాలి నవ్వు నవ్వేయి. కొండలు కదలకుండా మౌనంగా మనసులో నవ్వుకున్నాయి. తుప్పలు గలగలలాడుతూ గబగబా నవ్వేయి. గడ్డిసెట్టి అదెమ్మని చూసి ఆనందగా నవ్వుతూ

"పెతిరాత్తిరి మీ అదోలు మొగుడి కాలకి ఇదిగినాగే దండాలెడతారేటి?" అని ప్రశ్నించాడు.

అదెమ్మ సిగ్గుపడింది. తలవంచుకొని మెల్లగా

"ఎట్టరు" అంది.

"మరి నువ్వు నాకెందుకెట్టినట్టిగ?" మళ్ళీ అడిగేడు.

అదెమ్మ మరికాస్త ఎక్కువగా సిగ్గుపడిపోతూ

"నువ్వు మా కులపోడివికావుగదా! నా కాలదగ్గిట కూకున్నప్పుడు నీకు తగలఁవేటి? అఁగందుకు ఆ పాపం పోనానికి మొక్కినాను"అంది.

గడ్డిసెట్టి వెర్రిఆనందంతో అదెమ్మనికౌగలించుకున్నాడు. అదెమ్మ గడ్డిసెట్టి కౌగిలిలో ఇమిడిపోతూ

"నానెల్తాను. రేపొత్తావుగదా?" అంది.

గడ్డిసెట్టి మనసు సముద్రపు కెరటంలా ఎగిరిపడింది.

"ఒత్తాను" అన్నాడు.

ఆదెమ్మ పైట సర్దుకుంటూ ఆనందంగా నడిచివెళ్ళి వెన్నెల్లోకలిసిపోయి గడ్డిసెట్టి కంటికి కనబడలేదు.

కనబడినంతవరకూ ఆదెమ్మను చూసి గడ్డిసెట్టి గోరిజలో వదలిన కర్రల కావిడి తాపీగా భుజానికి ఎత్తుకొని నాయుడువలసవైపు నడిచాడు.

## 5

"ఓరోరి సాకల్నాకొడకి గద కొడకా ! ఇక్కడకొచ్చి దొంగతనంగా కర్రలు కొడతాతన్నావట్రా? నా కంట్లోనే కారంకొట్టేసి నాకళ్ళు కప్పేయాలనుకొన్నావురా! ఎవుడనుకొన్నావురా? తల్లికి మొగుడ్రా ఈడు. మనంగాని లేపోతే ఫారెస్టుడిపార్టుమెంటే లేదురా! ఆవేళ ఎంపుడికర్రలు అంతంతకావిడి కట్టీసుకొని మర్నాడు పెట్టికొస్తానని మమ్మల్ని నమ్మించి నావుగదరా! మాయమాటలుజెప్పి మళ్ళీ అడివిలోకి అడుగెట్టటానికి నీది గుండే? లేకపోతే చెరువురా ! అగొరె ! నువ్వు కర్రముక్క కొట్టడానికి ఈల్లేదు సరిగదా ఈనిపుల్ల పట్టుకోడానికూ్కడా ఈల్లేదురా !" అని కొండమొగని కర్రలు కొడుతున్న గడ్డిసెట్టివైపుగా అప్పారావు గార్డు అరుచుకుంటూ వస్తున్నాడు.

గట్టిసెట్టి అప్పారావుని చూసి గతుక్కుమన్నాడు.

"సచ్చిపోనానోర్నాయినా! తల్లికి మొగుడుగాడికి సరింగా అఁపిరిపోనానుమల్లా! ఈల కంట్ల బడకుండా తప్పించుకోని కసిన్ని గొల్లుకర్రముక్కలు కొట్టుకో నెల్లిపోవాలనుకొన్నాను. ఈడికంట్ల బడిపోనాను! ఏటిదారి?" అనుకొని బిక్కచచ్చి, వస్తున్న అప్పారావుగార్డుని చూస్తూ నిలబడిపోయాడు.

అప్పారావుగార్డు గడ్డిసెట్టి దగ్గరకువచ్చి చేతిలోవున్న గొడ్డలి లాక్కొని మెడమీద చెయ్యివేసి ముందుకు ఒకతోపు తోసాడు. ఆతోపుకు గడ్డిసెట్టి ముందుకుతూలిపోయాడు. తూలినప్పుడు అక్కడున్న రాయితగిలి అతని కాలిబొటనవ్రేలి గోరు చితికి రక్తం చిమ్మింది.

"అమ్మనాయన" బాధగా అన్నాడు. అని దెబ్బతగిలిన కాలుఎత్తి కుంటుతూ బొటనవ్రేలినుండి రక్తం కారిపోకుండా గట్టిగా చేత్తో పట్టుకున్నాడు.

బాధగా కుంటుతున్న గడ్డిసెట్టితో అప్పారావు

"ఎందుకలాగ ఎగురుతున్నావురా! తోకకాలిస్సిన కోతిలాగ! పెట్టికొస్తానని జెప్పి నిన్నా మొన్నా రాకుండా ఇయాల అడివికొచ్చికూడా దొంగతనంగా కర్రలు కొడతన్నావంటే అమ్మమ్మ దొంగనాకొడక, గుండిలు తీస్సిన బంటువిరానువ్వు. నిన్నొదిత్తే నాకు పంచమహాపాతకాలు ఎమర్జంటుగా చుట్టుకుంటాయిగదరా! నీయమ్మా!" అనిబూతులు తిట్టేడు.

గడ్డిసెట్టి గెంతడంమాని చేతికంటిన రక్తాన్ని కట్టుకున్న గావంచా అంచుకు తుడుచుకుంటూ

"బాబ్బావూ! గారుడుబావూ! నానేటి మాయసెయ్యనేదుబావూ! రేపుకెల్లిపోతే నీకుతెల్దా బావూ? నిన్ననా మొన్ననా నడుఁవు సల్లారిపోయి నట్టిగ గుంజినా ఆ మాసిన గుడ్డలింకా తరగనేదు బావూ! గబుక్కున ఈః కర్రలొట్టుకోనెల్లి, రేవేట్టిసీ ఎవల గుడ్డలాలకిచ్చేసి తఁవురిదగ్గిరికి ఎట్టికి రావాలనుకొన్నాను బావూ! ఒక్క తప్పుని గైపుచ్చుకోవాల అప్పారావు బావూ!" అని బ్రతిమాలాడు.

అప్పారావుగార్డు మరీ కఠినంగా మారిపోయాడు.

"బావూ బావూ.... అని పదిసార్లు బేపిలాగ అరిస్తే వొదిలేస్తాననుకొన్నావేట్రా?! నువ్వు చేసిన మోసానికి నీకేటిజేసినా పాపం లేదురా! ఇవాళ రేవెట్టానన్నావు. రేపు నీ పెళ్ళాం పుట్టయింది గెంజి దానికి కాసిపోసేనని పోకిరీ కవుర్లు చెబుతావు. ఎల్లుండి ఎల్లెల్లవయ్యా....ఎట్టికి ఎవుడొస్తాడని దమాయించేస్తావు. అమ్మనాయి నమ్మనాయినా! నిన్నొదలకూడ

దొరే! నువ్వు మాచెడ్డ కానోడులోగ కనబడతన్నావు. పదరా ఆఫీసుకి కేసు పెడతాను" అన్నాడు.

కేసనేసరికి గడ్డిసెట్టి గుండెలు ఎక్కడివక్కడ జారిపోయాయి. మహా భయపడిపోయాడు. భయంతో ఏడుచుకున్నంత పనిజేసాడు. ఆ స్థితిలో

"అప్పారావుబావూ! కేసేటిబావూ!" అని గుక్కిళ్ళుమింగాడు.

"అప్పారావు గార్డు వికారంగా నవ్వుతూ

"కేసేటని తెల్నట్టిగ అడుగుతున్నావేటిరా? ఏ కేసైనా పెట్టేస్తాను. ఎలాటి దుర్మార్గపు కేసయినా బనాయించేస్తాను. నువ్వు రిజరుపారెస్టులో దొంగతనంగా బ్రహ్మాండమైన టేకుమాను కొట్టేసినట్టిగ ఒక టేకుచెట్టును నరికించేసి దాన్ని నేను అమ్మేసి నీమీద తోయించేస్తాను. ఏటనుకున్నావో కేసేటట.... కేసు...."అని హుంకరించాడు.

గడ్డిసెట్టి నిలువునా వణికిపోయాడు. అప్పారావుని చూసాడు. అత దేమీ వినిపించుకొనే స్థితిలో లేడని గ్రహించాడు. అయినా చివరి ప్రయత్నంగా

"బావూ! అప్పారావు బావూ! నామీద కేసెట్టకుబావూ! నీ కాలొట్టుకుంతాను. వోరంరోజులు నాగా నేకుండా వొరసగా ఎట్టికొత్తాను. వొంచిన నడువు మరెత్తకుండా పొద్దుగూకులు పనిజేత్తాను. ఇదిగీ ఒక్క తప్పు కాయి బావూ! నాగొడ్డలి నాకిచ్చీబావూ!" అని అప్పారావు చెయ్యిపట్టుకొని బ్రతిమాలాడు.

అప్పారావుగార్డు చెయ్యి విదిలించాడు. గడ్డిసెట్టి వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు. అప్పారావు కొంచెం మారినట్టు కనిపించాడు. గడ్డిసెట్టి మరి నాలుగుసార్లు "బాబ్బావూ" అన్నాడు అప్పుడు అప్పారావు;

"ఒరే సాకలోడా! ఇది నువ్వు జేసిన మొదటి తప్పుకింద జమచేసి నీమీద కేసెట్టను. ఈ గొడ్డలిమాత్రం ఇప్పుడివ్వను. రాజు ఫారెస్టరుగారు ఇవాళ అడవికి రాలేదు. ఆపీసులో ఉండిపోయినారు. సాయంత్రం నాలుగు గంటలకి నువ్వు ఆఫీసుకు రా! అప్పుడు రాజుగారితోటి చెప్పి నీ

గొడ్డలి సీకిస్తాను. నువ్వు సాయంకాలంలోగా రాకపోయావో; నీ తలతీసి మొలేస్తాను. నా సంగతి తెలునుగదా" అని గొడ్డలితో కొండ దిగి చెట్లలో కలిసిపోయాడు.

గడ్డిసెట్టి మరేమీ మాట్లాడలేక అప్పటికి కొట్టిన కొద్దిపాటికఱ్ఱలను చిన్న కావిడిగా కట్టుకొని భుజంమీద వేసుకు బయల్దేరాడు.

పదకొండుగంటల ఎండకి కొండలు కొంచెం కొంచెంగా వేడెక్కుతున్నాయి. తుమ్మికచెట్లూ, జారుమామిడిచెట్లూ ఎఱ్ఱటి చిగుర్లు తొడుగుతూ కొండలన్నీ ఎఱ్ఱగా కనిపించేటట్లు చేస్తున్నాయి. వొడిసచెట్లు ఆకులు రాల్చి డాని కన్నట్టుగా మాటిమాటికీ తలలూపుతున్నాయి. గడ్డిసెట్టి కఱ్ఱలకావిడితో విచారంగా కొండదిగి దారిపట్టాడు, మెల్లగా అడుగులో అడుగులేసుకుంటూ

"ఈడికంట్ల పడిపోతానేటోననే అడ్డతోవ నొచ్చినాను. అయాలమల్లా వొత్తానని అదెమ్మతోటి సెప్పినా అటుకొంచి రానేకపోనాను. అదెమ్మ.... అదెంత బాగున్నాది. గురివికంటా గుమ్ముగున్నాది. నాను నిజంగా సానా అదుస్టం సేసుకోబట్టే అయాలనానేటీ అనకుండా దానిమున్నదే వొచ్చినాది. ఇప్పుడు సూడాల.... కోపఁవైపోనాదేటో.... ఈ తల్లికి మొగుడుగాడు ఆఫీసుకి రమ్మనమన్నాడు. ఎందుకేటో.... గొడ్డలిత్తాడో; అక్కడికి పిలిసి రొండు గుఁవికీలు ఏత్తాడో దొంగనాకొడుకు. ఏటి సెయ్యడం? రాత్తుర్లూ పొగులూ ఈ అడివిలోన నక్కనాగ తిరుగుతాడు. ఏ పెద్దపులైన ఎత్తుకు పోనాదిగాదు నా కొడుక్కి మబాగా జతపడ్డాడు" అని తిట్టుకుంటూ అదెమ్మని తలచుకుంటూ గొడ్డలిగురించి విచారిస్తూ కేసు పెడతాడేమోనని భయపడుతూ రిజరుమామిడిచెట్టు దగ్గరకు వచ్చాడు.

అక్కడ తలెత్తి చూసేసరికి అదెమ్మ కఱ్ఱలమోపును మామిడిచెట్టు మొదలుకు నిట్టనిలువుగా నిలబెట్టి కొంగుతో ముఖం తుడుచుకుంటూ కనబడింది. గడ్డిసెట్టి గుండె ఆనందంతో ఒకసారి గబగబా కొట్టుకుంది. అదెమ్మని చూశాడు.

వేపనూనె రాసుకొని తలంతా నున్నగా దువ్వి మెట్ట ముడిచిన అదెమ్మ ముచ్చటగా ఉంది. ఉతికిన ఎఱ్ఱకోక వొంటిని సరిగా కప్పలేక వొంపుల్ని కనిపించినట్టుగా చేస్తూంది. తలలో మెట్టమీద ముడుచుకున్న

తురాయిపువ్వు ఎర్రకోక కంటే ఎన్నోరెట్లు ఎర్రగా కనిపించి ఎరనెర్రని నవ్వులు నవ్వుతూంది. గడ్డిసెట్టి కళ్ళు ఆనందంతో మిలమిలలాడాయి. ఆదెమ్మని అలా చూడగానే అతడు జరిగినదంతా మరిచిపోయాడు. గబ గాబా రెండడుగుల్లో ఆదెమ్మనిచేరి

"ఆదీ" అని అప్యాయంగా పిలిచాడు.

అంతవరకూ గడ్డిసెట్టిని చూడని ఆదెమ్మ కర్రల కావిడతో ముందు నిలుచున్న అతడ్ని చూసి ఆనందంతో ఉప్పొంగిపోతూ

"అలికిడేనేదేటి గడ్డియ్యా...." అంది.

గడ్డియ్య తలగోక్కుంటూ

"సాకిరేపెట్టిరానేకపోనాను" అన్నాడు.

"నువ్వొత్తావని అడివంతా తిరిగేసినాను. రానేదు,"ఆదెమ్మ ముఖం ముడుచుకుంది.

గడ్డిసెట్టి గర్వపడ్డాడు. తనంటే ఆదెమ్మ అంతమోజుమీద వుందని అనుకోలేదు. జీలుగుకల్లు మత్తులో ఆ రాత్రి ఆ విధంగా జరిగిందేమోనని అనుకున్నాడు. కానీ నిజంగా ఆదెమ్మకు తనమీదవున్న అభిమానం ఆమె నోటినుండి అలావినేసరికి ఎంతో సంబరపడిపోయాడు.

"ఆదీ" అని దగ్గరకు తీసుకున్నాడు.

ఆదెమ్మ గడ్డిసెట్టి కౌగిట్లో కరిగిపోతూ

"తోవగదా ! వొవులైనా ఇటకొంచి వొత్తారెటో...." అని అను మానంగా అటూ ఇటూ చూసింది.

గడ్డిసెట్టి ఆదెమ్మని వదిలి

"అల్లదిగోద ! అ కనబడుతున్న మావిడి గున్నల దగ్గిటికి ఎల్దుం గాని" అని దించిన కావిడి భుజానికెత్తుకున్నాడు. ఆదెమ్మకూడా తల మీద కర్రల మోపును ఎత్తుకుని గడ్డిసెట్టి వెనక నడిచింది.

ముందు నడుస్తున్న గడ్డిసెట్టిని చూస్తున్న ఆదెమ్మ అతడి భుజం మీద కర్రల కావిడి చూసేసరికి ఆశ్చర్యమేసింది. వెంటనే

"ఇన్ని గొల్లుపుల్ల లొట్టుకోనొత్తున్నావేంది? సందిడు పుల్లలైనా నేవు?!" అని అడిగింది.

గడ్డిసెట్టికి చిన్నతనమనిపించింది. గొడ్డలి గార్డు పట్టుకుపోవటం సాయంకాలం ఆఫీసుకు రమ్మనటం గుర్తుకువచ్చింది. అదంతా మనసులో మెదిలేసరికి కోపంకూడావచ్చింది.

"అదిగా గారుడుగాడు.... ఆడు.... ఆతల్లికి మొగుడుగాడు నేడా! ఆడికియాల అంవిరిపోనాను. రేవుకెలిపోయి నిన్నను మొన్నను ఎట్టికి రానేదు గదా! అందుకాడు అగ్గిమీద గుగ్గిలం అయిపోనాడు. గొడ్డలి నాక్కున్నాడు. కేసెడతానని బెంబేలెత్తించీసినాడు సాయంతరం ఆఫీసుకి రమ్మన్నాడు. ఎత్తే ఏటిసేత్తాడో తెల్దు" అన్నాడు.

"అదిగాడేటి సేత్తాడు? వయిదు రూపాయలుచ్చుకోని నీగొడ్డలి నీకిచ్చేత్తాడు. నంచం ఇత్తేనేగానీ మంచం దిగడు. అదిగలాటి పింటి గండడాడు." అని ఆదెమ్మ తిట్టింది.

"వయిదు రూపాయలివ్వాలా.... అమ్మనాయనో అమ్మనాయనో" అని గుండె కొట్టుకున్నాడు గడ్డిసెట్టి.

"అదిగాడి పనే అది" అంది ఆదెమ్మ.

"ఆదెమ్మా గడ్డిసెట్టి గదబవలస వరకూ కలిసివచ్చి గోరిజదగ్గర విడిపోయారు. గడ్డిసెట్టి తెచ్చిన కర్రలు ఇంటిదగ్గర పడేసి గెంజికూడా తాగకుండా తొందరగా, నాయుడు ఇంటికి వెళ్ళాడు.

నాయుడు తీరిగ్గా వరండాలో వాలుకుర్చీమీద కూర్చున్నాడు. గడ్డిసెట్టిని చూసి

"ఏంవిరారే గడ్డియ్యా! ఏడు కవుర్లెడితేగానీ రావుగదా! నిన్ననే బట్టలిచ్చేసి మళ్ళీ ఇవాళ కనిపించినావేటి? ఏటి సంగతి? అని పరామర్శ చేశాడు.

గడ్డిసెట్టి నాయుడికి రెండుబారలదూరంలో గడపమీద కూర్చుంటూ

''అదిగాదుబావూ! ఇయాల కర్రలకని కొండకెల్లినాను. గారుడు అప్పారావుబావునేడా? అది గతగాను ఎట్టికి రానేదని గొడ్డలి నాక్కున్నాడు నిన్ననా మొన్ననా మీగుడ్డలే గుంజినానుగాదా! మరిగందు సేతన ఎట్టికి ఎల్లనేకపోనాను. ఇప్పుడు ఆఫీసుకి రమ్మన్నాడు. నేపోతే కేసెట్టేత్తానని సొప్పినాడు. వయిదు రూపాయిలి త్తేగాని గొడ్డలి రాదట బావూ! వయిదు రూపాయిలిప్పించి సిన్న సీటీముక్క గారుడు బావుకి రాయండి. ఇప్పుడెల్లి గొడ్డలి తెచ్చుకుంతాను.'' అన్నాడు వినయంగా.

నాయుడు నవ్వి

''ఆడు దేవాంతకపు ముండాకొడుకులేరా. ఆడికి ఉత్తరాలు లాభం లేదు. ఐదిస్తాను. పట్టుకెళ్ళి గొడ్డలి తెచ్చుకో. ఫారెస్టోలతోటి తగువులు తెచ్చుకోకు. మాలాటి వాళ్ళ బళ్ళు దొరికిపోయినప్పుడు విడిపించుకొనే టప్పటికే తలప్రాణం తోకకు వస్తుంది, నీలాటోలకి దిక్కేటి?'' అని ఐదు రూపాయల నోటు జేబునుండి తీసి ఇస్తూ

''బేగెల్లి పని చూడు'' అని చెప్పాడు.

గడ్డిసెట్టి ఐదురూపాయలు తీసుకొని నాయుడికి నమస్కారంపెట్టి నాయుడువలసకి రెండుమైళ్ళ దూరానవున్న ఫారెస్టాఫీసుకి బయల్దేరాడు.

ఆంధ్ర నుండి ఒరిస్సాకుపోయే తార్రోడ్డు పక్కగా ఫారెస్టు ఆఫీసువుంది. ఆఫీసుకు ముందున రోడ్డుకు ఎడంవైపుగా ఒక చిన్న పూరి షెడ్డు వుంది. షెడ్డు ముందర రోడ్డుకు అడ్డంగా రెండువలవల కొయ్యలు అటూ ఇటూపాతి ఒక పొడవుపాటి వట్టి కర్రగేటులా వేసి వుంది. అక్కడ వచ్చే పోయే కర్రల లారీలను చెక్‌చేసి గేటుతీసి ఒక వ్యక్తి వదులుతున్నాడు.

ఆఫీసు నాలుగు గదులుగా విభజింపబడిఉంది. ఒక గది ఫారెస్టు రేంజరుగారికి మిగతా మూడు గదులూ గుమస్తాలకూ, ఫారెస్టర్లకూ కేటాయించబడివున్నాయి. ఆఫీసుకు ఎడమ ప్రక్కగా పెద్దాఫీసర్లు కేంపు వచ్చినప్పుడు మకాం వెయ్యటానికి గెస్ట్‌హౌస్ లాంటిది కట్టబడివుంది.

రెండో ప్రక్క ఫారెస్టర్లూ గార్డులూ ఉండటానికి క్వార్టర్లు కట్టబడివున్నాయి. ఆఫీసుముందర పెద్ద మర్రిచెట్టు ధూళిపట్టి పచ్చగా లేకుండా గోధుమ వర్ణంలో కనబడుతుంది. ఆఫీసు వెనక ప్రక్కన రకరకాలచెట్లు పచ్చగా కనిపిస్తున్నాయి. ఆఫీసు మైదానంమీద గుగ్గిలం టేకు దూలాలు చెదురు మదురుగా పడివున్నాయి. అందులో కొన్ని చెదలు పట్టి వున్నాయి.

సాయంకాలపు నీరెండ తెల్లగా వెల్ల వేయబడిన ఆఫీసుగోడలమీద పడి మరింత తెల్లగా కనిపించినట్టు చేస్తుంది. ఆఫీసుకు వెనకనున్న పచ్చనిచెట్లు గాలికి మెల్లగా తలలూపుతున్నాయి. ఆఫీసు ముందున్న మర్రిచెట్టు మాత్రం గాలికి గలగలలాడుతూ ఎండిపోయిన ఆకుల్ని రాల్చి వేస్తూంది.

గడ్డిసెట్టి మర్రిచెట్టు కిందకి వచ్చి ఆఫీసును చూస్తూ అప్పారావు గార్ని యెక్కడ కలుసుకోవడమో యెవర్నడగడమో తెలియక తికమక పడుతున్నాడు. అంతలో అఫీసు పక్కనున్న గెస్టుహౌసునుండి ఒకడు మర్రిచెట్టువైపుగా వస్తున్నాడు.

వస్తున్నవాడు పెద్ద డాబుసరిగాలేడు. గడ్డిసెట్టి అతన్నిచూసి

"బయ్యంనేదు. ఇతగాడ్ని అడిగితే గసరడు, యెవుడో నాలాటోడి నాగే అవుపడతన్నాడు" అని మనసులో అనుకొని ధైర్యం తెచ్చుకొని నాలుగడుగులు వేసి అతడ్ని కలుసుకున్నాడు. వస్తున్నవాడు గడ్డిసెట్టిని చూశాడు, గడ్డిసెట్టి

"గారుడు అప్పారావు యెక్కడున్నాడేటి?" అని అడిగాడు,

అ వ్యక్తి గడ్డిసెట్టిని యెగాదిగా చూసి

"ఎందుకేటి?" అన్నాడు,

గడ్డిసెట్టి

"నా గొడ్డలి అదిగాబావు దగ్గిటుండిపోనాది. ఇక్కడికి రమ్మన మంతే వొచ్చినాను" అన్నాడు.

ఆ వ్యక్తి నవ్వేడు. గడ్డిసెట్టికి అనవ్వు అర్థంకాక అయోమయంగా చూసాడు. నవ్వడం అయినతరువాత ఆ వ్యక్తి

"అదిగోటి, అక్కడున్నాడు." అని గెస్టుహౌసుని చూపి వెళ్ళిపోయారు.

గడ్డిసెట్టి వెళ్ళడమా? మానడమా? అని ఆలోచిస్తూ చివరకి ధైర్యం చేసి అటుగా వెళ్ళాడు.

శుభ్రంగా అందంగా ఉన్న గదిమధ్యలో రెండు చాపలు వేసుకొని కొంతమంది వ్యక్తులు కూర్చున్నారు. వాళ్ళు కూర్చున్న చాపలకు కొంచెం దూరంలో పెద్ద టేబులూ దానిచుట్టూ ఐదు అందమైన కుర్చీలూ ఉన్నాయి. టేబులుకి కుర్చీలకూ పక్కన మంచం మీద శుభ్రమైన పరుపుపరచి ఉంది. కూచున్న వ్యక్తుల్లో ఫారెస్టరురాజూ, గార్డు అప్పారావూ ఉన్నారు. వాళ్ళిద్దరి మధ్యగా తెల్లనిపంచా కళ్ళీకమీజూ, తెల్లని ఖరీదైన కళ్ళద్దాల్తో ఒక వ్యక్తి ఖరీదుగా కూర్చున్నాడు.

అతడు చాలా డాబుసరిగా కనిపిస్తున్న ఫారెస్టరు రాజుతోగానీ గార్డుఅప్పారావుతోగానీ కలుపుగోలు తనంగా ఉన్నాడేకాని డాబుసరిగా ప్రవర్తిస్తున్నట్టు కనిపించలేదు. మరిద్దరు ఆఫీసు గుమస్తాలు ఆ వ్యక్తికి ఎదరగా కూర్చున్నారు.

గడ్డిసెట్టికి మిగతా ముగ్గుర్నీ తెలియదు. వాళ్ళమధ్యగా సీసాలూ, గళాసులూ సోడా బుడ్లూ ఉన్నాయి. అందరూ బాగా తాగినట్టు స్పష్టంగా కనిపిస్తున్నారు. అదిచూసి గడ్డిసెట్టి

"ఇదేటి నాయనా! ఇలాటప్పు దొచ్చినాను. ఇప్పుడెందు కిటుకొచ్చినావని సెప్పి మక్కలిరగదంతారు గావాల! ఏటి సెయ్యడం బావో!" అని పక్కకు తప్పుకొని నిల్చున్నాడు.

లోపలున్నవాళ్ళు ఇదేదీ గమనించినట్టు లేదు. వాళ్ళంతా ఒకసారి పకపకమని నవ్వేరు. గళాసులు గలగల లాడించేరు. రెండుసోడాలుకొట్టిన శబ్దం గట్టిగానే వినిపించింది. వెంటనే గార్డు అప్పారావు మాటాడ్డం మొదలుపెట్టాడు. అతడు ఎదురుగా కూర్చున్న ఫారెస్టు కంట్రాక్టరుతో

"గురయ్య కంట్రాక్టరు గురూ! ఈ మందు ఎంతయితే మాత్రం నాకేటి సరిపడతాది. రాజు బాబుకీ అందదులెండి. అదుగో అగుమస్తాబాబు లికినాటుమందు అలబాటులేదు గాబట్టి ఆలకి కొంచెం పడతాదేటో?"

నువ్వెప్పుడైనా తాగేవోలేదోగాని గురయ్య గురూ! ఇప్పుడు మన ఫారెస్టులో కావలసినంత జీలుగుకల్లు దొరుకుతంది. అది అప్పుడే చెట్టు నుండి దించిందిగానైతే బిడ్డికి బిడ్డి గటగటమని ఎత్తివొచ్చును. అది తాగిన ఒక్కొక్క కొండనాకొడుకూ ఎలాగ బలిసిపోతున్నాడనుకొంటన్నా వేటి? అంతేసి దండలూ ఇంతేసికండలుతోటి నల్లమద్దిమానుల్లాగ కనబడ తన్నారు, ఇది మనకి డబ్బు కర్చేగానీ దాని ముందల దిలాదూరే!" అన్నాడు.

గురయ్య కాంట్రాక్టరు అది విని

"నేనూ అలాగే విన్నాను.అలాటప్పుడు అదే ఎందుకు తెప్పించ లేదూ! ఇప్పుడు డబ్బు తగలడిపోయిన తరువాత చెబితే నేనేటి జేస్తాను" అన్నాడు.

అప్పారావుగార్డు పకపకనవ్వేడు. నవ్వుతూ

"నాకు తెల్దుగదా! అడివినుండి తిరిగొస్తే పార్టీ ఉన్నాదని తెలి సింది. అప్పుడు కప్పుడు ఏటిజేస్తాను" అన్నాడు.

గురయ్య గ్లాసులోని విస్కీ గటగటా తాగేసి

"గుంటనికూడా బుక్ చేశాను. మరి రెండు ఫుల్‌బాటిళ్ళకు పంపిం చాను. చాలదంటారా రాజుగారూ!" అని ఫారెస్టరు రాజుని అడిగాడు.

రాజు సమాధానం చెప్పకముందే అప్పారావు

"గుంటంటే, ఇక్కడున్న అల్లా మాదిగముండేనా? దానికి మందు కొట్టేసి డబ్బు దొబ్బడవే( తెలుసునుగానీ మరేటి తెలుసును? నిష్కార ణంగా రెండొందలు నీట్లపోస్సేరు" అన్నాడు.

గురయ్య కాంట్రాక్టరు బాధగా

"ముందేటీ చెప్పవు. మందు కొట్టేసి వ్యాఖ్యానాలు మొదలెడతావు. నాకేటి సరదా! డబ్బు తగలేసుకోడానికి" అన్నాడు.

గార్డుఅప్పారావు పకపక నవ్వుతూ నవ్వును అపుకోలేక "హమ్మా హమ్మా" అంటున్నాడు.

గురయ్య కంట్రాక్టరు ఉక్రోషంగా

"ఎందుకలా నవ్వుతావు?" అని అడిగాడు.

గార్డు అప్పారావు మరి కొంచెం సేపు నవ్వి

"నీకు డబ్బు తగలేసుకోడానికి సరదా అని ఏ తలమాసినాకొడుకు అన్నాడు గురయ్యగురూ! మాకింద రెండొందలు కర్చెడితే నీకు రెండు వేల రూపాయల లాభం మేము చూపించలేదేటి? రెండు లోడులు గుగ్గిలం ధూలాలు ఎంతోటి రిస్కు మీద వొదిలామో నీకుతెల్దేటి? మందంతా ఊరు సొమ్ముతోటి రామ్మందిరం కట్టించేసి, సొంత సొమ్ముతోటి చెక్క బజన చేయించడవేఁ గదా! నాకు తెల్దా గురూ! ఇది గిలాటి యిషయాల్లో ఈతల పండిపోయింది" అన్నాడు పండని తలని చూపిస్తూ

గురయ్య కంట్రాక్టరు గతుక్కుమన్నాడు. మనసులోనే "నాదేతప్పు, కదిపితే కంపు, దొంగనాకొడుకు!" అనుకొని ముఖం ముడుచుకున్నాడు.

ఫారెస్టరు రాజు ఇది గ్రహించి అప్పారావుతో

"ఒరే అప్పారావూ! నీ నోరుందే అది .... దాన్నేటనాలో నాకు తెల్దురా! తిన్నోడికే తిడతావు" అన్నాడు మందలింపుగా.

అప్పారావు వినయం నటిస్తూ

"తప్పయిపోయింది. గురయ్యగురువు దగ్గిర చనువుగదా!" అన్నాడు.

గురయ్య సర్దుకున్నాడు.

"అప్పార్రావుది నోటిదురుసే గానీ మాటకి ప్రాణం వదిలేస్తాడు" అని పొగిడాడు.

అప్పారావుగార్డు గురయ్యాని చూసి మనసులో

''హమ్మ దొంగనాకొడకా! కొండెక్కించి కిందకి తోసియ్యాలని చూస్తున్నావురా? నాది నాచేతిల పడకుండా ముందుముందు నీలారీ లెలాగ వెళ్తాయో చూస్తాను" అనుకున్నాడు. ఆ అలోచన బైట పడనీయకుండా

''గురయ్యగురూ! గంటల గయిరమ్మ పకోడీ మాచెడ్డవ్రగుంది. మరి నాలుగు పొట్లాలు తెప్పిద్దూ! గయిరమ్మ సంగతి నీకు తెల్దుగాని గురూ! దాని పకోడీ ముక్క నవిలితే గంటదాకా ఎలాగైతే గూబగుయ్యి మంటాదో అది పట్టుకుందంటే గంటలకొద్ది మగోడ్ని వదల్దుగాక వదల్దు. ఉడుంపట్టు. అందుకే దానికి గంటల గయిరమ్మని పేరెట్టేరు" అన్నాడు.

గురయ్య కంట్రాక్టరుతో సహ కూచున్న వాళ్ళంతా పకపకమని నవ్వేరు. అప్పారావు కూడా నవ్వుతూ

"ఒరేఎవుడ్రా అక్కడ?" అనికేక వేశాడు.

బైటనున్న గడ్డిసెట్టికి పలకాలోలేదో తెలియక ఊరుకున్నాడు. ఎవరూ పలక్కపోయేసరికి అప్పారావు కోపంగా

''ఎవుడ్రా! సెవిటినా కొడకల్లారా! పలకరేంవిరా?'' అని పిలిచాడు.

అప్పుడు గడ్డిసెట్టి సర్దుకొని

"ఏటి బావూ!'' అని లోపలికి తొంగి చూసేడు.

అప్పారావు గడ్డిసెట్టిని చూసి

''ఓరె! నువ్వురా! నీ కెవుడ్రా ఇక్కడికి రమ్మన్నాడు?'' అన్నాడు.

గడ్డిసెట్టి భయపడుతూ

"మీరేగదా బావూ! రమ్మని సొప్పినారు'' అన్నాడు మెల్లగా.

అప్పారావు మరీకోపంగా

''రమ్మన్నాను గదా అని, నేనూ నా పెళ్ళం కలసి మంచం మీద పడుకున్నప్పుడు గూడా యెలిపొస్తావేటిరా సెటకారి నాకొడకా! రా ఇటు'' అనిపిలిచాడు.

గడ్డిసెట్టి తంతాడేమోనని భయపడి ఉన్నదగ్గరే కదలకుండా నిలబడి పోయాడు. అప్పారావు మరీ గట్టిగా

"రమ్మంటే రాటకర్రలా పాతుకుపోనావేట్రా! రా ఇటు....నా కొడకా!" అని అరిచేడు.

మరి తప్పదని గడ్డిసెట్టి లోనికి వెళ్ళాడు. గురయ్య కంట్రాక్టరు రూపాయి నోటుని మడిచి గడ్డిసెట్టి ముందుకు విసిరాడు. అప్పారావు అదే ధోరిణిలో

"ఒరే సాకల్నాకొడకా! నీకు పాకోడీ కొండం తెలుసునట్రా! అదుగో మర్రిచెట్టుకి ఎదరగా పాకేసుకోనుంది చూడు. అంతేసి కళ్ళూ ఇంతేసి చెవులూ, బారడు కొప్పూ, బానంత కడుపూ తాటకి తల్లిలాగ! దాన్నే గంటల గయిరమ్మంటారు. దాని దగ్గరకెల్లి రూపాయి పకోడి అప్పారావుగార్డు ఇమ్మన్నాడని చెప్పు. తక్కువగా కట్టిందా.... అది గంటదాకా వదలపోతే నేను రోజంతా వదల్నని వార్నింగియ్యి." అన్నాడు.

మళ్ళీ అంతా నవ్వేరు.

గడ్డిసెట్టి రూపాయి తీసుకొని పకోడీకోసం బయల్దేరాడు. గంటల గయిరమ్మ దుకాణం వెతికి అప్పారావుగార్డు ఇమ్మన్నాడని రూపాయి పకోడి కట్టించి తీసుకువెళ్ళాడు.

గడ్డిసెట్టి వెళ్ళేసరికి అందరి గ్లాసుల్లోనూ నిండుగా మందుపోసి ఉంది. గడ్డిసెట్టి పకోడీ పొట్లాలు వాళ్ళ మధ్యన పెట్టి నిలబడ్డాడు. నిలబడిన గడ్డిసెట్టితో అప్పారావు

"ఒరే! నువ్వు అవతల నిలబడు. ఈపనై పోగానే నీపనిచూస్తాను" అన్నాడు.

గడ్డిసెట్టి అప్పారావుగార్డుకి తన పని జ్ఞాపకంలో ఉన్నందుకు సంతోషిస్తూ బైటకు వచ్చి నిల్చున్నాడు.

అంతవరకూ పెద్దగా మాటాడని ఫారెస్టరురాజు అప్పారావుతో

''ఒరే అప్పారావూ! పెట్టి ఇవాళ ఎలా జరిగింది? పని బాగానే అయింది గదా! రెండు నెలల్లో ప్లానిటేషన్ పూర్తి కావాలి. లేకపోతే రేంజరు దంచుతాడు'' అన్నాడు.

అప్పారావు గర్వంగా

''పనేటి? ఒక్కొక్కడికీ పిర్రమీద తన్ని చేయిస్తున్నాను. వారం రోజులు పోయిం తరవాత రేంజర్ని తీసుకురండి. దంగయిపోకుండా ఉంటే నాపేరు తల్లికి మొగుడు....ఛ....ఛ....అప్పారావే కాదు.'' అన్నాడు.

గురయ్య కంట్రాక్టరు అప్పారావుని

''మందు కొట్టేసి ఇంటి కెళ్తావా? లేకపోతే ఆ గుంటని చూసి వెళ్తావా?'' అని అడిగాడు.

అప్పారావు గురయ్యను వారగా చూస్తూ

''గురయ్య గురూ! నువ్వు దేవాంతకుడిమీద దేవాంతకుడివి. నాకు తెల్దేటి? ఐదేసి రూపాయల కొక గుగ్గిలం చెట్టుని ఆ కొండనాకొడుకుల దగ్గర కొనేసి మా మొకానికింత బెల్లంముక్క రాసేసి పదిహేనొందలకి అమ్ముతన్నావు. మనపనంతా అడివిని తినేసి అకుని తుడిసేడవేగదా?నాకేదో పారేవలసింది పారిద్దూ. ఆ గుంటెందుకు? అయినా గురయ్య గురూ! నాకు తెలకడుగుతాను. ఆ ఛత్కారీ ముండంటే మీ కందరికీ ఎందుకంత మోజు? అడివికి కర్రలకని వస్తున్న గుంటలున్నారు చూసేవా? ఆలెలాగుంటారో ఎప్పుడన్న చూసేవా? అంత కొక దండ ఇంతకొక తొడ పిక్కల్లా గుంటారు. అయితే నీలాటి సెంటుగాళ్ళకి ఆలదగ్గిర కంపు నచ్చదనుకో! నీ కంత ఇదైతే రూపాయి సబ్బు బిళ్ళతోటి గెడ్డలో తానం ఆడిరమ్మన మను. అప్పుడా గుంటల మజా చూడు.

నేనంటావా? రోజుకో తుప్పదగ్గిర ఒక కోకిప్పుతాన్నాను. కాకెం దుకీ బుకింగు గుంట. మీరు చూసుకుందురూ! నేను ఇంటి కెళిపోతాను.

పొద్దుపోయేసరికి ఇంటి కెళ్ళకపోతే చీపురు పట్టుకొని కాళికాదేవి లాగ నిలబడతాది నా పెళ్ళాం. దానికి నామీద ఎక్కడలేని అనుమానం.

గురయ్యగురూ! కడుపు చింపుకుంటే కాలమీద పడతాది గానీ నువ్విప్పుడు బుక్ చేశావు చూసేవా? ఆ మాదిగముండ. అదైనా ఒకప్పుడు నీ దగ్గర డబ్బుల్లేకపోతే ఆరువొప్పు కుంటాదేటోగానీ; నా పెళ్ళాంఉంది అలాటిదాన్ని ఎక్కడా చూడలేదంటే నమ్ము! సాయంకాలం ఇంటికాడ కొచ్చేసరికి అయిదురూపాయలు ఎవుడి బుర్రకొట్టయినా, అడుక్కోనయినా తేకపోతే అడుగు ఇంట్లోకాదు, గడపలోకూడా పెట్టనివ్వదు.'' అనిరెండో గ్లాసుకూడా పూర్తిచేసి లేచి నిలబడ్డాడు. నిలబడినప్పుడు కొద్దిగా తూలి తమాయించుకున్నాడు. జేబులోనుండి సిగరెట్టుతీసి ముట్టించి పొగవదిలిన తరువాత.

"మరందుచేతను గురయ్యగురూ! తంతే దమ్మిడీ నాదగ్గిటలేదు. ఇంత కర్చెట్టావు. ఐదు పడిద్దూ! దాని మొకాన కొడతాను'' అని అడిగాడు.

ఫారెస్టరురాజు అప్పారావు మాటలకు నవ్వుతూ

"ఒరే తల్లికి మొగుడూ! నిన్ను సంతోష పెట్టడం నిన్ను పుట్టించాడు అబ్రహ్మదేవుడికూడా వశం కాదురా! మందు కొట్టేసేవు. మా కందరికన్నా ఎక్కువే తిన్నావు. ముళ్ళీ నీకు ఐదు రూపాయలు దక్షిణ కూడా కావాలట్రా?'' అన్నాడు.

అప్పారావు కూడా నిషాలో

"రాజుబాబూ! నాకు దెప్పడం ఎందుకు • నెలకొక తులబంగారం కొనపోతే అమ్మగారు మిమ్మల్ని ఫస్టుతారీకున ఇంట్లో అడుగెట్టనిస్తారేటి పెద్దోళ్ళవి పలహారాలు; చిన్నోళ్ళవి చిల్లర తిళ్ళు!'' బుసబుస కిక్కునవ్వు నవ్వేడు.

ఫారెస్టరు రాజుకి కాస్త కోపం వచ్చినా తమాయించుకున్నాడు. ఆ స్థితిలో అతను గట్టిగా అప్పారావుగార్డుని కసిరితే అది మనసులోఉంచు

కొని తిన్నగా రాజు ఇంటికి వెళ్ళి మాదిగ ముండతో ఫారెస్టరు రాజు కులుకుతున్నాడని నిజంగానే చెప్పేస్తాడు. ఆ భయంలోపలుండి బైటకు మాత్రం నలుగుర్లో పరువుపోకుండా అప్పారావును మెత్తగా మందలిస్తూ

"ఇంటికెళ్ళరా అప్పారావూ ! తాగి నువ్వేటి జేస్తావో నీకే తెలియదు.'' అన్నాడు.

అప్పారావు గురయ్యతో

''గురూ ! ఐదు మాటేటి ?'' అని అడిగాడు.

గురయ్య లోపల నిప్పులు మింగుతూ

"ఐదుకేటుంది? పట్టుకెళ్ళు !" అని ఐదు రూపాయలు నోట్లకట్టలో నుండి ఎంచి తీసి ఇచ్చేడు.

అప్పారావు ఆనందంగా

"వస్తానుమరి. అందరి దగ్గిరా సెలవు మరి!" అని చెప్పి రెండడుగులు వేశాడు.

అతడలా ద్వారం దాటగానే ఫారెస్టరు రాజు గురయ్యతో

ఈడెంత నక్క చిక్కుల టక్కులగాడో ఈడిపెళ్ళం అంతకంటే టక్కుటమార గజగర్ణ వ్యవహారం. అది పూర్వజన్మలో ఏముండల కంపెనీలోనో ఐదు రూపాయల రేటుసానిగా పుట్టిఉంటాది. ఈ జన్మలో వీడి దగ్గర ఇలా వసూలు చేస్తుంది. వీడు తల్లికి మొగుడైతే అది వీడికి రంకు మొగుడు అని తన వ్యాఖ్యానానికి తనే గలగలా నవ్వేడు.

రాజు వేసిన విట్టుకి నవ్వకపోతే దొంగకలప లోడ్లు రావుగదా అని గురయ్య కంట్రాక్టరు నవ్వేడు.పార్టీ ఇచ్చిన గురయ్య నవ్వుతున్నప్పుడు మనం నవ్వకపోతే బాగుండదని ఇద్దరు గుమస్తాలూ నవ్వేరు.

అదేమీ వినిపించుకోకుండా అప్పారావు గడ్డిసెట్టిని పిలిచి

"ఒరే ! నీ గొడ్డలిచ్చేస్తాను. నాతో ఇంటి దుకా రారా !" అన్నాడు

గడ్డిసెట్టి వినయంగా

"సిత్తం" అన్నాడు.

అప్పారావు ముందు నడుస్తూ వెనక వస్తున్న గడ్డియ్యతో

"ఒరే! నీకు పెళ్ళాం ఉందిరా?"

''నేదు బాపూ!"

"ఏంరా? నిన్నొదిలీసి అది మరొకడి కెలిపోయిందేటిరా?"

నచ్చిపోనాది బాపూ?

''అదృష్టవంతుడివిరా! నా పెళ్ళాం ముండకి అలాటి చావొస్తే నేనెంతో సుఖపడుదును. దానికి చావురాదు గదా రాదు. దానికెందు కొస్తాది? నా చావు చూసిగానీ అది చవ్వదు గాక చవ్వదు'' అంటుండగా ఇల్లుదగ్గర పడ్డంతో మాటమార్చి

''గొడ్డలి కావాల్రా?'' అని అడిగాడు

గడ్డిసెట్టి మళ్ళీ

''సిత్తం" అని గార్డు ఇంటివైపు చూశాడు.

రోడ్డు రోలరులాగ ద్వారానికి అడ్డంగా ఒక ఆడమనిషి నిలబడి ఉంది. ఆవిడ చురచుర అప్పారావుగార్డువైపు చూస్తుంది. ఆవిడను చూసి అప్పారావుగార్డు పిల్లికూనలా అయిపోతూ గడపలో అడుగుపెట్టాడు. గడ్డిసెట్టి మాత్రం గడప ఎక్కకుండా క్రిందనే ఒక వారగా నిలబడ్డాడు. అప్పారావు గడపమీద నిలబడి

''ఒరే! ఇది నీ మొదట తప్పుకింద వదుల్తున్నాను. రేపుగాని పెట్టికి రాకపోతే నీకూ అడవికి రుణం తీరిపోయినట్టిగే లెక్క! ఇప్పుడుమాత్రం క్షమించేసేను. ఏదీ! నువ్వు తెచ్చింది అమ్మగారికి చదివించీ! గొడ్డలిచ్చేస్తాను'' అన్నాడు.

గడ్డిసెట్టి మొలనున్న ఐదు రూపాయలు తీసి గార్డుకు ఇవ్వబోయాడు. అప్పారావు అది పుచ్చుకోకుండా అమ్మగారి కిమ్మని సైగజేసాడు గడ్డిసెట్టి ద్వారం దగ్గర నిలబడ్డ రోలరుకు ఐదురూపాయలు అందించాడు. అంతవరకూ చురచుర చూస్తున్న రోలరు కళ్ళు ఐదు రూపాయల నోటు చూసి మిలమిల మెరిసాయి. గడ్డిసెట్టి ఇచ్చిన నోటును చీరకొంగుకుకట్టి లోనికి వెళ్ళి మూలనున్న గొడ్డలి తెచ్చింది.

గొడ్డలి పట్టుకు ఆమె ఇంట్లోనుండి ద్వారం దగ్గరకు వస్తుంటే, తాటకి కొంపదీసి గొడ్డలి పట్టుకొని రక్తంకోసం దేశంమీదకి బయల్దేరిందా? అన్నట్టు కనబడి గడ్డిసెట్టికి విపరీతమైన భయం వేసింది. ఆమె అందించిన గొడ్డలి తీసుకొని "బతుకు జీవుడా!" అనుకొని ఇంటి ముఖం పట్టేడు అప్పారావుగార్డు పెళ్ళాం వెనక ఇంటి లోనికి వెళ్ళిపోయాడు.

# 7

"అమ్మీ! గురు వొచ్చినాడు. గూనల బియ్యం ఉన్నాయి గావాల సూసి వొయ్యిమీదెట్టమీ" అన్నాడు సోమయ్య ఇంటిలోనికి వస్తూ

అదెమ్మ ముత్తేలుచేత పేలు చూపించుకుంటున్నదల్లా గాభరాగా లేచి

"గురు వొచ్చినాదేటి? బియ్యం నేవు. ఏటి సెయ్యడం?" అంటూ వట్టిపోయిన గూన దగ్గరకు వెళ్ళి చెయ్యిపెట్టి తడివింది.

సోమయ్యకూడా గాభరా పడ్డాడు.

"వొచ్చినాడు. మరొక సిటానిపల్లా మనింటికి వొత్తానన్నాడు. ఎనాగేమరి!" అని అదెమ్మ నడిగాడు

అదెమ్మ క్షణకాలం సమాధానం చెప్పలేదు. తరువాత ఉట్టిమీద చట్టిలోనున్న చోడి పిండిని జ్ఞాపకం చేసుకొని

"బియ్యం నేపోతే మరేటి సేత్తాం? సోడి పిండి కుసింత గద్దు ఉన్నాది గాదా! అదిగదీ అంబలి జేస్సి, సొండి సాంబన్న దగ్గిట బెల్లం ముక్క తెద్దుంగాని" అంది.

సొమయ్య విసుక్కున్నాడు. చోడిపిండి అంబలి గురువుకి పెట్ట వలసి వస్తున్నందుకు చిరాగ్గా అటూ ఇటూ తిరిగేడు. "సేతలకానీనేదని" మూడుసార్లు అనుకున్నాడు. మాటాడకుండా ఉట్టిమీద చోడిపిండి చట్టిని దించుతున్న ఆదెమ్మతో

"అమ్మీ! అది గప్పుడు గురువొచ్చినప్పుడు వొణ్ణం కోడికూరా వొండీసి ఎట్టినాంగదా। ఇది గిప్పుడు అంబలెనా గెడతావే?...." అనే టప్పటికి

"అది సరికాదు కామ్రేడ్స్। సమావేశంలో సమిష్టినిర్ణయం తీసు కుందాం" అంటూ అ ప్రాంతాన గురువుగా పిలవబడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాయకుడు సొమయ్య గడపలోనికి వచ్చాడు. అతనితోపాటుగా గద బలూ గడ్డిసెట్టికూడా గడపలోనికి వచ్చి గోడకు చేరబడి కూర్చున్నారు. గురువు గడపమధ్యన కూర్చుంటూ సోమయ్య చివరిమాట

"అంబలెలా గెడతావే" అన్నది విన్నాడు.

గురువుతో పాటుగా వచ్చిన వారందర్నీ చూసి సోమయ్య సిగ్గు పడుతూ గడపలోనికి వచ్చి, అప్పటికే కూర్చున్న వార్ని ఉద్దేశించి

"కూకొండి. కూకొండి।" అన్నాడు మర్యాద కోసం.

గురువు సోమయ్యను చూసి నవ్వుతూ

"కామ్రేడ్ ఏటి కోడిమాంసం అంటున్నావు?" అని అడిగాడు.

సోమయ్య ఇంకా సిగ్గుపడిపోతూ

"నేదు గురువూ। ఇంట్ల బియ్యం నేవు. సోడిపిండి ఉన్నాది. అది గది అంబలివేసి ఎట్టనానికి సిగ్గేత్తన్నాది" అన్నాడు.

గురువు మామూలు ధోరణిలో

"సోమయ్య। తప్పు చెయ్యకుండా సిగ్గుపడ్డం మంచి కమ్యూనిస్టు లక్షణంకాదు. మన దగ్గర ఏది ఉంటే అదే పెడతాం. లేనిపోని మర్యాదలు మనకి అనవసరం. ఎంత గొప్ప నాయకుడైనా మన దగ్గరకు వచ్చినప్పుడు

అతను అప్పగించిన పార్టీ పని జాగ్రత్తగా చెయ్యాలి గానీ అతని తిండి కోసం ఇతర సౌకర్యాలకోసం మనం తంటాలు పడగూడదు. మన నాయకులు కూడా అలా ఆలోచించరు. మనమేమీ కాంగ్రెసు మంత్రులంకాము. కోళ్ళూ గొర్రెలూ పలావులూ పాయసాలూ తినడానికి. మనది నిరుపేదల పార్టీ. ఉంటే తింటాం. లేకపోతే పస్తులుంటాం. ఉన్నదానితోనే సర్దుకుంటాం. నువ్వు అర్జంటుగా అంబలి వండించు. ఈలోగా సమావేశం పూర్తి చేద్దాం. ఎక్కడ సమావేశానికి ఏర్పాటు చేశావు " అని అడిగాడు.

సోమయ్య మరింత సిగ్గుపడిపోయాడు. వెంటనే సర్దుకుంటూ

"నట్టింటిలోన కూకుందంగాని రండి" అని పిలిచాడు.

గడపలో కూర్చున్నవారంతా ఇంటిలోనికి వెళ్ళారు. సోమయ్య గురువుకి పీటవేశాడు. గురువుపీటమీద కూర్చున్నాడు. మిగతా వాళ్ళంతా సర్దుకొని గురువుకి ఎదరగా కూర్చున్నారు. సోమయ్య పెరటిలోనికితొంగి చూసి

"ఆదీ ! బేగి అంబలి ఉడకబెట్టిమీ !" అని కేక వేశాడు

ఆదెమ్మ పొయ్యి ఊదుతున్నదల్లా సోమయ్య కేకవిని

"అనాగే ! సిటంలోన అయిపోతాది" అంది.

గురువు పీటమీదనుండి ఒకసారి కదిలి సరిగా సర్దుకొని

"కామ్రేడ్స్ ! ఫారెస్టు డిపార్టుమెంటు మీమీద అక్రమంగా జరుపుతున్న జులుం తెలిసింది. ప్లానిటేషన్‌కి అడవి మీచేత నరికించినప్పుడు మీకు రోజు కూలి గవర్నమెంటు రేటు ప్రకారం ఇవ్వాలి.అదికూడా ఇవ్వకుండా మీచేత నిర్బంధంగా వెట్టి చేయించుకోవడం పద్దతికి విరుద్ధం. దీని మీద ముఖ్యంగా మనం ఒక నిర్ణయానికి రావాలి. అది అలా ఉండగా కామ్రేడ్ సోమయ్య నాకు గడ్డిసెట్టిని గురించి చెప్పాడు. అతనికి మన పార్టీ సభ్యత్వం ఇవ్వాలనుకుంటున్నాం.మీఅంతమంది ఉద్దేశ్యంచెప్పండి" అని ఆగి అందరి ముఖాలపైపు పరిశీలనగా చూసాడు.

అంతమందీ ఏకగ్రీవంగా అంగీకారాన్ని తెలియజేసారు. గడ్డిసెట్టి ముఖం ఆనందంతో మెరిసిపోయింది. గురువు తిరిగి మాటాడుతూ

"గడ్డిసెట్టి మన కామ్రేడ్. ఇకనుండి అతను మన పార్టీలో భాగస్వామి. కష్టంలోనూ, సుఖంలోనూ అతను పార్టీకి కట్టుబడి ఉండాలి. నాయుడువలసలో మన పార్టీ లేదుగాబట్టి గదబవలసలోనే మీతోపాటు సభ్యుడుగా ఉంటాడు." అన్నాడు.

సోమయ్య ఆనందంతో

"గడ్డిసెట్టిలాటి మంచోడ్ని పారిటీలోకి నాక్కోవడం సానా బాగున్నాది. నాయిడొలసలోనా, ఎట్టిసాకరీల్తోటి ఇక్కట్లు పడతనోళ్ళెల్ని సానామందిని సూసినాను. గడ్డియ్య అంతమందికీ సెపితే నాయుడొలసలోన గూడా పారిటీ పెట్టొచ్చును" అన్నాడు.

గురువు సోమయ్య ఆ మాటను బలపరిచాడు. తనమీద పార్టీ గురువుకి కూడా అంత నమ్మకమున్నందుకు గడ్డిసెట్టి మరొకసారి సంతోషించాడు.

అప్పుడు గురువు తిరిగి ప్రారంభిస్తూ

"మన పీక పోయినా ఇక్కడి నిర్ణయాలు గానీ, రహస్యాలుగానీ బైటకు పొక్కనియ్యగూడదు. అది ముఖ్యంగా మనం పాటించవలసిన మొదటి సంగతి" అని చెప్పాడు.

దానికి అక్కడ కూర్చున్న సభ్యులంతా

"మా బొందిల్లోన జీవుడుండగా ఇదిగిక్కడి సంగతులు పైకి పొక్కనియ్యం" అన్నారు.

సోమయ్యమాత్రం అనుమానంగా అదెమ్మ మొగుడు సుక్కడివైపు చూసాడు. సుక్కడు మూలకి వొదిగిపోతూ సోమయ్యవైపు చూడలేక కళ్ళు దించుకున్నాడు. సోమయ్య అనుమానం మనసులోనే ఉంచుకుంటూ

"కల్లు సుక్కలికి కక్కుర్తి పడిపోయినోలు మన్లోనూ ఉంతారు.

అదిగా నా కొడుకుల్ని తన్నీసి తగిలియ్యాల" అన్నాడు,

సుక్కడికి ఎవరో ముల్లుకర్రతో గుండెలమీద పొడిచినట్టయింది. కొంచెం నిషాలో ఉండటం చేత గురువును కూడా గమనించకుండా

"పావులేటి కల్లు సుక్కలికి కక్కుర్తి పడిపోతన్నారు? అదిగా మాటకొత్తే ఇది గిక్కడ కూకున్నోడెవుడు కిల్లుతాగనోడేటి?" అని అడిగాడు.

గురువు విషయం గ్రహించి సర్దుతూ

"మనం మాటాడుకుంటున్నప్పుడు ఎవరైనా ఏ విషయం గురించి మాటాడినా, ఇంకొకరు వాళ్ళను గురించి అన్నట్టు అభిప్రాయ పడకూడదు. తప్పుంటే దిద్దుకోవాలి. కోపతాపాలవల్ల ఉపాయోగం ఉండదు. సోమయ్య చెప్పిందాంట్లో చాలా సబవుంది. కష్టాల్లో, పస్తుల్లో దోపిడీలో బ్రతుకుతున్న మనలాంటి శ్రామికజనం కమ్యూనిస్టులుగా మారి తిరగబడితే ఈ దోపిడీ వ్యవస్థ నిముషంలో కూలిపోతుంది. కానీ మనలోనూ ద్రోహులుంటారు. కానీకి అమ్ముడుపోయి భూస్వాములకు గులాములుగా తయారైపోయిన వాళ్ళుంటారు. పరిస్థితులు వారినలా మారుస్తాయి. వారికి సరైన జ్ఞానాన్ని కలుగజేసి మనవైపు తిప్పుకోవాలి. అప్పటికీ ద్రోహులుగా వారు బైటపడ్డప్పుడు వాళ్ళను గురించి తగిన జాగ్రత్త తీసుకోవాలి. మన పార్టీ యెంత ముందుకు పోతున్నప్పటికీ ఎప్పటికప్పుడు మనం ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ రోజున పార్టీలో ప్రధానంగా కనపడినవాడు రేపు ద్రోహిగా మారవచ్చును. అలా మారినవాడు వాడెంత గొప్పవాడుగానీ ఎంతటి ముఖ్యమైన స్థానంలో ఉండనీ, ఏరి పారేయడంలో ఏమాత్రం సంశయించకూడదు" అని చెప్పి సోమయ్యనుద్దేశించి

"సరే, ఇక్కడి పరిస్థితి గురించి చెప్పండి" అని అడిగాడు.

సోమయ్య కొంచెంసేపు మౌనం వహించాడు. మిగిలినవాళ్ళంతా సోమయ్య ఏం చెప్తాడో నని నిశ్శబ్దంగా చూస్తున్నారు. పెరట్లోని

పొయ్యిమీద అంబలి కుతకుతమని ఉడుకుతున్న శబ్దం మినహా మరే ఇతర శబ్దమూలేదు. అంతటి నిశ్శబ్దంలో సోమయ్య గట్టిగా ఒకసారి ఊపిరిపీల్చి వదిలాడు. తరువాత నెమ్మదిగా

"నీకు తెలన్దేటి ఇక్కడున్నాది. ఈ తూరుపు ముటాకి ముటా అంతోటిన్నా నీకు కొట్టేసిని పిండి. అదిగా పారిస్టు నా కొడుకుల బాద పడనే పోతన్నాఁవు. ఆలు మా గుడ్డిలమీదున్న సింతగున్నలికి గూడా మామూలు వొసూలు సేత్తన్నారు. సెట్టుకు వయిదేసి రూపాయలు మామూ లంతన్నారు. ఇప్పపువ్వుకీ, ఇప్పపప్పుకి సెప్ప క్కర్నేదు. అయిగయేగావు. తాడిబంక నేదా? దానికాక కంట్రాక్టు జావుని ఏసినారు. ఆడు మనూర్ల సాంబన్ననేడా, ఆడికి వొప్పజెప్పి మాఁవు ఏరిన బంకంతా కొంటన్నాడు. సాంబన్న ఆడిట్టమొచ్చినట్టిగ మా దగ్గిట కొనీసి ఆడికివొప్పచెపుతండు. మాఁవుగాని మరెవులికైనా అమ్మితే కొనోళ్ళల్ని మనోళ్ళ కలిపేసి కేసు పెడతాఁవని బెదిరిస్తున్నారు. ఇది గినాగ తాడిబంకా, అడ్డాకులూ, కరకాయలూ, సీపుర్లూ వొకటేటి అడివిపంటకంతటికున్నా దోసుక తింటానికి ఒకొకడు తయారయిపోనాడు ఇకనంతావా? ఆ పారిస్టేరు రాజుగాడూ. ఆ గరుడు అప్పారావుగాడూ ఆల జులుం ఎరికేగదా? అగ్గికి గాలిసాయంగా ఆలకి ఈ సొండోడు తోడు ఇదిగిది, ఇక్కడ తిత్తవ" అని ముగించ బోయాడు.

సోమయ్య ఇంకా ముగించీ ముగించక ముందే గడ్డిసెట్టి అందు కున్నాడు.

"ఏటి సొప్పను బావూ! మాఁవు సాకిలోలఁవు రోజూ కర్రలకని అడవికి రావు. రేవుకి గూనకిందకి కర్ర పేడు నేపోతే వాత్తాఁవు. అదీగా మత్తరం దానికి గూడా ఎట్టిసెయ్యమని పట్టుకోని తిట్టి తన్ని తీసి కెల్తన్నారు ఎట్టికొత్తే అదిగవతల రేవు జరగదు. రేవు వెట్టకపోతే నాయుడు బావులు కల్లెర్రగించీసి మీ కల్లు నెత్తులమీది కెలిపోనాయేట్రా? సాకల్నంటి కొడకల్లారా. అని తిడతన్నారు. ముందలకెల్తే నుయ్యి, ఎనకాలకెల్తే గోయ్య నాగున్నాది మా బతుకు. ఒకరోజు ఎట్టికిరానే దని సెప్పి ఆ తల్లికి మొగుడుగాడు నాకు నానా తిట్లులూతిట్టి గొడ్డలి

నాకొక్కని వయిదు రూపాయలుచ్చుకొని గొడ్డలిచ్చినాడు. ఈ పింటి ఉక్క బతుకులు బావూ మాయి. తమరు అన్నీ తెలిసినోలు, రచ్చించాల బావూ" అన్నాడు.

గురువు ముఖంలో బాధా కోపమూ స్పష్టంగా కనిపించాయి. దాన్ని అణుచుకొని మామూలుగా కనిపించడానికి అతను ఊణకాలం ప్రయత్నం చేశాడు. తరువాత మెల్లగా

"ఇది చాలా అన్యాయం. దీన్ని మనం ఎదిరించి తీరాలి. యెదిరించాలంటే ఏ వక్కరివలనా జరగవలసిన పనికాదు. మీరు ఈ వెట్టి చాకిరికి గురైన వాళ్ళ నందరిని కూడగట్టాలి" అన్నాడు.

గడ్డిసెట్టి గురువు మాటలువిని సంతోషంగా

"అదిగదెంత సేపు. సిటంలోన సేసేత్తాం. మొన్నన మావూరు నాయిడింటికి గురయ్య కంట్రాట్టుబావొచ్చినాడు. ఆ బావుకి సకా, అదిగా పారిస్టోల మీదనపడదు. ఆ బావు డబ్బుతీసికోని కర్రలు నారీనోడ్లు అడ్డేసినారట. అతగాను సొప్పివొడు గదా! మనోలంతానూ కలుసుకోని రాజుబావు మీదనా అప్పారావు బావుమీదనా, పిటీసను ఎట్టమన్నాడు. మావోలు ఆ బావుకి పిటీసన రాయిమన్నారు. అతగానికి రాయిడం రాదనీసి, మరెవులు సేతనన్నా రాయించి ఏలిముద్దలెట్టి వడీమవి సొప్పి యెలిపోనాడు. తమరుగాని పిటీసన రాసి నా సేత కిచ్చినట్టయితే వొందల ఏని ముద్దర్లు యెట్టించేసి తమరికి వొప్పజెపుతాను" అన్నాడు.

గురువు గడ్డిసెట్టిని చూచి నవ్వుతూ

"కామ్రేడ్స్! గడ్డిసెట్టిచెప్పిందంతా విన్నారు గదా! ఈ గవర్నమెంటుమీద నమ్మకంతో అవినీతి చిన్నచిన్న ఉద్యోగుల్లోన మాత్రమే ఉందనుకొని మనం కూడా పూర్వం పిటీషన్లు పెట్టేవాళ్ళం. మన పార్టీ నాయకత్వం కూడా ఏదైనా సమస్యఉంటే పై అధికార్లకూ మంత్రులకూ కాగితాలుపెట్టమనేవాళ్ళు అనుభవం మీద తేలిందేమిటో

మనం చూశాము. ఈ వ్యవస్థ క్రిందినుండి మీదవరకూ అవినీతితో కుళ్ళిపోయింది.

సంవత్సరం క్రిందటి సంగతి గద్దిసెట్టికి తెలియకపోయినా మీరంతా గుర్తుకు తెచ్చుకోండి. మనం పార్టీ నిర్ణయానుసారం జిల్లా సెక్రటరీతో సంతల్లో పార్టీ ప్రచారం చేయటానికి వెళ్ళాము. సంతల్లో మనం చేసింది ఎర్ర జండాలు పట్టుకొని "కమ్యూనిస్టుపార్టీకి జై" అన్న నినాదం ఇవ్వడమే. అదికూడా సహించని అక్కడి భూస్వామి మన కళ్ళెదుటనే గుండాలచేత జిల్లా సెక్రటరీని కొట్టించాడు. అదిచూసి సహించలేని మన పార్టీ కామ్రేడ్ గొడ్డలి చిప్పతో ఆ భూస్వామి నెత్తిన ఒక్కటి కొట్టడానికి ప్రయత్నిస్తే సెక్రటరీ అతడ్ని మందలించాడు. తరువాత మన పార్టీ ముఖ్యులు పోలీసుస్టేషనుకు వెళ్ళి ఆ భూస్వామి పేరూ గుండాలపేర్లూ ఇచ్చి సరైన చర్య తీసుకోమని పిటీషను పెడితే అలాగేనని పోలీసులు మనవార్ని ఆసుపత్రికి డాక్టరు సర్టిఫికేటుకి తీసుకొని వెళ్తామని చెప్పి పోలీసువేనులో ఎక్కించి తాలూకాజైల్లో పెట్టారు. తరవాత ఆ భూస్వామికి అనుకూలంగా మనం సంతలు దోపిడీ చేస్తున్నామని స్టేట్‌మెంట్లు ఇచ్చారు. చివరికి పట్టపగలు మన కామ్రేడ్లని .. .... ఇద్దర్ని ఆ భూస్వామి కాల్చి చంపేడు!

ఇది అన్యాయమని రాష్ట్రకమిటీ అర్జీలు పెట్టింది. అయినా ఈ ప్రభుత్వం కిమ్మనలేదు. పైగా పత్రికలలో మనమీద అబద్ధపు ప్రచారం చేస్తూ భూస్వామి కొమ్ముకాసి అతడ్ని అతడి గూండాల్నీ మన మీదకు ఉసిగొలిపింది. వాడు గూండాలతో పోలీసులతో మన పార్టీని అణచడానికి సర్వప్రయత్నాలూ చేస్తున్నాడు. వాడికి ఈ ప్రాంతంలో నున్న భూస్వాములూ దళారీలూ, కాంట్రాక్టర్లూ ఇతర దోపిడి వర్గమంతా మద్దత్తు నిస్తుంది. త్వరలోనే మనం వీళ్ళతో తాడోపేడో తేల్చుకోవలసి ఉంటుంది. దీన్నిబట్టిమనం నేర్చుకోవలసిన పాఠం మన కళ్ళముందు కనబడుతుందిగదా!

ఈ గవర్నమెంటు మనదికాదు. దీని పోలీసులు మనకు రక్షణ

ఇవ్వరు. దీని కోర్టులు మనకు న్యాయం చేకూర్చవు. ఆస్తులు పోగేసు కున్న వాడి కోసమే మొత్తం ప్రభుత్వ యంత్రాంగమంతా పని చేసేది.

ఇప్పుడు ఈ విషయమే తీసుకోండి. మనము పిటీషను వ్రాసి ఫారెస్టు కన్సర్వేటరుకి పెడతామనుకోండి. అతడు దాన్ని ఒకసారి చూసినట్టు నటించి, డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసరుకి పంపిస్తాడు. అతడు దాన్ని రేంజరుకి పంపిస్తాడు. అంటే మనం ఎవడిమీద అన్యాయం చేస్తున్నాడని కాగితం పెడతామో వాడినే న్యాయవిచారణ చెయ్యమంటుంది ఈ ప్రభుత్వమూ దాని రూల్సున్నూ. వాడు ఏం రాస్తాడో మనకి తెలుసును గదా. బాగా ఇంగ్లీషువస్తే మంచిమంచి పదాల్తో ఇదంతా ఉత్తదేనని రాస్తాడు. కొంచెం మించితేపై ఆఫీసరు మాతికి ఇంత రాస్తాడు. ఇదీ తంతు.

అందులోకీ ఈ ఫారెస్టుడిపార్టుమెంటంటే ఫారెస్టునంతా పూర్తిగా తినేసిన వాళ్ళన్నమాట. కిందనుండి మీదవరకు ఎవరివాటాలు వాళ్ళవి. అందుచేత మన సమస్యకి మనమే నిలబడాలి. మన వెనుక మన ప్రజలు నిలబడునట్టు చూసుకోవాలి. దీనికి ప్రత్యక్ష చర్య చెయ్యాలి. మీరంతా ఏకంగా నిలబడి మన వాళ్ళలో విషయాన్ని బాగా ప్రచారంచేసి కూడ గట్టాలి. జులుం చేస్తే మనమూ అందుకు తగిన సన్నాహంలో ఉండాలి అంతేగానీ కాగితాలవలన ఏమాత్రం పని జరగదు" అని చుట్టముట్టిం చాడు, రెండు దమ్ములు గట్టిగ లాగి పొగవదిలిన తరువాత గడ్డిసెట్టి నుద్దేశించి

"కామ్రేడ్ ఆ గురయ్య కంట్రాక్టరున్నాడు. చూసావా? వాడి మీద ఫారెస్టు వాళ్ళు లంచం తీసికొని కూడా కేసు పెట్టారు. అందుకు వాళ్ళపైన వీడికి ఏడుపు. వీడికి పిటీషన్ రాయటం రాకకాదు. వీడి దస్తూరితో కాగితం ఉంటే అది వాళ్ళు గుర్తుపడితే వీడి పెట్టుబడి అంతా సర్వనాశనం అయిపోతుంది. అందుచేత వాడు ఇలాంటి సలహా ఇచ్చాడు

ఇలాంటి వాళ్ళంతా పగవాడిచేత పామును కొట్టించే రకాలు" అని ముగించాడు.

సోమయ్య మిగిలిన వాళ్ళ నుద్దేశించి

"నిబ్బగ గురువు సెప్పిందే సెయ్యాల. అదిగా ఎర్రజిందవగాడు తల్లికి మొగుడుగాడు ఎట్టీకి పిలిత్తే మాఁవు రాఁవు గాక రాఁవని కండితంగా సెప్పాల, అడేటిసేత్తాడో సూసిద్దుంగాని" అని బలపరిచాడు.

మిగిలిన వాళ్ళంతా అలాగే అంటే అలాగే అన్నారు.

అంబలి పొయ్యిమీదనుంచి దించి ఆదెమ్మకూడా వచ్చి ద్వార బంధంమీద కూర్చుని గురువు చెప్పేది సోమయ్య చెప్పింది వింది. గడ్డిసెట్టి పార్టీలో చేరినందుకు చాల సంతోష మనిపించింది. ఆ సంతోషంలో

"గురువెంత గొప్పోడు !! ఎన్నెన్ని తిత్తవలు ఎరుగును" అని మనసులోనే మెచ్చుకొంది. తరువాత మీటింగు అయిపోయిందని తెలిసికొని

"అంబలుడికిపోనాది. సల్లారిపోతే సవిగుండదు" అంది.

సోమయ్య అది విని

"సత్తుగిన్నిల వోంపీసివొట్రా" అని చెప్పాడు.

మిగిలిన కామ్రేడ్సంతా ఎవడిమట్టుకు వారు గురువు దగ్గరవిప్లవ శాల్యూట్ చేసి వెళ్ళి పోయారు. సోమయ్య గడ్డిసెట్టి ఆదెమ్మ మాత్రము మిగిలారు.

ఆదెమ్మ గిన్నెతో అంబలితెచ్చిగురువుముందు పెట్టి బెల్లంముక్క గిన్నె పక్కనుంచింది. గురువు గిన్నెను కాస్త ముందుకు లాక్కొని అంబలిని ఎంతో అప్యాయంగా జుర్రటం మొదలు పెట్టాడు. మధ్య మధ్య బెల్లం ముక్కను ముని పంటితో కొరుకుతూ క్షణంలో తినటం ముగించాడు.

పల్లంలో బ్రతికి మూడుపూటలా అన్నం కూరలతో తిన్న గురువు ఈ అడవులలో కొండలూ గాటీలూ ఎక్కి-దిగుతూ సవర జాతావు గూడలు తిరిగి వాళ్ళ పిల్లల్నె పెళ్ళి చేసుకొని వాళ్ళందరి తలలో నాలుకలాగ ఉంటూ వారు తింటున్న ఆకులూ, దుంపలూ, తేగలూ తింటూ వారితో పాటు కటిక నేలమీద నిద్రపోతూ పడుతున్న శ్రమను తలచుకొని

"గురువెంత గొప్పోడు" అనుకున్నాడు, అంబలి తిని చెయ్యి కడుక్కుంటున్న గురువును చూస్తూ సోమయ్య.

అదే సమయంలో గడ్డిసెట్టి గురువును చూసి

"కమినిస్తోలంతే మాసెడ్డ కానోలు. రగతాలు తాగతారు. పచ్చి మాంసాలు తింతారు. అని సొప్పినాడు నాయిడొలస నాయుడు. ఈ లెంతోటి మంచోలో నా రొండు కల్లతోటి ఇయాల సూసినాను, మా సెడ్డ మంచోలు. మంచోలు కాకపోతే? అల్లాకుక్కల కొడుకు, తల్లికి మొగుడు అప్పారావు గారుడు గాడు ఊల్లో కొస్తో కోడిమాంవసం కూరొండితేనేగానీతిండు. ఇంతోటి గురువు అంబలిజుర్రుకోనితాగితే నస్తం డంతే తెలస్తన్నాదిగాదా! ఈ బావులు మా కోసం ఇంతోటి ఇబ్బందులు పడుతుంటే మరీల కోసం గడ్డిపరకల్లాటి మా పేనాలు అడ్డెట్టి ఆది గప్పుడుపోతే ఏటిపోతాది?" అనుకున్నాడు.

ఎంగిలి గిన్నెను కడుగుతూ ఆదెమ్మకూడా

"కూడెట్టి నే పోనాను. ఈ పాపిట్టిసేతుల్తోటి బేపుల్లాటి బతుకులు బతకతన్న మాలాటోల కోసం ఎంతెంతోటి ఇక్కట్లు పడుతన్నారు?!" అని ఎవరికీ కినబడకుండ కళ్ళనీళ్ళు కార్చింది.

గురువు పైమీద తువ్వాలతో చెయ్యితుడుచుకుంటూ గడ్డిసెట్టి నుద్దేశించి

"కామ్రేడ్" అని పిలిచాడు.

గడ్డిసెట్టి పరవశించిపోతూ

"ఏటిబావూ !" అని దగ్గరగా వెళ్ళాడు.

గురువు గడ్డిసెట్టి భుజం తడుతూ

"నీకొక విషయం చెప్పాలి. ఏటీ అనుకోకు. పార్టీలోనున్న మన మంతా అన్నాతమ్ములం. ఇక్కడ ఎక్కువ వాళ్ళూ, తక్కువ వాళ్ళూ ఎవరూ ఉండరు. నువ్వు మాటి మాటికీ నన్ను తమరూ, బాబూ అని పిలవడం నన్ను అవమానించినట్లు నేను బాధపడుతున్నాను. పదిమందిలో నీకీ విషయం చెపితే నువ్వు చిన్నబుచ్చుకుంటావని అనలేదు. ఇక నుండి నన్ను నువ్వు కామ్రేడ్ అనే పిలవాలి. బాబూ, తమరూ అనకూడదు. ఏదీ ఒకసారి కామ్రేడ్ ! అని పిలువు చూద్దాం" అన్నాడు నవ్వుతూ.

గడ్డిసెట్టి గొప్పగా సిగ్గుపడిపోయాడు. సిగ్గులో మాటరాక తల వంచుకున్నాడు.

తలవంచుకున్న గడ్డిసెట్టిని చూసి ఆదెమ్మ గలగల నవ్వింది. ఆదెమ్మ నవ్వడంతో గడ్డిసెట్టిమరీ కుంచించుకు పోయాడు.అదిగమనించిన గురువు గడ్డిసెట్టి సిగ్గును వదలగొట్టడానికి

"ఆడపిల్ల నవ్వుతుంది. వేగం నన్ను కామ్రేడ్ అని పిలువు"అని రెచ్చగొట్టాడు.

గడ్డిసెట్టి శక్తినంతా కూడగట్టుకొని

"కామ్రేడ్" అన్నాడు.

గదబవలస గుడిసెలు కామ్రేడ్ అన్నాయి. తూరుపు కొండలూ కోనలూ, చెట్లూ, పుట్టలూ, వాగులూ, వంకలూ "కామ్రేడ్" అని ప్రతి ధ్వనించాయి.

గురువు సంతోషంగా గడ్డిసెట్టి భుజం రెండుసార్లు తట్టి

"వేరే పనుంది. అర్జంటుగా వెళ్ళాలి. వస్తాను కామ్రేడ్స్" అని చెయ్యెత్తి పిడికిలి బిగించాడు.

సోమయ్య, ఆదెమ్మ, గడ్డిసెట్టీ చెయ్యెత్తి ప్రతిగా పిడికిళ్ళు బిగించారు.

గురువును వూరి పొలిమేరల వరకూ సాగనంపడానికి సోమయ్య గురువువెనక వెళ్ళాడు. గడ్డిసెట్టి ఆడెమ్మలు గలగలానవ్వుతూ ఒకరి నొకరు చూసుకుంటూ గుడిసెలో మిగిలిపోయారు.

ఆ చల్లని ప్రశాంతమైన సమయంలో నిశ్శబ్ద వాతావరణంలో గుడిసె ఆనందంతో గుబగుబలాడింది.

# 8

గదబవలస చుట్టూవున్న మామిడిచెట్లు కొమ్మలు విరిగిపోయేటట్టు కాపుకాశాయి. బాతుగుడ్లంతలేసి కాయల్తో బరువుకు తలవంచుకున్న మామిడితోపుల చుట్టూ కంచెగా వేయబడినట్టున్న జీడిమామిడిచెట్లు అంతలేసి పసుపుపచ్చని పళ్ళతో చివర్న పిక్కలతో చక్కగా, నిండుగా ముద్దుగా కనుల పండువుగా ఉన్నాయి. జీడిమామిడి చెట్లకు పోటీగా జారు మామిడిచెట్లు పచ్చని లేత ఆకులమధ్య నల్లని పళ్ళ గుత్తులతో నిండుగా ఉన్నాయి.

గదబవలసలోని గదబలు ఆవేళ చీకటితోనే హడావుడిగా లేచారు అంతకు వారంరోజులు ముందునుండీ కొత్తలపండుగ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న పిల్లలూ ఆడవాళ్ళూ హడావుడిగా గల్లంతుగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

అప్పటికే చుట్టుపక్కల వలసల వేటగాళ్ళు ఉరులు పట్టుకొని గదబవలస వేటగాళ్ళతో కలిసి తుప్పా, డొంకలతోనున్న మెరక భూముల మీదకి చెవుంపిల్లుల వేటకి బయిల్దేరారు. పిల్లలంతా కేరింతలు కొడుతూ రకరకాల పక్షుల, కోళ్ళ రంగురంగుల వెంట్రుకల్ని ఏరుతున్నారు.

కొత్తల పండగజేసి ఆ వేళ గదబవలస కొత్త కలుస్తుంది.అప్పటి

వరకు మామిడికాయ రుచిచూడటానికి కూడా వీలులేదు. కొత్తల పండగ చేసిననాడు వేటకువెళ్ళిన మగవాళ్ళు తెచ్చిన చెవుల పిల్లులను కోసి సరి సమానంగా మంసాన్ని పంచుకుంటారు.

పాటలు పాడగలిగిన ఆడామగా జట్లు జట్లుగా బయలుదేరి చుట్టు పక్కల వలసలకు పాటలు పాడ్డానికి వెళ్తారు. ప్రతిఇంటముందరా పాటలు పాడి ఆడామగా జట్లుజట్లుగా ఆడుతూ, వాళ్ళిచ్చిన బియ్యం తెస్తారు.

అలావచ్చిన బియ్యమూ, వేటనుండి తెచ్చినమాంసం, ఈతకల్లూ జీలుగుకల్లు, ఇప్పసారా తాగి, తిని కొత్తలపండగ ముగిస్తారు.

ఆరోజు నుండి అంతా మామిడికాయలు తింటారు.

పండగనాడు ఆదెమ్మ చాలా సంతోషంగా వుంది. గెడ్డకెళ్ళి గోరంచు ఎర్రకోక శుభ్రంగా ఉతుక్కుంది. ఇంట్లోవున్న పువ్వులపుంజు తోక ఈకలు రెండు పీకి కోక దగ్గిర వుంచింది. గుంపయాత్రలో కొన్న పూసల దండతీసి తుడిచింది. తల చిక్కు తీసుకొనడానికి పైన కోసం పక్కింటి ముత్తేలమ్మ దగ్గరకు బయలుదేరింది.

వీధిలో కుర్రాళ్ళు ముగ్గురుముగ్గురు జట్లుగాచేరి అందులో ఇద్దరు అరచేతులు కలిపి ఉయ్యాలలాగ తయారుచేసి మూడోవాడి ముణుకును అందులో పెట్టమని మోస్తూ

"గెంజీ బుక్కుడు
   నీకు బుక్కుడు
నాకు బుక్కుడు
   గెంజీ బుక్కుడు"

అని తిరుగుతున్నారు.

ఆడపిల్లలు ఒక రెదరగా ఒకరు నిలబడి

"అగ్గిపెట్టి గుగ్గిపెట్టి
   మసిబొగ్గు మాల్లాం
అయ్యాం, టుయ్యాం
   టుసుక్!"

అని పాడుతూ కిలకిలమని నవ్వుతున్నారు.

పిల్లల ఆటల్ని చూసి నవ్వుతూ అడ్డంపడినవారిని తప్పించుకుంటూ ఆదెమ్మ మూడు గడసలు దాటి వేపగున్న దగ్గరకు వచ్చేసరికి సుక్కడు అడ్డంగా వస్తూ

"ఏటొలే ఆది?" అని పలకరించి కళ్ళెగరేయబోయాడు. అప్పటికే మస్తుగా తాగి ఉండటంచేత రెప్పలు లేవలేదు.

ఆదెమ్మ సుక్కడి ముఖం చూడకుండానే కాండ్రించి పక్కన ఉమ్మేతూ తప్పించుకొని వెళ్ళబోయింది.

ఆదెమ్మ ఉమ్మడంతో సుక్కడికి చాలా కోపం వచ్చింది.

"ఊత్తావటే నంజికూతరా? మొగుడ్నేనాను. నిలబడక్కడ" అని అడ్డంగా వస్తూ చేతులుచాపాడు.

ఆదెమ్మ చేతులు చాపుకొని నిలుచున్న - సుక్కడ్ని తప్పించుకొని "అన్న ఏటకెల్లిపోనాడు. నేపోతే నిన్ను ఆరాఁవడలు గెంటీసును" అని వేపచెట్టు పక్కనున్న రెండో ఇంట్లోకి దూరిపోయింది.

సుక్కడి కోపం బాగా రాజుకుంది. దాంతో శివాలెత్తిపోతూ "సూత్తానొలే. ఇయాలా నీ సంగతేదో అటో ఇటో తేలిసేత్తాను. పిల్లి కల్లుమూసికోని పాలు తాగి జగానికంతటికున్నా సీకటనుకొన్నాదట. నాకు తెల్దనుకొన్నావేటే నీ రంకుముండ ఏసకాలు, సిటంలోన రొండు గలాసులేసుకోని వొచ్చేసి అదిగప్పుడు నీ పని సెపతాను" అని జోగుతూ సారాకోసం వెళ్ళిపోయాడు.

ముత్తేలమ్మ గడపలోనుండి తొంగిచూసినఆదెమ్మ; అప్పుడే గడపలోనికి వచ్చిన ముత్తేలమ్మను చూసి

"ఏటోలాదినే. ఇయాల ఈ డినాగ పగబడతన్నాడు. ఏటిసేతునే! అన్న ఇంటికాడ నేడు" అంది గుబులుగా.

ముత్తేలమ్మ నవ్వుతూ

తోత్తే తొంబై దుక్కల పడిపోతాడు అదిగాడి దగ్గిట బయ్యేఁటే? నువ్వేటిప్పటిదాకా బుర్ర దువ్వుకోనేదు?" అంది; శుభ్రంగా దువ్వుకొన్న తలలో రెండు కోడి వెంట్రుకల్ని నిలువుగా దోపుకుంటూ.

ఆదెమ్మ చాలా తొందరగా

"మనోలు బయలెల్లి పోతారు గావాలా! ఊరుపు పైనకోసం నీ దగ్గిటికొచ్చినాను, గుబుక్కున సిక్కులు తేస్సి, మెట్టముడిసిద్దా" అంది

"అయితే కూకో!" అని ముత్తేలమ్మ ఇంటివాసాల్లోనున్న పైన వెతికింది. తొందరగా కనబడక పోయేసరికి

"నాను దువ్వుకోని వెణకనే దోపినానే" అని తనలో తనే గొణుక్కొని మరిరెండు వాసాల్లో చెయ్యిపెట్టి వెతికితీసి ద్వారబంధం మీద కూచొని, అదెమ్మను తనముందర కూర్చోబెట్టుకొని తల చిక్కులు తీస్తూ

"అదీ! రోజుకొకనాగ అగపడతన్నావే? బుగ్గలు బూరిల్నాగ నిగారిస్తన్నాయి. కొరుకుదునేటి?" అని అదెమ్మ చంకల్లో కితకితలు పెట్టింది.

అదెమ్మ పకాపకా నవ్వుతూ

"ఎలాదినే? ఇనాగసేత్తె నానెలిపోతాను గావాల" అంది మురిపెంగా

"నా దగ్గిరేలాలే, ఈ మురిపింపులు, గడ్డెన్న దగ్గిటసూపెట్టు" అంది ముత్తేలమ్మ

అదెమ్మ గుండెలు గుభేలుమన్నాయి.

"నీకు తెలిసిపోనాదేటాదినే?" అని అడిగింది. అదెమ్మ పకా పకా నవ్వి

"ఊరంతోటికిన్నీ తెలిసిపోనాదే? వాలసంతోటిన్నీ వాకిటే గుసగుసలు! నువ్వు గడ్డెన్నతోటి నెగిసిపోతావని మాతులు కొరుక్కుంతన్నారు గదా! అదు మంచోడేని నేయే! ఇక్కడుంటే ఈ తాగుబోతు గండడితోని సిటసిటానికే తగువే!" అంటూ అదెమ్మ కొప్పు దువ్వి మెట్టగా ముడిచింది, తరువాత

"ఎన్నాలు రాయినాగ ఏ అడదాయి మాత్తరం ఉంతాది. మట్టి మొగుడు దొరికినాడు. నువ్వు మంచిదానివై పోనావు సరిపోనాది. నాలాంటి పింటిదాన్నయినాను గాను; అ తాగిన మొకంమీదన అగ్గిపోసి అంటించిద్దును. ఎదవగద ఎదవ గదబ పుట్టక పుట్టినాడు మల్ల" అంది కసిగా.

ఆదెమ్మ మనసుకు ముత్తేలమ్మ మాటలు ఎంతో ఊరట కలిగించాయి.

"వొదినే!" అని కళ్ళనీళ్ళు కమ్ముతుండగా

"అటుకాసి సూత్తే, అన్నవొంటిగాడు, ఇటుకాసి సూత్తే గడ్డియ్య వొంటిగాడు. ఏటి సెయ్యనానికీతోసకుంటన్నాది." అని ముక్కు ఎగచీది కళ్ళు కొంగుతో తుడుచుకుంది.

ముత్తేలు ఆదెమ్మని ఊరడిస్తూ

"పల్లకోయే ఆదీ! మీ అన్నకేటి? వొక్క కడుపుకి కుసిన్నిగొల్లు గెంజినీలు మరగెట్టుకుంతే సరిపడతాయి. అంతగాపోతే మాంవునేవను కొన్నావేటే?! అడికెప్పుడూ నీ బతుకు బండలైపోనాదనే యాద పట్టుకోని ఇదైపోతన్నాడు." అంది

అప్పుడు తుడుం కుండ దబదబమని మ్రోగింది. ముత్తేలు లేచి ఆదెమ్మను లేపుతూ

"బేగి తెమిలిమీ! మనోలంతన్నూ బయలెల్లి పోతున్నారు నాగున్నాది. పదపద" అని ఇంటిలోనికి కోకమార్చుకునేందుకు వెళ్ళింది.

ఆదెమ్మకూడా తొందరతొందరగా ఇంటికి తిరిగివచ్చి, ఉతికినకోక కట్టుకొని. కోడిపెంట్రుకలు తలలోపెట్టుకుని మెడలో పూసలదండ వేసుకొని వీధిలోనికి వచ్చింది.

అప్పటికే చాలామంది ఆడా మగా గుంపుగా కూడివున్నారు. ఒక సన్నాయి రెండు తుడుంకుండలు జోరుగా మ్రోగుతున్నాయి. అక్కడ చేరిన వారంతా ఒకరి నడుమును మరొకరు పట్టుకొని వరసగా వెనక్కి ముందుకూ అడుగులువేస్తూ

"నేనే.... నెనెనే... నేనే....

నానా.... ననానా.... నానా...." అని పాడుతున్నారు.

ఆదెమ్మ చుట్టూ చూసింది. ముత్తేలుకోసం వెతికింది. ముత్తేలు అప్పటికే భర్త బోడయ్య నడుంమీద చెయ్యివేసి ముందుకూ వెనక్కి హుషారుగా అడుగులేస్తూ పాడుతూంది. ఆదెమ్మ ఒక్కనిముషం గుంపును చూస్తూ నిలబడి ముత్తేలు పక్కకు వెళ్ళాలని రెండడుగులు వేసేసరికి సుక్కడు ఆదెమ్మ చెయ్యి హఠాత్తుగా పట్టుకున్నాడు.

"రాయే! మనిద్దరం జతగట్టి పాడుదుంగాని రా!" అని చెయ్యి పట్టుకొని లాగాడు.

ఆదెమ్మ చెయ్యి విదిలించుకొని కోపంగా

"సీ....! సిగ్గునేదూ నా సెయ్యట్టుకోనానికి." అంది.

సుక్కడు ఆదెమ్మమీద పడిపోతూ

"నా పెల్లాం సెయ్యొట్టుకోనానికి నాకు సిగ్గెందుకేటే సెటకారినంజి కూతరా! సాకలోడితోటి సరసాలాడ్డానికి నీకు సిగ్గెయ్యాలగాని" అని పది మందీ ఉన్నారని గమనించకుండా ఆదెమ్మ పైట తొలగించబోయాడు.

అదెమ్మ సుక్కడ్ని బలంగా వెనక్కి తోసింది. సుక్కడు వెల్లకిలా పడి పోయాడు. వెంటనే దులుపుకునిలేచాడు. తీవ్రమైన ఆవేశంతో చుట్టూ చూశాడు. గజం దూరంలో కనబడిన కర్రల అజిరిలో నుండి వాడిసె బడితె తీసి

"నంజా! ఇయాల నీ రగతం కంట జూసేత్తాను. మొగుడి మీద కంటా సాకలి తిప్పడిమీదన మోజెక్కువై పోనాదటే! అది గాడిదగ్గిట తొంగోనానికి నేనిసిగ్గు నా కొంగొట్టు కొనీసరికి ఎలిపొచ్చినాదే! సూడే!" అని ఆదెమ్మ నడుము కడ్డంగా ఒక్కటి కొట్టేడు.

అంతే! గుంపులో పాడుతున్న ముత్తేలు గబగబావచ్చి సుక్కడి చేతిలోని కర్రను లాక్కొని

"ఒరే! ఒరె సిగ్గుమాల్ని తాగుబోతు గండా! దాన్ని కొడతా వట్రా?! దాని అన్నగానుంటే ఈ పాలికి నీ రగతం సూసీసును. ఎల్లెల్లు అంది.

సుక్కడు ఆగకుండా

"ఎవుడి పెల్లానికాడు కొడితే మంగలప్పడి కెందుకన్నట్టిగ నీకెందుకేటి మద్దిన! ఇయాల దీన్ని సొండి సాంబన్న బావుకాడికొట్టికెల్లి తగువు తేలిసియ్యాల. సాకలోడితోటి తొంగుంటాదో, నాతోటి ఉంటాదో తేలిసెత్తాడు సాంబన్న బావు." అన్నాడు.

ముత్తేలు సొండి సాంబన్న మాట వినేసరికి శివాలెత్తిపోయింది.

"ఏటొరే! ఏటంతన్నావురా ?!. సొండి సాంబన్న తగువుసాప్పి పాటోడ్రా?! ఆడేటి మా గురువనుకున్నావా? నేపోతే గదబోలికి పెద్దను

కున్నావా?! నీకు కల్లుసుక్కలోసి కుక్కనాగ తిప్పుతండని ఆడ్ని పెద్దోడ్ని సెయ్యాలని సూత్తన్నావేట్రా? ఆడి సిన్న పెల్లం ఆ ఎర్రణిందవ రాజుగాడి పక్కన తొంగుంటున్నది. ఆ డీడికి అడివొప్పజెప్పేసి దోసుక తినమంతన్నాడు. ఆడి తగువు మానుసెపతానురా?" అని ముత్తేలు తన భర్త బోడయ్యను పిలుస్తూ

"ఆడదాన్నాగ అనాగ సూత్తన్నావేంది? ఈడ్ని తన్ని తగలక." అంది రోషంగా.

పరిస్థితి బాగాలేదని గ్రహించి సుక్కడు జారుకుంటూ

"దీన్ని, ఆ సాకలోడ్ని సెట్టుకత్తొట్టుకోని రాండంతే రొండు ముక్కలకింద నరక్కపోతే నాను సుక్కడ్నే కాను. కానుగాక కాను." అని నేలనున్న మట్టితీసి బొట్టు పెట్టుకున్నాడు.

ముత్తేలు కాండ్రించి ఉమ్మి

"పలకర్రే రొండు ముక్కలకింద నరకినేడు మడుసుల్ని నరికేత్తాడట! కుక్కల కొడుకు. పదే ఆదీ!" అని ఆదిని నడిపించింది.

ఆదెమ్మ నడిచింది. గుంపు కదిలింది. సన్నాయి మ్రోదింది. తుడుంకుండ పలికింది. పాటలు నాలుగు దిక్కులా ప్రతిధ్వనించాయి.

"అరా పరానే వసూలో....
తురా పరానే వసూలో....
ఎన్నా వసూలో డియానదే...."

ఆ పాటను చాలా ఉత్సాహంగా పాడుతూ గుంపంతా చుట్టుపక్కల వలసలన్నీ తిరిగి సాయంకాలానికి గదబవలస చేరుకుంది.

చీకటి పడింది.

చెవులపిల్లి మాంసం తన వాటాకి వచ్చింది పట్టుకొని సోమయ్య ఇంటికి వచ్చాడు. మాంసం చేతిలో ఉండగా

"ఆదీ" అని కేకవేశాడు.

జవాబులేదు.

ఇల్లంతా కళ్ళు చిట్లించుకొని చూసి

"దీపం ఎట్టనేదేటి? ఇదిగోటి మానసం." అన్నాడు.

అప్పటికీ ఇంటిలోనుండి ఏ విధమైన జవాబు రాలేదు.

సోమయ్య పెరటిలోనికి వెళ్ళి చూసాడు. అక్కడా ఆదెమ్మ కని పించలేదు. తిరిగి ఇంటిలోకివచ్చి

"ఎకెల్లినాదే? ఆ జాదయి అలంతా ఎలిపొచ్చినారు." అనుకొని మాంసాన్ని ఉట్టిమీద జాగ్రత్తగా ఉంచి వీధిలోనికి వెతకటానికి బయలు దేరాడు.

సోమయ్య వీధిలోనికి వచ్చేసరికి ముత్తేలు ఎదురుపడింది. ముత్తేల్ని చూసి సోమయ్య ఆత్రంగా

"ముత్తేలూ! ఆది అవుపడ్నేదు. ఎకెల్లినాదే?" అని అడిగాడు.

ముత్తేలు వెంటనే సమాధానం చెప్పలేదు.

"పలకవేటే" అని సోమయ్య రెట్టించాడు.

ముత్తేలు మెల్లగా

"అడునేదా సుక్కడు. అడు ఆదెమ్మని నడీదిలట్టుకోని వాడిసి బడితతోటి కొట్టి గద్దెన్నకీ దానికి రంకు కట్టినాడు" అని క్షణకాలం ఊరుకుంది.

అంతలో పెద్దకేకలుపెడుతూ సుక్కడు సొండిసాంబన్న ఇంటి ముందర గెంతుతున్నాడు.

"అడు! ఆ సావిదయ్య గాడు ఇప్పుడేతంటాడు? ఏటి సెపతాడు? ఆ సెటకారినంజ అనుకున్నంత పనిచేసింది. దాని రగతం సూత్తాను. సూడకపోతే...." అని గట్టిగా తిడుతున్నాడు.

సుక్కడికేకలువిన్న సోమయ్య ఉద్రేకంగావెనుదిరిగి ఇంటిలోనికి వెళ్ళాడు. మాటాడకుండా కోపంతో వెళుతున్న సోమయ్యని చూసి ముత్తేలు, ఏదో పెద్దఘోరం జరిగిపోతుందని ఊహించుకొని భయంతో నిలువెల్లా వణికిపోయింది.

ఇంట్లోనికివెళ్ళిన సోమయ్య మరునిముషంలో మూలనున్న గండ్ర గొడ్డలి తీసుకొని వస్తూ ముత్తేలు ముందునుండి సొండి సాంబన్న ఇంటి

వైపు పరుగు పెట్టాడు. ముత్తేలు భయంకరంగా కేకలువేస్తూ

"రండర్రో! సుక్కడు సచ్చిపోతాడు. రాండిరోరె బావోయ్! రాండి రాండి...." అని పిచ్చికేకలు వేసుకుంటూ సోమయ్య వెనకపరుగు తీసింది.

సాంబన్న ఇంటిముందు చాలామంది గుమిగూడి వున్నారు. గుంపు మధ్యన సుక్కడు ఎగురుతున్నాడు. పరుగుమీనా వెళ్ళిన సోమయ్య గుంపును ఒక్కతోపుతోసి సుక్కడిజుత్తుపట్టుకొని ఒక్కవిసురు విసిరేడు.

ఆ విసురుకు సుక్కడు నేలమీద బోర్లాపడిపోయాడు. పడిపోయిన సుక్కడిమీదకి గండ్రగొడ్డలి ఎత్తి నడుస్తూ

"ఒరే! సచ్చేవురా ఎదవగదఎదవ! నా అదిని వొడిసి బడితితోటి కొట్టనానికి నీది గుండే సెరువురా! సవ్వు" అని బలంగా రెండు చేతుల్తో గొడ్డలి ఎత్తాడు. మరు నిముషంలో గొడ్డలి సుక్కడిమెడమీద పడి తలను మొండెంనుండి వేరుచెయ్యబోతుంది.

అంతట్లో మెరుపులా ముత్తేలు మొగుడు వచ్చి సోమయ్య చేతుల్ని గట్టిగా పట్టి ఆపేడు. సోమయ్య ఒక్కవిదిలింపు విదిలించాడు. ముత్తేలు మొగుడు రెండుబారల దూరం తుళ్ళిపోయాడు. సోమయ్య మళ్ళీ గొడ్డల్ని ఎత్తి

"ఇది గీ నా కొడుకు సావు ఇయ్యాల బెమ్మదేవు డాపలేడు" అని ఒక్క అడుగువేసాడు.

తుళ్ళిపోయిన ముత్తేలు మొగుడు మెరుపులా వచ్చి సోమయ్యను మళ్ళీ పట్టుకొని చుట్టూ ఉన్నవాళ్ని సాయం పిలిచాడు. ముత్తేలూ మరి కొంతమంది కలిసి సోమయ్యను పట్టుకొని చాలా కష్టంమీద గండ్రగొడ్డలి లాగేశారు. అప్పటికీ సోమయ్య ఊరుకొనకుండా నేలనున్న సుక్కడి మీదకు ఒక్క ఉరుకు ఉరికి పీకపట్టుకున్నాడు.

సుక్కడు కిరకిర చుట్టుకుంటూ

"సచ్చిపోనాను నాయినోయ్! బావోయ్! అని గిలగిల తన్నుకుంటూ అరిచాడు.

పరిస్థితి చాలా ప్రమాదంగా మారిపోయిందని గ్రహించి అక్కడ ఉన్న ఆడా మగా సోమయ్యను బ్రతిమాలుతూ ఎంతో కష్టంమీద సుక్కడి పీకను సోమయ్య పట్టునుండి విడిపించారు.

సుక్కడు లేచి ఒక్క గెంతుగెంతి సొండిసాంబన్న ఇంటిలోనికి పారిపోయి తలుపులు మూసుకున్నాడు. సోమయ్యను చల్లబరుస్తూ ముత్తేలు

"నలుగురుకీ సెప్పవాలిసినోడివిగాదా మరినువ్వే ఇదిగీయిదంగా రగతాలు జుర్రితే గదబవలస మరేటున్నాది? పద పద" అని చెయ్యి పట్టుకొని సోమయ్య ఇంటివైపు నడిపించింది.

సోమయ్య బాధగా

"నా ఆది ఏటైపోనాదో! ఎటెలిపోనాదో? అదిగాని నేపోతే ఇదిగీడినూకలు సెల్లబెడతాను" అన్నాడు.

ముత్తేలు మొగుడు వెంటనే జోక్యం కలుగజేసుకొని

"ఆదెమ్మ ఏటైపోనాదని నువ్వానాగయి పోతన్నావు?! అదిగది గడియ్య ఇంటిలోన నాయిడొాలసల సక్కగున్నాదిలే" అన్నాడు.

సోమయ్య కొయ్యబొమ్మలా నోరుతెరుచుకొని నిలబడిపోయాడు. అంతవరకూ భయంతో వొదిగిపొయిన సొండిసాంబన్న గోరపిట్టలా నోరు తెరిచి

"మరొాక జాతోడితోటి నెగిసిపోయిన ఆడపిల్ల మీ గదబజాతి అచారం ప్రకారం చచ్చినదానికిందనె లెక్కగదా. నీ కెందుకంత అప్మానం మరి! సుక్కడి బతుకే అన్యాయం అయిపోయింది" అన్నాడు.

సోమయ్య మాటాడలేదు.

సాంబన్న అదే అదనుగా తీసుకొని

"దానితోటి నువ్వు అన్నీ తెంపీసు కోవాల" అన్నాడు.

అప్పుడుసోమయ్య సొండిసాంబన్నను ఎర్రగాచూసి

"తెంపీసుకుంతాను. సాంబన్నా సూత్తావుగదా! అంతాతెంపేత్తాను అని పక్కనున్న వాడిచేతిలో నున్న గండ్రగొడ్డలిని లాక్కొని గబగబా ఇంటివైపు నడిచాడు.

ముత్తేలు సోమయ్యా వెనుకనే వెళ్ళి ఇంటిలో దీపం వెలిగించింది. తరువాత గోడకు చేరవేసిన మంచం వేస్తూ

"కూకో! కూకో!!" అంది.

సోమయ్యా చేతనున్న గండ్రగొడ్డలి మూలను పడేసి

"సీకటైపోనాదే ముత్తేలూ! నా ఇల్లే సీకటైపోనాది" అనిమంచం మీద కూలబడి పోయాడు.

## 9

మధ్యాహ్నం ఎండ మండిపోతూంది. ఊరుచుట్టూఉన్న చెట్లమీద గోరపిట్టలు దాహానికి గోలగోలగా అరుస్తున్నాయి. కాకులు కూడా ఎండకి కావుకావుమంటున్నాయి. పూరిపెలుపల అడివిలో నిశ్శబ్దం రాజ్యం చేస్తుంది. కొండలలోనుండి ఉండీ ఉంటి నిప్పుల గాలులు తెరలుతెరలుగా వస్తున్నాయి.

అప్పారావు గార్దు సొండిసాంబన్న గడపలో మంచం మీద కూర్చొని విసన కర్రతో విసురుకుంటూ

"ఏట్రాబాబూ! ఎండేటి ఇలాగ మండి పోతుంది" అని ఒకసారి గుండెలమీద పూదుకున్నాడు.

సొండిసాంబన్న మజ్జిగ అందిస్తూ

"గదబలు తెలివిమీరిపోయారు. మీకు చింతపండు దొరుకుతాదని నేను నమ్మను" అన్నాడు.

ఆ మాటవిని సాంబన్న అందించిన మజ్జిగ గటగటా తాగేసి అప్పారావుగార్దు అకాశం మీదకి ఎగురుతున్నట్టు ఎగురుతూ

"మీటింగులెట్టారని నువ్వు ఇదై పోతున్నావు గావాల। డొక్క చించి డోలుకట్టి మద్దిలి వాయించేస్తాను. ఇలాంటి మీటింగులు ఈ తలమీద ఎన్ని వెంట్రుకలున్నాయో అన్ని జూస్సేను. ఆ సాకల్నాకొడుకు పిటీష నెట్టమంటాడా! దొరకనిద్దూ। అడి సంగతి జూస్తాము.ముందు సోమయ్యనీ ముత్తేలు మొగుడినీ కబురుపెట్టు. చింతపండు అడుగుతాము. ఇవ్వక పోతే సంగతిచూస్తాను" అని ఎగరడం మానేసిమంచంమీదకూర్చున్నాడు.

కూచుంటున్న గార్డును చూస్తూ సాంబన్న

"చూడాలమరి అప్పారావు గార్డుపస" అని ఎగదోసాడు.

అప్పారావుగార్డు సాంబన్నను ఒకసారి కోరగాచూసి కళ్ళెగరేసి

"తగిలించి తమాషా చూడాలనుకొంటున్నావేటి సాంబన్నా। ఈడు తల్లికి మొగుడన్న సంగతి జ్ఞాపకం ఉంచే కడుపులోని పేగులు చూర కుండా లెక్క పెడతాడని తెలుసుకో। ఆ రాజుబావు కాడు. కొంగుతగిలీ సరికి కళ్ళు మూతలుపడిపోడానికి. నాదగ్గిర కొంచెం వాళ్ళు దగ్గిరుంచు కోడం ఎందుకైనా మంచిది" అన్నాడు.

సాంబన్న గాభరా పడిపోయాడు. వెంటనే అప్పారావుని బ్రతి మాలుతూ

"గార్డుబాబూ। నీసంగతి తెల్దా, నీ చలవ ఉండబట్టేగదా నా పెళ్ళం పిల్లలు చల్లగ గెంజితాగుతున్నారు. అలు మీటింగు పెడతన్నారు. నువ్వొకపాలి హడలుకొట్టాలన్నాను అంతేమరి" అన్నాడు.

"కాడతానుమరి కబురుపెట్టు" అన్నాడు అప్పారావు.

సాంబన్న కబురుపెట్టడానికి అక్కడినుండి కదిలి వెళ్ళాడు. సాంబన్న అలావెళ్ళగానే గార్డు అప్పారావు గడపలోనుండి ద్వారం పక్కగానున్న సాంబన్న రెండో పెళ్ళాన్ని కసిగా చూస్తు

"పుట్ట దబ్బ పండులాగుంది. అందుకే ఫారెస్టరు రాజుగారు దీన్ని వదలలేకుండా ఉన్నారు. సమయంచూసి మనమూ ఒకచూపు చూస్తే బాగుండును" అని మనసులో అనుకున్నాడు.

సాంబన్న చిన్నపెళ్ళాంకూడా ఇంటిపనులన్నీ వదిలిపెట్టేసి గార్డు ముందునుండి అటూ ఇటూ తిరుగుతూ. పైటను జారవేస్తూ తెలియనట్టు

మళ్ళీ సర్దుకుంటూ కవ్విస్తుంది. గార్దు అప్పారావు విసనకర్రతో విసురు కోవటం కూడా మరిచిపోయి కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు.

"అప్పారావుబావూ! కవురెట్టినావట" అన్న సోమయ్య పిలుపుతో ఉలిక్కిపడి సర్దుకు కూర్చొని; సోమయ్యనూ ముత్తేలుమొగుడ్నితీవ్రంగా ఒకసారి చూసి, సకిలించి

"నువ్వేనట్రా ముత్తేలు మొగుడివి? నీకు పేర్లేదేట్రా?" అని అడిగాడు.

ముత్యాలు మొగుడు మామూలుగానే

"పేరెందుకునేదుబావూ?" అని ఎదురుప్రశ్నవేసి "బోడియ్యం తారు" పేరు చెప్పాడు.

అప్పారావుగార్దు చిరాగ్గా

"నీపేరేదైతే ఎవడిక్కావాల? ప్రతిఏడూ మీ వలస మా కివ్వ వలసిన చింతపండు మామూలు వసూలుచేసి అర్జంటుగా పట్రండి. మీ గుడ్డిలమీదనున్న చెట్టుకు అయిదేసి రూపాయలూ, మా అడివిలో మీరు ఏరిన చింతపండుకి మామూలుగా మాకు రావలసిన వాటా అర్జంటుగా తేల్చియండి. అలాగె రెండు పనసకాయలుకూడా పట్టుకురండి. రేంజరు పెళ్ళాం అప్పకూతురు పనసకాయో పనసకాయో అని పలవరిస్తుంది. రేంజరొచ్చి మా పీకపట్టుకొని పనసకాయలు పట్రాకపోతే పీకపిసికేస్తానని కూర్చున్నాడు. అవున్లే చస్తే మేము చస్తాంగదా! మా పెళ్ళాలు గదా ముండ మోసేస్తారు. మీకేటి పోయింది. ఒరే నాయిన్లూ మీ జాతి లాగ కాదురా మా జాతిలోన మేంగాని చస్తే మా పెళ్లాలు అలాగ మడిగట్టుకోని ఉండిపోవలసిందే మీకేటి అదృష్టవంతులు. మీరు చస్తే మీ పెళ్లాలు దర్జాగా ఇంకొకడి పక్కల చక్కగా పడుకుంటారు. నీ చెల్లెలు చూడు ఆ చాకలోడితోటి ఎంతదర్జాగా ఉందో" అని సోమయ్యని ఓణ కాలం చూసి

"పట్రండి పట్రండి. చింతపండూ, పనసకాయలూ ఎమర్జెంటుగా పట్రండి" అన్నాడు.

సోమయ్యా, ముత్తేలు మొగుడు బోడయ్యా మాటాడకుండాఅలాగే నిలబడి అప్పారావుగార్ధుని చూస్తున్నారు. మాటాడకుండా కదలకుండా అలాగే నిలబడిపోయిన ఆ ఇద్దర్నీచూసి అప్పారావుగార్ధు అంతేసి గుడ్లు చేస్తూ

"సాపాళం రాళ్ళలాగ కదలకుండా మెదలకుండా అలాగే ఉండి పోయారేట్రా ! నాకు టయంలేదు. గబుక్కున తేల్చుకురండి'' అని తొందరచేశాడు.

సోమయ్య నింపాదిగా

"తేల్చటానికేటున్నాదిబావూ ?'' అని ఊరుకున్నాడు

అప్పారావుగార్ధు ఆశ్చర్యంగా

''ఏటిలేదా ? అంటే దానర్ధం ఏటి ?'' అని అడిగాడు.

''ఏటి సెపతాం బావూ ! సెప్పనానికేటున్నాది గనక ! మా గుడ్డిల మీదన సింతసెట్లకి మామెందుకు వయిదేసి రూపాయిలియ్యాల ? పట్టాలై పోయిన గుడ్డిలుగదా ! మరి మామూలేటి;'' అని సోమయ్య అడిగాడు.

గార్ధు మంచంమీదనుండి ఒకగెంతు గెంతాడు. తెయ్యిమని ఒక ఎగురు ఎగిరాడు.

''పట్టాలైపోయిన గుడ్డిలట్రామీవి ? మీటింగులెట్టి పిటిషన్లెడతారా ? కాకపోతే తిరగబడతామని ఆలోసన్లా ? చూడండిరా గదబనాకొడకల్లారా! మా మామూళ్ళుమాకు పడకపోతే రేపిపాటికి మీసాగుగుడ్డిలమీద నీలగిరి మొక్కలేయించకపోతే నా పేరు తల్లికి మొగుడే కాద్రా ? అప్పుడు మీ కమీనిష్టు గురువెలాగ అడ్డుకుంటాడో నేనూ చూస్తాన్రా! ఇది తూరుపు ముఠా కాదురా! లోవ ముఠా! ఆ సంగతి మరచిపోకండి. రేపో ఎల్లుండో పోలీసులు ఆ తూరుపు ముఠానాకొడుకుల సంగతీ మీ గురువుగారి సంగతీ తేల్చేస్తారు. తుపాకులెక్కెట్టి కుక్కల్ని కాల్చినట్టు కాల్చేస్తారు. హా ...'' అని బూతులు ప్రారంభించాడు.

సోమయ్య ముఖం ఎర్రబారింది. పిడికిలి బిగిసిపోతూంది. అంతలో పరిస్థితి గ్రహించిన సొండిసాంబన్న కలుగజేసుకొని

"నువ్వూరుకో అప్పారావు బావూ; నేను సోమయ్యతో మాట్లాడ తాను" అని సోమయ్య భుజంమీద చెయ్యివేసి

"రా సోమయ్యా! మనిద్దరం కొంచెం మాట్లాడాల" అని ఇంటి లోనికి తీసుకొని వెళ్ళాడు. బైట నుండి పోయిన బోడియ్యమీద అప్పా రావు గార్డు ఎగురుతూ చిందులుతొక్కుతూ ఉపన్యాసం వదులుతున్నాడు. సాంబన్న రెండో పెళ్లాం గార్డుని గుండెలుచూపి రెచ్చగొడుతూంది. గార్డు రెచ్చిపోతూనే ఉన్నాడు.

ఇంటిలోనికి తీసుకొని వెళ్ళి సాంబన్న సోమయ్యను పీటమీద కూచోబెట్టి అతనికి ఎదరగా తను మరొక పీటమీద కూర్చొని

"చూడు సోమయ్యా! అప్పారావుగార్డుకి మీటింగు సంగతి తెలిసి పోయింది" అన్నాడు.

సోమయ్య సాంబన్న కళ్ళలోకి సూటిగా చూస్తూ

"ఎనాగ తెలిసిపోనాది?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు సాంబన్న కొంచెం గాభరా పడ్డాడు. తరువాత సర్దు కున్నాడు. విషయాన్ని తేలికచేస్తూ

"గోడలకు చెవులుంటాయి గదా! జరిగింది తెలియడానికేటున్నాది? దానిమాటకేటుందిగానీ, ఫారెస్టోలతోటి తగువులికి దిగటం మంచిదికాదు. పూర్వంనుండి వస్తున్న వాటీబును ఒక్కసారి తీసిపారెయ్యాలంటే అవు తాదా? నువ్వేచెప్పు. అదిగాకుండా నీకు తెలియదు కానీ గురువుకోసం పోలీసులు గాలిస్తున్నారు. కమీనిష్టు పార్టీకి పూర్వం నేనుకూడా చందా లిచ్చానుగానా! కోళ్ళు చంపి భోజనాలెట్టానుగానా? కానీ ఆ పార్టీ అప్పు డులాగ ఇప్పుడు లేదు. ఖూనీలకు దిగిపోయింది. రక్తాలు జుర్రడానికి తయారైపోయింది. వాళ్ళతో మన లోవ ముఠాకిగాని, మనూరికిగాని సంబంధాలు మరివద్దు. నీకూ నాకూ పూర్వం నుండి ఉన్న సంబంధాన్ని బట్టి ఇలాగ అంటున్నాను. మరొకలు ఎలాగపోతే నాకేల? ఇనాగన్నానని నాకేదో ఉందనుకోకు. జిల్లా జిల్లా అంతా పోలీసోలతోట నిండిపోయింది. గవర్నమెంటోడితోటి తగువు మాచెడ్డ ప్రమాదం. మనకెందుకు ఈ తంటా?" అని చెప్పి పెరటిలోనికి కేకవేస్తూ పెద్దపెళ్ళాంతో

"సోమయ్యకి టీ పెట్టు" అన్నాడు.

సోమయ్య తల అడ్డంగా ఊపుతూ

"టీ వద్దునే" అన్నాడు.

సాంబయ్య సోమన్నను మరీ మొహమాట పెడుతూ

"పరవాలేదు తాగు. నేను నీ మేలూ, వలసమేలూ కోరి చెపు తున్నాను. అడి మామూలు అడి మొఖంమీద కొట్టండి. లేపోతే అడ న్నంతపనీ జేస్తాడు. మీరు సాగుజేస్తున్న గుడ్డిల్ని ఫారెస్టుకింద రాసే స్తాడు. దానిమీద ప్లానిటేషనని నిజింగా మొక్కలు వేయించేస్తాడు. అప్పడు మీరు పట్టాలు చూపించినా చెల్లవు. ఈ తగువులన్నీ తల కెత్తుకోడం ఎందుకేటి? అడు చింతగున్నకి అయిదు రూపాయిలే అడుగు తున్నాడు గదా! ఆ డబ్బు నీ పరంగా నేనిస్తాను. తరవాత చింతపండు నా కిచ్చిద్దురుగాని. తగువులేల?" అని సోమయ్యను చూసాడు.

సోమయ్య పీటమీదనుండి లేస్తూ

"సొమ్ము నివ్వియ్యొద్దునే సాంబన్నా! నీ సొమ్ము మా వోలకి ఏటి సేసినాదో చూసినానుగదా! ఇక నీడి మామూలేటో సూతొద్దా" అని గడపలోనికి వచ్చి నిలబడ్డాడు.

సాంబన్న రెండో పెళ్ళాం గుండెల్ని పైటతో కప్పుకొని వెళ్ళి పోయింది. గార్డు అప్పారావు సరిగా సర్దుకు కూచున్నాడు. సాంబన్న ఏదో అనబోతుండగా సోమయ్య తీవ్రంగా

"సూడు అప్పారావు బావూ! మా గుడ్డిలమీదనున్ని సింతగున్నలికి మాఁవు కానీగూడా మామూలియ్యం. నా కవతల సానా పనున్నాది. ఎల్తాను." అని నడిచాడు. వెనకనే ముత్తేలు మొగుడు బోడియ్య కూడా నడిచాడు.

అప్పారావుగార్డు కదలకుండా మెదలకుండా అలాగే వుండిపోయి పది నిముషాల తరువాత

"చూస్తా౯నా! మీ పనేటో పసేటో నేను చూస్తాను. ఎవుడు!

ఎన్నిగుండెలున్నోడు ఈ అడివిలోన అడుగెట్టి పూతిక పుల్ల పట్టు కెళతాదో అదీ చూస్తాను. మీ సాగు గుడ్డిలమీద నెలతిరక్కుండా మొక్క లేయించకపోతే! చూడండొరే; మీకు ముప్పతిప్పలుపెట్టి మూడుచెరువుల నీళ్ళు తాగించి ముప్పై మూడు జైళ్ళు చూపించకపోతే ఈడు ఈతల్లికి మొగుడుగాడు....” అని పళ్ళు పటపటమని కొరికాడు.

నొండి సాంబన్న అప్పారావును చల్ల బరుస్తూ

“రా! అప్పారావు బాబూ అన్నంతిందువుగాని; రారా,” అంటూం డగా సాంబన్న రెండో పెళ్ళాం అప్పారావు ముందుకువచ్చి జారిపోయిన పైటను అప్పారావు గార్దు చూస్తుండగా సవరించుకొంటున్నట్టు మరొక సారి జారవేస్సి

“అన్నం వడ్డించాను రాండి. ఎప్పుడూ ఇక్కడున్న తగువేగదా ఇయి. మీరు తలచుకొంటే ఈలేపాటి?” అని చిలక పలుకులు పలికింది.

అప్పారావు తిండికి నడిచాడు.

ఆలోచిస్తూ ఇంటిపైపు నడుస్తున్న సోమయ్యను ఎగువగూడ చల మయ్య కలుసుకొని

“సోమియ్యా పిన్నమాట!” అన్నాడు మెల్లగా.

సోమయ్య తలెత్తి చలమయ్యను చూసి ఆశ్చర్యపడుతూ

“ఇదేటి సెలమయ్యన్నా! ఇలా గలికిదైనావేటి” అని అడిగాడు

చలమయ్య సోమయ్యకు చాలా దగ్గరగా వచ్చి చెవిలో

“గురువొచ్చినాడు” అని చెప్పాడు.

సోమయ్య ఆత్రంగా

“గురువొచ్చినాడా? ఎక్కడున్నాడేటి?” అన్నాడు.

చలమయ్య సోమయ్యను ఎక్కువగా మాట్లాడ వద్దన్నట్టుగా చేతితో సౌజ్ఞచేస్తూ

“దొరగోరి మెట్టపక్కన సీంటితోటనేదా? అది గక్కడున్నాడు. నిన్నూ బోడియ్యనీ తోడుసుకోని సిటంలోన రమ్మని సొప్పేడు” అని చెప్పాడు.

చలమయ్య వెనుక సోమయ్యా సోమయ్య వెనక బోడయ్యా పరుగుమీద నడుస్తున్నారు. మధ్యాహ్నం ఎండ మల మల మాడుస్తూంది. ముగ్గురూ చెమటలు కక్కుతున్నారు. సన్నటి ఇసికలో పాదాలు కాలి పోతున్నాయి. కాలుతున్న ఇసికలో అడుగులు కూరుకుపోకుండా తేల్చి నడుస్తున్నారు. దొరగారిమెట్ట మలుపు తిరిగే సరికి చలమయ్య ఆగి గట్టిగా ఈల వేశాడు. కొండలన్నీ ప్రతిగా ఈలలు వేశాయి. కొండల ఈలల ప్రతిధ్వని ముగియగానే చీకటితోట దిక్కునుండి పెద్దగా ఈల వినబడింది. ఆ ఈల విన్న చలమయ్య

"ఇకన రాండి!" అంటూ చీకటితోట ముందు భాగానికి చేరాడు. దారి పక్కనున్న చింతచెట్టు దాటబోతుండేసరికి చెట్టుమీదనుండి ఒక గొంతు

"సెలమయ్యా! బేగెల్లు" అంది.

సోమయ్యా బోడయ్యలు ఒకేసారి తలెత్తి చెట్టుమీదకి చుశారు. చెట్టుమీదనున్నవాని చేతిలో విల్లమ్ములున్నాయి. దట్టంగా వున్న కొమ్మల మధ్యనున్న అతడు ఎంతో జాగ్రత్తగా చూస్తేనేగాని కనిపించడు. సోమయ్య ముందునడుస్తున్న చలమయ్యతో

"ఏటిది సెలమయ్యన్నా?" అని అడిగాడు, తనలోనున్న ఆత్రతని అణుచుకోలేక.

చలమయ్య నడుస్తూ మామూలుగా

"గురువు సెపతాడు" అన్నాడు.

పైన దట్టంగా గొడుగులాగ పరచుకొన్నట్టున్న కొమ్మలకు రక రకాల తీగలు అల్లిబిల్లిగా అల్లుకొని సూర్యకిరణాల్ని కూడా చొరనివ్వ కుండా చీకటిగా తోటంతా చల్లగా హాయిగావుంది. అంతవరకూ ఎండలో చెమటలు కక్కుకుంటూ వచ్చిన సోమయ్య, బోడయ్యల శరీరాలకు ఎంతో హాయిగా ఉందనిపించింది. తోటమధ్యగా ఉన్న కాలిబాటవెంట నడుస్తూ రెండు మలుపులు తిరిగేసరికి దారికి పక్కగానున్న రిట్ట చెట్టుకి మూడు చెట్ల అవతల మనుషులు కనిపించారు. ముందు చలమయ్య నడవగా

సోమయ్య, బోడయ్యలు వారి దగ్గరగా వెళ్ళారు. గురువు వచ్చిన వాళ్ళను చూసి

"వచ్చారా కామ్రేడ్స్ ! రాండి" అని పలకరించాడు.

సోమయ్య, బోడయ్యలు చేయెత్తి పిడికిలి బిగించారు. ప్రతిగా గురువూ గురువు ప్రక్కనున్న మరొకవ్యక్తి చేతులెత్తి పిడికిళ్ళు బిగించారు.

సోమయ్య గురువు పక్కనున్న వ్యక్తిని ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు.

అతను వేసుకున్న గళ్ళ కమీజూ షరాయీ తెల్లని శరీరం మీద తెల్లగా ఉన్నాయి. తెల్లద్దాల కళ్ళజోడు అతని చక్కని ముక్కుమీద చాలా చక్కగా అమరి వున్నది. కళ్ళద్దాల వెనక కాంతివంతంగా మెరుస్తున్న కళ్ళు తెలివి తేటల్ని తెలియజేయటమే గాకుండా ఎదుటి వ్యక్తిని చూడగానే అంచనా వేయగలిగినట్టుగా ఉన్నాయి.

గురువు సోమయ్యను అతనికి పరిచయం చేస్తూ

"గదబవలస సోమయ్యని మీకు చెప్పానే; అతనే ఇతను" అని చెప్పాడు.

అతను తలఊపుతూ సోమయ్యను చూసి ఒక్కసారి నవ్వి ఊరుకున్నాడు. సోమయ్య ఆనందంతో పొంగిపోతూ

"ఇదిగితగా నెపులో గురుపు సెపితే బాగుండిపోను. గురువు నడుగుదునేటి ?" అనుకొని మళ్ళీ వెంటనే పార్టీ క్రమశిక్షణ జ్ఞాపకం వచ్చి

"సెప్పాలనుకుంతే గురువే సెపతాడు" అని ఊరుకున్నాడు.

నిలుచున్న సోమయ్య, బోడయ్యలతో గురువు "కూచోండి" అన్నాడు.

అంతా కూర్చున్నారు.

గురువు సోమయ్యతో

"గదబవలస సంగతులేటి ?" అని అడిగాడు.

సోమయ్య సమాధానంగా

"పార్టీలోలకి మాఁవు ఎట్టీకి రానేదని మా పెద్ద గుర్రుగా ఉన్నాది.

ఇయాల సింతసెట్లమీదన మామూలు గుంజనానికి అదిగా అప్పారావు గారుడు వొచ్చినాడు. మాఁవు ఇవ్వనేదు. ఆడు కిందకీ మిదకీ ఎగర తన్నాడు. ఆ తగువింకా అనాగున్నది; మీరొచ్చినారని సెలమయ్యొచ్చి నాడు" అన్నాడు.

గురువు "అలాగా" అని తల వంకించి మళ్ళీ "సొండి సాంబన్న ఎలాగున్నాడేటిః" అని అడిగాడు.

సోమయ్య కోపంగా

"ఆడు మరీ పేట్రేగి పోతన్నాడు. సరుకు లాడికి ఇయ్యకపోయే సరికి పాత బకాయీలు సెల్లుసెయ్యమని సెపతన్నాడు. ఆ పారిస్టోలతోటి కలిసిపోయి గోర కలిసేత్తన్నాడు. ఇయాల ఆ అప్పారావుగారుడు గాడికి మామూ లిచ్చియ్యమని సొప్పినాడు. ఆయాల మన మీటింగులోన ఇసయాలు తెలిసిపోనాయని బెదిరించినాడు. కమీనిస్టు పారిటీ ఇంతకి ముందునాగ నేదని; ఇదిగిప్పుడు కూనీలు సేత్తన్నాదనీ అందలోన ఉండొద్దనీ గవురుమెంటోలతోటి తగవులెందుకనీ సొప్పినాడు. నాను మారుమాటాడకుండా ఎలిపొచ్చినాను. అది గలాగున్నాడాడు" అని చెప్పాడు.

గురువు చాలా తీవ్రంగా ఆలోచిస్తూ

"మీటింగు విషయాలు ఎలా తెలిసాయి వాడికి? అంతా మనవాళ్ళే ఉన్నారే!" అన్నాడు.

సోమయ్య కసిగా

"అదిగాడు నేడా సుక్కడు. కల్లు సుక్కలు పోసిత్తే సాన" అని పళ్ళు కొరికాడు.

"అయితే మరి మనం ఇప్పుడు అర్జంటుగా సమావేశం కావాలి. ఎక్కడ కూచుంటారుః ఇక్కడ ఎక్కువసేపు ఉండటం అంత మంచిది కాదు" అని సోమయ్యని గురువు అడిగాడు.

సోమయ్య ఆలోలిస్తూ సమాధానం చెప్పలేదు. అప్పుడు బోడయ్య కలుగజేసుకుంటూ

"ఇది గిప్పుడు గదబొలసలోన మరొద్దు! సుక్కుడే కాదు, అప్పారావుగారుడు గూడా ఉన్నాడు. నాయిడొలసలోన గడ్డియ్యనేడా?! అది గక్కుడై నట్టిగైతే వొపులకీ తెల్దు. నాను గదబొలసలోన మనోలందర్ని రేత్తిరికి గడ్డియ్యంటికి తెత్తాను. ఏటంతావు?" అని సోమయ్యని అడిగాడు.

గురువుకూడా "అదే బాగుంటుంది" అన్నాడు.

అప్పటికీ సోమయ్య మాట్లాడక పోయేసరికి గురువు సందేహంగా "ఏటి సోమయ్యా?" అని అడిగాడు.

సోమయ్య నసిగాడు. బోడయ్య, సోమయ్య నసుగుడును పోల్చి

"గురువూ! ఆదెమ్మ నెరుగుదువుగాదా! అదీ గడ్డియ్యా పెల్లిసేసుకున్నారు. మా కులంలోని గుంట మరొక కులపోడితోని నెగిసిపోతే సచ్చిందాని కిందన నెక్కగాదా? అప్పుడికీ నానూ ముత్తేలూ సోమియ్యకి సొప్పినాము. గురువు సవర పిల్లనీ జాతాపు పిల్లనీ సేసుకున్నాడు గాదా మరి ఆదెమ్మ ఒక్కర్తె ఏటి తప్పుసేస్సినాదని నీ నీలుగుడు? అని సొప్పినాము. ఈడింకా నీలుగుతండు" అని నవ్వేడు.

గురువుకూడా నవ్వుతూ

"అలాగైతే గడ్డియ్య కామ్రేడ్ ఇంటిలోనే ఇవాళ సమావేశం తోవలో అంతా వివరంగా మాటాడుకుందాం నడవండి" అని సంచి పట్టుకోబోయాడు.

సంచి గురువును పట్టుకోనీయకుండా సోమయ్య తీసుకున్నాడు. మిగిలిన పుస్తకాలకట్ట బోడయ్య పట్టుకున్నాడు.

చలమయ్య ఈల వేశాడు. ప్రతిగా రెండు ఈలలు వినిపించాయి. నిముషంలో విల్లునుండి నారిని విడదీసి అమ్ములు కనబడకుండా గుడ్డల్లో మూటకడుతూ కాపలాగా ఉన్న ఇద్దరు కామ్రేడ్స్ వచ్చారు.

ఎండ తీవ్రత తగ్గింది. బోడయ్యా, ఆదెమ్మా గడ్డిసెట్టి విషయాలు చెబుతుండగా అంతా నాయుడు వలసవైపుగా నడిచారు.

# 10

ఆకాశం నిర్మలంగా మేఘాలు లేకుండా ఉంది. పగలంతా పెచ్చరిల్లిన ఎండవేడి తగ్గింది. కొండలమీదనుండి వస్తున్నగాలి తోటలమీదుగా వచ్చి చల్లగా తగులుతూంది. ఆకాశం అంతా నిర్మలంగా ఉందన్న ఆనందంతో చంద్రుడు చుక్కలతో ఆడుకుంటున్నాడు. చుక్కలతో ఆడుకుంటున్న చంద్రుణ్ణిచూసి నవ్వుతున్నట్టుగా పొలాల్లో విరగబూసిన నువ్వుపూలు తెల్లగా ఆకాశంవైపు చూస్తున్నట్టుగా వున్నాయి.

నాయుడు వలసలో అప్పటికే సందడి బాగా తగ్గిపోయింది. రాత్రి భోజనాలు ముగించి ఆడవాళ్ళంతా గడపల్లోనూ, మగవాళ్ళంతా ముని వాకిట్లోనూ మంచాలు వేసుకొని చల్లగాలికి సంద కునుకు తీస్తున్నారు. నాయుడువలస చెరువు గట్టుమీద కల్లుపాకలో దీపం తాగినవాడి కన్నులా ఎర్రగా కనబడుతూంది. అంతకు మినహా వలస వలసంతా నిశ్శబ్దంగా ప్రశాంతంగా వుంది.

అదెమ్మా, గడ్డిసెట్టి రేవుకని వెళ్ళి చాలా ఆలస్యంగా వచ్చారు. రేవునుండి వచ్చిన తరువాత పొయ్యి రాజేసి వంట చేసుకొని తిన్నారు. అన్నంతిని గడ్డిసెట్టి ఉతికిన బట్టల మూటలు సర్దుకుంటున్నాడు.

అదెమ్మ పెరట్లో వంటచేసిన కుండలు కడుగుతూ

"ఎదవ సెడిపోయి ఈటోడితో నెత్తే సచ్చిందాకా సాపలమోత తప్పనేదట. అదిగనాగున్నాది. సాకిరేవు నుండొచ్చేసరికి నడుంవు సాలిసి పోతన్నాది. రోజుల్లా గొప్పు తవ్వినా కర్రలు మోసినా ఇంత వొంటికి సాలనిపించనేదు" అని గొణుక్కుంది.

గొణుగుడువిన్న గడ్డిసెట్టి బట్టలమూటలు గబగబా సర్దేసి వస్తూ

"ఏటోలే అదీ సణుక్కుంటన్నావు?" అని నవ్వుతూ అడిగాడు.

"ఏటినేదు నేత్తూ!" అని అదెమ్మ కుండలు కడగటం పూర్తి చేసింది.

అదిచూసి గడ్డిసెట్టి

"కుండలు కడిగీసినావు గదా! ఇంకేటి అలీసింసే త్తన్నావు? రారా" అని పిలిచాడు.

ఆదెమ్మ చిరాకు నటిస్తూ

"కడిగిన కుండలు కాలెయ్యొద్దేటి? ఏటాతొందర?" అని గడ్డిసెట్టికి కనబడకుండా తనలోతనే నవ్వుకుంది.

గడ్డిసెట్టి ఆదెమ్మను ఉత్సాహపరచటానికి

''నాయిరాలి జరీబుటాల కోక తీసుంచినానే! జేగొచ్చి అది కట్టు కొమ్మీ. ఆ కోకలో నిన్ను సూడాలనిపిస్తంది." అన్నాడు.

ఆదెమ్మ కుండలపని పూర్తిచేసి కట్టుకున్న చీరచెంగుకు చేతులు తుడుచుకొని ముఖంమీద పడుతున్న జుత్తును ఎగదోసుకుంటూ

"ఆ కోక మాబాగున్నాది. అలా పింటికోకలు ఆ నాయిరాల్లు పొద్దుగూకులూ కట్టుకుంతారు. ఆలెంత అదురుష్టమంతులో" అంది.

గడ్డిసెట్టి ఆదెమ్మ మాటను కొట్టివేస్తూ

"అలగొప్పేటీ నేదే! మనదేనే గొప్పంతా సాకలోలు కట్టీసి వొదిలీసినివే గదే, ఆ లెంతోటి గొప్పోలైనా కట్టుకోవాల. అలు డబ్బు లెట్టి ఎంచెంచి కొనుక్కున్నియి ఎంత కొత్తయయినా మనకి రేవుకేసి తీరాల. మనగ్గాని దానిమీద మోజేసిందంటే, కట్టీసి నలిపీసి సరదా తీరుసు కోని అలకిత్తాం(వు. బట్టముక్కలు సాకలోడిక్కరువేటే? ఇయాల నాయిడు తొంగున్ని బొంత పరుసుకుందుం. నాయురాలి బుటాకోక నువ్వు కట్టుకో నాయుడు గేస్కోపంచి నాను కట్టుకుంతాను. ఇద్దరిం(వీ ఈ రేత్తిరంతా దుమా దుమా సేద్దుం'' అని భుజాలు ఎగరేశాడు.

ఆదెమ్మ నాయురాలి చీరతీసి కట్టుకుందికి సిద్ధపడుతూ

''సాల్లే సడసాలు. నువ్వు ఇల్లాకాతల కెల్లు! నాను కోక మారుసుకుంతాను" అంది.

గడ్డిసెట్టి ఆనందంగా

"నానుంతే తప్పేటే?" అని పకపకానవ్వి పెరట్లోనికి వెళ్ళాడు.

గడ్డిసెట్టి పెరటిలోనికి వచ్చేసరికి ఎదురుగా నిలుచున్న సోమయ్య బోడయ్యలను చూసి ఆశ్చర్యపడుతూ నోటమాటరాక అలాగే నిలబడి పోయాడు.

రాతి బొమ్మలా నోటమాటరాకుండా నిలబడివున్న గడ్డిసెట్టినిచూసి బోడయ్య కలుపుగోలుతనంగా

"ఏటి గడ్డియ్యా? ఏటనాగ నోరెల్ల బెట్టి నిలబడిపోనావు? సోఁవియ్య వొచ్చినాడు" అన్నాడు.

గడ్డియ్య మరొక ఘడియ వరకూ తేరుకోలేకపోయి! తరువాత తెప్పరిల్లి

"ఆదీ! బావొచ్చినాడు" అని ఇంటిలోనికి కేకవేశాడు.

చీరమార్చుకుంటున్న ఆదెమ్మ మామూలుగా

"వొవులూ?" అని అడిగింది.

గడ్డియ్య రెట్టింపు స్వరంతో

"సోఁవియ్య బావొచ్చినాడు. బేగిరా" అని పిలిచాడు.

మరునిముషంలో తలుపు తీసుకొని ఆదెమ్మ వచ్చి సోమయ్య కాళ్ళకు చిన్న పిల్లలా చుట్టుకొని బలబలా కన్నీరు పెట్టింది.

కాళ్ళకు చుట్టుకున్న ఆదెమ్మను లేవదీసి ప్రేమగా సోమయ్య

"ఏటిదే ఆదీ! నెగునెగు" అని లేవదీసి ఆదెమ్మ ముఖంలోకి చూసి

"ఏడుపెందుకేఁ? ఏటి నేరం చేసినావని? గురువుకూడా మంచి గున్నాదనే అన్నాడు" అని కళ్ళ నీళ్లు తుడిచాడు.

ఆదెమ్మ ముక్కు ఎగ జీదుతూ

"ఇల్లాకాతలే నిలబడిపోనావు! ఇంటికిరా!" అని పిలిచింది.

సోమయ్య నవ్వుతూ

"ఇక్కడిదాకా వొచ్చినోడ్ని ఇంటికి రానేటి? గురువొచ్చినాడు. నీ యింట్ల ఇయాల మీతింగు" అని చెప్పాడు.

గడ్డిసెట్టి ఆదెమ్మా అంతులేని ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు అయి పోతూ

"గురువొచ్చినాడా? మా ఇంటికాడికా?" అని ఒక్కసారి అన్నారు.

బోడయ్య తలవూపుతూ

"ఊరి పరగడ మున్నాడు. నానెల్లి పిలుసుకోనొత్తాను. మిగతాయి మీరు సూడండి" అని గురువును పిలవడానికి వెళ్ళిపోయాడు.

సోమయ్య; గడ్డిసెట్టీ ఆదెమ్మల వెనకన ఇంటిలోనికి వెళ్ళాడు. తళతళలాడుతున్న బుటా సిల్కు చీరలో మెరిసిపోతున్న ఆదెమ్మను చూస్తూ

"ఇది నా సెల్లిలు ఆదేనే! కాదో?!" అన్న సందేహంలోపడి దీపం వెలుగులో ఆదెమ్మని మళ్ళీ మళ్ళీ చూస్తూ

"మాదేవి నాగున్నాది. నా బతుకెనాగా బద్దలై పోనాది. దానిబతుకు పచ్చగా పదికాలాలు ఇనాగే ఉండాల" అని కోరుకున్నాడు.

ఆదెమ్మ కిరసనాయిలు దీపం పెద్దదిచేస్తూ సోమయ్యను చూసి

"అన్నా! ఇదేటినాగై పోనావు?" అని అడిగింది.

సోమయ్య నవ్వుతూ

"నాకేటోలమ్మీ! రాయినాగున్నాను." అంటుండగా గురువు మిగతా కామ్రేడ్స్‌తో వచ్చేసి గడ్డిసెట్టిని పలకరించుతూ

"బాగున్నావా కామ్రేడ్!" అని నవ్వేడు.

గడ్డిసెట్టి తల ఊపేడు. గురువు ఆదెమ్మను చూసి చిరునవ్వు నవ్వుతూ, సోమయ్యవైపు తిరిగి కళ్ళెగరేశాడు. సోమయ్య నవ్వేడు. ఆదెమ్మ సిగ్గుతో తవంచుకొని ముసిముసి నవ్వులు నవ్వింది.

నవ్వుతూ తలవంచుకున్న ఆదెమ్మతో గడ్డిసెట్టి

"పదపద! బొయ్యిలోన అగ్గిరాజేద్దుంగాని బేగిరా!" అని తొందర చేశాడు.

గురువు గడ్డిసెట్టిని దగ్గరకు పిల్చి

"అదేమీ ఇప్పుడువద్దులే కామ్రేడ్, పార్టీపరిస్థితులు పూర్వంలాగ లేవు. మా కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇంత రాత్రప్పుడు మీరు బొయ్యి రాజేసారంటే పొగచూసి ఇరుగు పొరుగువాళ్ళు అనుమానిస్తారు.

మేము నీ ఇంటికి వచ్చి వెళ్ళిన సంగతి తెలిస్తే నీకు చాలా ప్రమాదం ఇప్పుడే అర్జంటుగా సమావేశం వేసుకుంటాం. గదబవలసలోని ముఖ్యమైన కామ్రేడ్స్ ఈ పాటికి ఊరి పొలిమేరల్లోకి వచ్చేసి ఉంటారు. బోడయ్య వార్ని కలుసుకొని ఇక్కడకు తెస్తాడు'' అన్నాడు.

గడ్డిసెట్టి బలవంతంగా

“బొగ్గులు రాజేసి టీ ఎడతాను. పొగరాదు. అదన్నా తాగాల'' అన్నాడు.

గురువు సరేనన్నాడు.

ఆదెమ్మ గబగబా బొగ్గులు రాజేసి నీళ్ళుపెట్టింది. గురువూ కొత్తగా వచ్చిన నాయకుడూ కిరసనాయిలు దీపం ముందర కూర్చున్నారు గురువు సంచిలోని కాగితాలుతీసి చదవడం మొదలుపెట్టాడు. నాయకుడు కొన్ని పుస్తకాలు తీసి మేపుని ముందు పరచుకొని పెన్నుతీసి వ్రాసుకుంటూ గుర్తులు పెట్టుకొంటున్నాడు. సోమయ్యా గడ్డిసెట్టీ వాళ్ళిద్దరివంకా రెప్పవెయ్యకుండా చూస్తూ

“ఇదిగీ కామిరేడ్లకి వొణ్ణంగట్రా అక్కర్లేదేటి? రేత్తుర్లు తొంగోకుండా మీతింగులు; పొగులు ఉన్ని ఊర్ల ఉండకుండా తిరుగులు; ఈలు మనుసులు కారు, దేవుతల్నాగ అగపడతన్నారు” అని మనసులోనే అనుకున్నారు.

ఆదెమ్మ నీళ్ళు మరగబెట్టి గడ్డిసెట్టిని పిలిచి

“పాలునేవు ఏటిసేత్తాం” అని మెల్లగా అడిగింది.

చదువుకుంటున్న గురువు కాగితాల్లో నుండి తలెత్తి

“పాలక్కర్లేదు డికాషన్ తాగ్గలం. ఇప్పుడు పాలకోసం ఎక్కడికీ వెళ్ళొద్దు. ఇక్కడవున్న మన కామ్రేడ్స్‌కి సమంగా సర్ది ఇవ్వండి” అన్నాడు.

ఆదెమ్మా గడ్డిసెట్టీ విపరీతంగా సిగ్గుపడిపోయారు. తరువాత మాటాడకుండా సిల్వర్ గళాసులో డికాక్షనుపోసి అక్కడ వున్న వారందరికీ ఇచ్చారు. వాళ్ళు డికాషను తాగడం పూర్తయేసరికి గదబవలసలో ముఖ్యులనుకున్న కామ్రేడ్స్ వచ్చేశారు. వాళ్ళను చూసి గురువు

"అంతా వచ్చారుగదా!'' అన్నాడు.

వాళ్ళంతా వచ్చామన్నట్టుగా తలలూపారు. తరువాత గురువు గడ్డి సెట్టితో

''ఈ మీటింగు అయిపోయినంతవరకూ నువ్వూ ఆదెమ్మా సెంట్రీ ఇవ్వాల'' అన్నాడు.

గడ్డిసెట్టి అర్థంగాక అయోమయంగా చూసాడు. గురువు గడ్డి సెట్టి పరిస్థితి అర్థం చేసుకొని

''సెంట్రీ ఇవ్వడమంటే మీటింగు అవుతున్నంతసేపూ అనుమానించ దగిన మనుషులు రాకుండా చూడ్డం. అటువంటిదేమైనా జరిగితే మాకు తెలిసేటట్టుగా పొడిదగ్గు దగ్గాలి. మా కామ్రేడ్స్‌నిగాని అవతల పెడితే ఇరుగు పొరుగు వాళ్ళకు అనుమానం వస్తుంది. అంతేగాకుండా అనుమా నించదగిన వ్యక్తులెవరో, ఇరుగు పొరుగు వాళ్ళెవరో కూడా వీళ్ళకు తెలియదు. అందుచేత మీరు వంటపంచ చివర్న కూచొని జాగ్రత్తగా చూడండి'' అన్నాడు.

బోడయ్య నవ్వుతూ

''సూడమని గురువు సొప్పినాడని వొకలి మొకాలు వొకలు సూసు కోని కూకోకండి'' అన్నాడు.

గురువుతో సహా అంతా నవ్వేరు. ఆదెమ్మా గడ్డిసెట్టీ సిగ్గుపడుతూ ద్వారం దాటి వెళ్ళారు. సమావేశం ప్రారంభమైంది కొత్తగా వచ్చిన నాయకుడు గంభీరంగా మెల్లగా చెప్పటం మొదలుపెట్టాడు.

ఇప్పుడు మనం సాయుధ పోరాటం చెయ్యబోతున్నాం. దగ్గర దగ్గర పాతిక సంవత్సరాల కాంగ్రేసు పరిపాలన మాటల్లో సోషలిజాన్ని వల్లించి చేతల్లో పేదవాళ్ళను మరింత పేదవాళ్ళగానూ, ధనవంతుల్ని మరింత ధనికులుగానూ తయారుచేసింది. ఆకలన్న నేరానికి తుపాకీ తూటాలు గురిపెట్టింది ఈ అహింసామార్కు గవర్న మెంటు, మన పార్టీ నాయకత్వపు రివిజనిస్టు ధోరణివల్ల మనం ఇంతవరకూ రాజ్యాంగబద్ధంగా ఆందోళనచేస్తూ, చాలా బహిరంగంగా పార్టీ నిర్మాణం చేస్తూ ఓట్లు

సంపాదించటంద్వారా అధికారంలోకి వస్తామనుకొన్నాం. కాని అనుభవం అది శుద్ధ తప్పని తేల్చింది. ఛైర్మన్ మావో చెప్పినట్టు తుపాకీగొట్టం ద్వారానే రాజ్యం సిద్ధిస్తుంది. పాలకవర్గపు హింసను ప్రతిహింస ద్వారా మనం ఎదుర్కోవాలి. దానికి పునాదిగా మనకు లభించిన ఆయుధాలతో ముందు మనం వర్గపోరాటం చెయ్యాలి. వర్గ శత్రువును నిర్మూలించాలి. ఆలా మనం రహస్యపార్టీ నిర్మాణం రహస్య స్థావరాల స్థాపనా చేసుకుంటూ ముందుకు పోయినప్పుడు అది క్రమంగా దీర్ఘకాల ప్రజా పోరాటంగా మారుతుంది. ఇది చాలా కష్టమైన విషయం. ఎంతో నష్టానికి చివరకు ప్రాణాన్ని కూడా త్యాగం చెయ్యటానికి సిద్ధంగా వుండాలి. ఎందుకంటే మనమే మొట్టమొదటి సారిగా భారతదేశ ప్రజలకు ఇది సరైన మార్గమనిచూపెడుతున్నాం గనుక. ఈ పోరాటం ఎంతకాలం పడుతుందో చెప్పలేము. విప్లవమంటే కవిత్వం చెప్పటం కాదు. మేజోళ్ళు అల్లటం లాంటి సున్నితమైంది కాదు.... అని వర్గ విశ్లేషణంలోకివెళ్ళి చెప్పుకొని పోతున్నాడు.

గదబవలస కామ్రేడ్సంతా వింటున్నారేగానీ అర్థమైనట్టుగా కనిపించలేదు. అది గమనించిన గురువు జోక్యం కలుగజేసుకొని

"మీరు ఆగండి కామ్రేడ్! ఇక్కడి కామ్రేడ్స్‌ని మీరు అర్థం చేసుకోవాలి. మీ అభిప్రాయలే నేను చెబుతాను. ఎక్కడైనా నా అంచనాలో, చెప్పడంలో పొరపాటు జరిగితే మీరు దిద్దండి" అని స్థానిక ఉదాహరణలతో చెప్పటం మొదలు పెట్టాడు. ఆ చెప్పడం అక్కడి దోపిడీ; భూస్వాముల, దళార్ల, వ్యాపారుల, ప్రభుత్వోద్యోగులవివరణల్తో మొదలైంది. అతను చెబుతున్నది వింటూ గిరిజన కామ్రేడ్స్ నాగస్వరం విన్న నాగుల్లా తలలూపుతున్నారు.

గురువు చెప్పుకొని పోతూనే ఉన్నాడు.

అర్ధరాత్రి దాటింది. చంద్రుని చల్లని వెన్నెల భూమ్మీద అందంగా పరుచుకొని వుంది. ఆదెమ్మా గడ్డిసెట్టీ కళ్ళల్లో వొత్తులు పెట్టుకున్నంత జాగ్రత్తగా చూస్తున్నారు వాళ్ళిద్దరికీ లోపల మాటాడుతున్నదంతా చాలా

స్పష్టంగా వినపడుతూంది. చాలాసేపు గురువు మాటలు విన్న తరువాత గడ్డిసెట్టి ఆదెమ్మతో

"ఆదీ! గురువుమాట విన్నావుగదా! ఇకబట్టి తెల జులుం మన మీదన సెల్లదే! ఇదిగో కొండల్ని పట్టి కుదబలిస్సిననా కొడుకులికి బూమ్మీదన నూకలు సెల్లిపోతున్నాయే" అన్నాడు ఉత్సాహంగా

ఆదెమ్మకూడా

"మా బాగున్నాదిరా! మా ఊర్ల ఉన్నాడుగదా ఆ సొండిసాంబడు ఆడు పైమీద తువ్వాల గుడ్డతో వొచ్చినాడు! ఇప్పుడాడి ఇద్దరి పెల్లాలూ బంగారం మొయ్యనేక జావోసి పోతన్నారు. వొకొకలూ దుస్సపోతుల్నాగ బలిసిపోనారు" అంది.

ఇంతలో వీధి చివరగానున్న చింతచెట్టు క్రింద ఏదో మనిషినీడ కదులుతున్నట్టుగా గడ్డిసెట్టి చూశాడు. తరువాత ఆదెమ్మతో

"సూడే ఆదీ! ఆ సింతగున్నకింద ఏటది?" అని చేతితో అటు చూపించాడు.

ఆదెమ్మ కళ్ళు చించుకొని చూసి

"అవునక్కడెవులో అలికిడవుతున్నట్టిగున్నాది సుమ్మీ" అంది.

గడ్డిసెట్టి పొడిదగ్గు దగ్గాడు.

లోపలంతా నిశ్శబ్దమైపోయింది. దీపం కూడా ఆరిపోయింది. అంతకుముందు విల్లమ్ములు పట్టుకొని కాపుగావున్న ఇద్దరు కామ్రేడ్స్ చీకటిలోనే నారిని వింటికి తగిలించి అమ్ములతో సిద్ధంగా ఉన్నారు. చింతచెట్టుకింద నీడ మెల్లగా గడ్డిసెట్టి ఇంటివైపుగా వస్తుంది. గడ్డిసెట్టీ ఆదెమ్మా పెరటిచూరుకిందనుండి వంటింట్లోని చీకటిలో కలిసిపోయి జాగ్రత్తగా చూస్తున్నారు. ఒక్కనిముషం అలా చూచిన ఆదెమ్మ గడ్డిసెట్టితో

"ఆడు సుక్కడు" అంది మెల్లిగా.

గడ్డిసెట్టి తలుపు దగ్గరగా వెళ్ళి లోపలివాళ్ళకు మాత్రమే వినిపించినంత మెల్లగా

"సుక్కడు" అన్నాడు.

అలా చెప్పిన తరువాత వంటింట్లోని పొయ్యిమూలకు తప్పుకొని గాలిరాకుండా వేసిన పిట్టగోడ దగ్గరకు ఆదెమ్మని పిలిచి చెవిలో

"ఆదీ! ఆడు చూరుకింద కొచ్చేసరికి ఈ పిట్టగోడ దాటేసి మనం అవతలపక్క నక్కిపోవాల" అన్నాడు.

ఆదెమ్మ తలూపింది.

సుక్కడు గడ్డిపెట్టి ఇంటి చూరుదగ్గరకు వచ్చి కొద్దిగా తూలేడు. తరువాత నిలదొక్కుకొని వంటింట్లోనికి వచ్చాడు. అంతా చీకటిగా వుంది. ఒక నిముషం నిలబడి తుపుక్కున ఉమ్మేడు. తరువాత తడువుకొంటూ మూసివున్న ఇంటి తలుపు దగ్గరకు వెళ్ళి ఒక్క తోపు గట్టిగా తోసేడు. రాలేదు. తలుపునకున్న కన్నాలు తడివి అందులోనుండి చూసేడు. లోపల చీకటిగా నిశ్శబ్దంగా వుంది ఉండీ ఉడిగీ పడుకున్నట్టుగా లోపల నుండి గురక వినబడుతుంది. సుక్కడు గురకవిని కసిగా

"సాకల్నాంజికొడుకు దాని పక్కన తొంగోని గురకెడతన్నాడు. దాన్ని ఆడినీ కలిపి గుండిల్లోన పొడకపోతే ఈ బలమేల? అన్నాడు. తరువాత అనుమానం తీర్చుకోవడానికి మరోసారి తలుపు కన్నంలో నుండి చూసి

"ఇదిగీ కమీసనీస్టు నాకొడుకు లెక్కడికెలిపోనారో! కంట్లబడినారు గారు. సాంబన్న బావుతోని సొప్పిసి ఈల పిలకలు పోలీసోలకందించుద్దుం కల్లుసుక్కలికి డబ్బులివ్వనేని ఎదవ నా ఎదవలు నా బతుకుని బాగు సేసేత్తారట. వావుడికి తెలదు; సందాలొట్టుకుపోనానికీయెత్తులు. సాంబన్న బావు సొప్పిందే సానానిజం. ఈ లిప్పుడే తోటలోన మీటింగెడతన్నారో సూసి, అల్లా కల్లుపాకలోన ఒక సుక్కేసి అప్పుడు సెపతా నీలపని" అంటుండగా లోపల గడబిడయింది.

సుక్కడు ఒక్కగెంతుగెంతి వంట ఇంట్లోనుండి పెరట్లోనికివచ్చి "ఆ సాకల్నాకొడుకు ఉచ్చపొయ్యనానికి నెగిసినాడు గావాల! ఆడిగ్గాని ఇక్కడ దసులుపడిపోతే సానా సిక్కు" అని సరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు.

సుక్కడు వెళ్ళిపోగానే గడ్డిసెట్టి దగ్గాడు. లోపల దీపంవెలిగింది. తలుపు తెరిచారు. అప్పటికే సోమయ్యను ఇద్దరు మనుషులు పట్టుకొని ఆపుతున్నారు. సోమయ్యని మందలిస్తూ గురువు

"కామ్రేడ్"అంత ఆవేశం పనికిరాదు. నువ్వు ఇలాగ ప్రవర్తిస్తే ఒక్కొక్కప్పుడు మనకే నష్టం" అన్నాడు,

సోమయ్య ఉద్రేకంగా

"ఏటి గురువూ! అదిగా నంజికొడుకుని రొండు ముక్కలకిందన నరుకుదును. ఆయేల ఆదిని కొట్టిన్నాదే ఆడ్ని నరక్కండా వొదల్డంనాదే తప్పైపోనాది" అన్నాడు.

గురువు తాపీగా

"..రె! ఇప్పుడు మించిపోయిందేమీ లేదు. అలాంటి వాడ్ని క్షమించకూడదు. వాడి సంగతీ ఆ సాంబన్న సంగతీ చూద్దాం"అన్నాడు.

బోడయ్యకూడా ఆవేశంగా

"ఈ కుక్కల కొడుకు నెక్కేటి గురువూ! ఉల్లి కాదు ఉసిరికా గాదు. రేంగాయ రసంగాడు, ఈడు! ఊదిత్తే పదాఁవడలు పడిపోతాడు" అన్నాడు.

గురువు వాచీ చూశాడు.

"కామ్రేడ్స్ మేము చాలా ప్రయాణం చెయ్యాలి. తిరిగి మిమ్మును కలిసే సరికి కొద్దిరోజులుపడుతుంది. వస్తాము" అన్నాడు.

అంతా రెడ్ శాల్యూట్ చేశారు.

గడ్డిసెట్టి త్రోవచూపగా బస్సులు తిరిగే రోడ్డు దిశగా నాయకులిద్దరూ నడిచారు.

# 11

నాయకుల్ని పార్వతీపురం నుండి శ్రీకాకుళం వెళ్ళే బస్సు ఎక్కించి గడ్డిసెట్టి తిరిగివచ్చేసరికి తెల్లగా తెల్లవారిపోయింది. రాత్రంతా నిద్దర లేకపోవడంతో కళ్ళు విపరీతంగా మండుతున్నాయి. పగలంతా బట్టలు ఉతికి రాత్రికూడా సరైన విశ్రాంతి లేకపోవడంతో శరీరమంతా పీకు పెడుతుంది. తల దిమ్ముగా తెలియని బాధగా ఉంది.

"టీ తాగితే బాగుంటాది గావాల!" అని టీ పాకలోకి చొరబడ్డాడు.

టీ కొట్టులో చాకలిపెద్ద ఇసాయిగాడు మట్టిదిమ్మ మీద కూర్చొని చుట్టకాలుస్తూ చేతులు ఎగరేసి ఏదో చెబుతున్న వాడల్లా గడ్డిసెట్టిని చూసి తక్కున ఆగిపోయాడు. మిగిలిన వాళ్ళంతా గడ్డిసెట్టిని విచిత్రంగా చూశారు. గడ్డిసెట్టి వాళ్ళని గమనించకుండా మామూలుగానే వెళ్ళినీళ్ళు మరుగుతున్న పొయ్యికి ఎడంగా కూచొని టీ అడిగాడు. దుకాణంవాడు టీ ఇచ్చేలోగా చాకలిపెద్ద ఇసాయిగాడు గడ్డిసెట్టివైపు తిరిగి కళ్ళెగరేస్తూ

"ఏట్రాగడ్డియ్యా! నీడరవై పోతన్నావట?"అన్నాడు వ్యంగ్యంగా

గడ్డిసెట్టి అప్పటికే అలసటతో చాలా చిరాగ్గా ఉన్నాడు. ఇసాయి గాడి వ్యంగ్యానికి మరీ చిరాకు పడుతూ

"నాను నీడర్నయినట్టిగయితే మూడొందల రూపాయిలెట్టి రొండు ఊరపందుల్ని సంపి సారాపోస్సి నువ్వేస్సిన తప్పొందుకు కడతాను" అన్నాడు.

ఇసాయి గాడికి గడ్డిసెట్టి సమాధానం దెబ్బతీసింది. పది మందిలో తను అలా అనేసరికి కొపం వచ్చింది.

"ఏందిరా ? నువ్వేటి ఆకాసం బొక్కలోనుండొచ్చినావేటి ? జాతి గాని జాతిదాన్ని లేపుకొచ్చినావు. తప్పువొవులికోసం కడతావురా? ఇంకా

తప్పేసి జాతిల నాను గాబట్టి కలిపినాను. మరొకిలయినారుగారు. ఎలేపిస్తే నీగిరి కట్టేసును" అన్నాడు.

గడ్డిసెట్టి దుకాణంవాడు అందించిన టీ రెండుగుక్కలు తాగి

"ఎలేసేసినా సానా బాగుండిపోను. అదిగా నాయిడి బావు కాలొట్టుకొని తీసుకొచ్చిన సొమ్ము పీకలమీద నున్నాది" అన్నాడు.

ఇసాయిగాడు ఉక్రోషంగా

పీకలమీదున్నాదంతే ఉండదేటిమరి? నీవొంటికి కాపరం ఎగదన్ని గదబగుంట నొట్టుకోనొచ్చినావు. నాను తెమ్మన మన్నాన్రా? సాకల్దాన్ని పేసుకుంతే నీకుతప్పెందుకు పడతాది? అప్పెందుకవతాది. నీతప్పుంచుకొని నన్నంతావేంది?" అన్నాడు.

గడ్డిసెట్టి సమాధానం చెప్పేలోగా బాకి అప్పిగాడు అక్కడికి వచ్చి

"ఇసాయా! నాయుడుబావు మీ సాకలోల్ని తోలుక రమ్మన మన్నాడు. ఊరి పెద్దోలంతన్నూ నాయిడి బావింటికాడి కూకొనున్నారు. మిట్టకాయల మీదన రావాల" అని చెప్పాడు.

ఇసాయిగాడు గడ్డిసెట్టితో

"బాన్రోరి గడ్డియ్యా! మనోలు సానామంది రేవుకెలిపోయి నట్టుగున్నారు నాయిడుబావు కపురెట్టినాడంతే ఏవోపెద్ద ఇసేసమే ఉంటాది. అని అక్కడ ఉన్న ఇతర చాకళ్ళను లేవదీసుకొని గడ్డిసెట్టితో సహ బయల్దేరాడు.

గడ్డిసెట్టి నాయుడి ఇంటివైపు నడుస్తూ

"ఇదెక్కడొచ్చిపడిన సంతరా నాయనా! ఇంటికెల్లి సక్కగా కునుకు తియ్యాలనుకుంతే ఈ నాయుడు గాడి కిప్పుడే పట్టుకోవాలా పోయీకాలం" అని చిన్నగా సణుక్కుంటూ వెళ్ళాడు.

నాయుడి ఇంటిముందు చావిడి మీద కరణంతోపాటు పెద్దింటి పెదబాబూ కొసింటి అప్పలస్వామీ వడ్డీల శ్రీరాముడూ ఇంకా చాలామంది గ్రామ పెద్దలు కుర్చీలమీదా కూర్చొని ఉన్నారు.

కళాసి కురమయ్య వెనకగా చాలామంది వ్యవసాయ కూలీలూ, ఇతర వృత్తులవాళ్ళూ కూర్చొని గ్రామపెద్దలవైపు చూస్తున్నారు.

చాకలిపెద్ద ఇసాయిగాడు రాగానే నాయుడు సాదరంగా

"ఇసాయా! ఇటొచ్చి కూకో!" అన్నాడు.

కానీ అక్కడెక్కడా ఇసాయిగాడు కూర్చోడానికి ప్రత్యేకమైన స్థలమంటూ కేటాయించబడిలేదు. అయినా నాయుడు కూచోమని అనగానే ఇసాయిగాడు పొంగిపోయి మూతిమీసాలు సవరించుకుంటూ నేలమీదనే కూర్చొని తన వెనకవచ్చిని చాకళ్ళనూ గడ్డిసెట్టినీ

"కూకోండ్రా!" అన్నాడు. చాకళ్ళంతా కూచున్నారు.

కరణం తన చత్వారపు కళ్ళద్దాలలోనుండి ఒకసారి చుట్టూచూసి "అందరూ వచ్చినట్టేగదా?" అని అడిగాడు.

నాయుడు సమాధానంగా

"ఇంచుమించుగా వచ్చినట్టిగే!" అన్నాడు.

కరణం నాయుడ్ని చూసాడు. నాయుడు పెద్దన్న ప్రజల్ని చూసాడు. తరువాత కూర్చున్న కుర్చీలో ఒకసారి సర్దుకొని చిన్నగాపొడి దగ్గుదగ్గి

"నాలుగురోజుల కిందట నాకు తాసీల్దారుగారు కబురెట్టి చెప్పారు. మన జిల్లా, అంటే శ్రీకాకొళానికంతటికున్నూ కమ్యూనిస్టుల బెడద ఎక్కువైపోయింది. పూర్వం కమీనిస్టులు ఇప్పుడు నక్సలైట్లయిపోయారు అప్పుడే రెండుదొపిడీలు, మూడు ఖూనీలు జరిగిపోయాయి. మనుషుల తలలు నరికి రక్తాలు గళాసుల్లోపోసుకొని గటగట తాగుతున్నారు. గవర్నమెంటు ప్రజలఆస్తుల రక్షణకు పోలీసుల్ని దించింది. వాళ్ళపని పడుతుంది.

"ఇక మనఊరిమాట!"

"మనూర్లో నున్నవాళ్ళంతా చాలా మంచివాళ్ళు. అంతమందికీ మహాత్మాగాంధీ గారన్నా వారిపార్టీ అన్నా గొప్ప అభిమానం ఉంది. మీ కంతమందికీ తెలుసునుకదా?! మనదేశం ఎలాటిదంటే చీమనికాదు సరి కదా పాముని చంపితే పాపమని నమ్మినదేశం. పాముల్ని పూజించి, ప్రార్థించి కరవకుండా ఉండమని మొక్కుబడులు చెల్లించినదేశం.

ఈ నక్సలైట్లు సాక్షాత్తూ రాక్షసులు. అందుచేత వాళ్ళబారి నుండి మనం మనల్ని రక్షించుకోవాలి. అందుకుగాను మనం గ్రామరక్షక దళాన్ని ఏర్పాటు చెయ్యాలి.

గ్రామ రక్షక దళమంటే మరేటికాదు. పదేసిమంది ఒక్కొక్క జట్టుగా ఎప్పుడి తెల్లవార్లూ గ్రామాన్ని కాపలా కాసి, నక్సలైట్లు వస్తున్నట్టుగా అలికిడి తగిలీసరికి ఇక్కడికి రెండుమైళ్ళలోనే ఉన్న పోలీసు కేంపుకి భోగట్టా అందిస్తే సరి! పోలీసులు వచ్చేలోగా మనమంతా కర్రా కత్తీ తీసుకొని వాళ్ళని అదరగొట్టాలి. అదీ! అలాగచేస్తే మన గ్రామానికి మరి నక్సలైట్ల బెడద ఉండదు. రామరాజ్యంలో రాక్షస సంహారం జరిగిపోతుంది" అన్నాడు. తరువాత అపర గాంధీగార్లా నవ్వబోయి బోసినోరు తనది కాదని తెలుసుకొని వూరుకున్నాడు.

జనమంతా నిశ్శబ్దంగా విన్నారు. తరువాత నిశ్శబ్దంగా ఉన్నారు. అది చూసి కరణం

"మాటా మంతీ లేకుండా మునిగిల్లా గున్నారేట్రా? ఏంరా ఇసాయా! ఏటంటావు?" అని మొదట ఇసాయిగాడ్నే అడగాడు.

ఇసాయిగాడు భుజాలెగుర వేసి

"అదిగలాగే సేద్దుంగాని బావూ! పూరికి ఆపదొస్తాదంటే పల్లకూరుకుంతావా?" అన్నాడు.

ఇసాయి మాటలు కరణానికి ఉత్సాహాన్నిచ్చాయి. ఆ ఉత్సాహంలో

"మరింకేం? చాకళ్ళు ఒకరోజూ, వ్యవసాయకూలీలు మరొకరోజూ మేదర్లూ మంగళ్ళూ కలిసి ఒకరోజూ, రెల్లీలు, మాలోలూ కలిసి మరొకరోజూ..." అంటూ ఏడురోజులకు సరిగ్గా గ్రామంలోని మొత్తం కూలి జనాన్నంతా విభజించి, వాళ్ళలోనే నాయకుల్ని కూడా ఎన్నికచేసి కాగితం మీద లిస్టుగా వ్రాసి ప్రకటిస్తున్నాడు.

నాయుడు ఆనందంగా

"ఊరంతా ఇలాగ కట్టడిమీదనుంటే నక్సలైట్లు కారు, వాళ్ళ నాయినమ్మలు కలిసి వచ్చినా మన వెంట్రుక ముక్కకూడా తెగదు" అని జనాన్ని ఉబ్బవేసాడు.

కరణం కళాసి కురవయ్యను కూలీలజట్టుకు నాయకుడిగా ప్రక టించి కురవయ్యతో

"నువ్వు ఇవాళే నీ జట్టుతో వూరుకాయాల" అన్నాడు.

కురవయ్య లేచి నిలబడ్డాడు. ఓసారి కుర్చీలమీదనా బెంచీల మీదనా కూర్చున్న పెద్దల్నీ నేల నిశ్శబ్దంగా కూచున్న జనాన్నీ చూసాడు. తరువాత

"బావులూ ! మీరు సెప్పినయన్నీ సానాబాగున్నాయి. మాఁవు పూటకి టికానా లేనోళ్ళఁవి. పొగులంతన్నూ రెక్కలు ముక్కలు సేసు కోని రేత్తిరి నిద్దర నేకుండా ఊరు కాపలాగాస్తే; తెల్లారి మల్లా కూలి కెల్లాల గదా ? దాని మాటేటి ?" అని అడిగాడు.

పెద్దలంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. కరణం బొమలు ముడిచి కళ్ళద్దాల్లోనుండి కళాసి కురవయ్యను చూసాడు. తరువాత తాపీగా

"నిజమేరా కురవయ్యా ! నువ్వన్నమాట నిజమే ! కానీ గ్రామం కోసం మీరు త్యాగం చెయ్యాలి. త్యాగమంటే మరేటనుకున్నావు ? పది మందికోసం ఒకపూటపస్తుంటే ఏటి పోద్ది ?!" అన్నాడు.

కళాసి కురవయ్య కరణాన్ని చూసి

"బావూ ? కరణంగారూ ; కడుపులోని సల్ల కదలనోలు ఏటిసేసినా ఊరికోసం సెయ్యగలుగుతారు. మాఁవు ఊరు కాపలాగాత్తే మరి మీ పెద్దోలంతా ఏటిసేత్తారు ? సక్కగ పందిరి మంచాలమీదన తొంగుంతారా? మీరు సక్కగా కునుకు తియ్యానికి మాఁవు నిద్దర్లొదిలీసి తేగాలు సెయ్యాలా ? వొద్దుబావూ ఆ తేగం ! అదిగా కమీనిస్తోలొచ్చినట్టిగయితే మాదగ్గిఏటున్నాది గనక వొట్టుకుపోనానికి ! అదిగాలు అసలకే మా దగ్గిటకి రారు. ఎందుకనంతారా ? ఆలుగాని మాకు కనబడితే అలదగ్గి టున్నిదే మాకియ్యాల ! అదిగందుకు ఆ నస్కలైట్లు మమ్మల్ని సూసి పరిగెట్టి పారిపోతారు" అన్నాడు.

క్రిందన కూచున్న జనమంతా గొల్లుమని నవ్వేరు.

నాయుడు కళాసి కురవయ్యను తీవ్రంగా చూసి

"ఒరే కురమయ్యా! నువ్వేటి మాట్లాడతన్నావో నీకు తెలుసునట్రా! వీళ్ళందరికీ లేని తెలివితేటలు నీకే ఉన్నాయనుకొంటున్నావేటి? జాగ్రత్త" అని హెచ్చరించాడు.

కళాసి కురమయ్య తిరస్కారంగా

"నాయుడుబావూ! నువ్వేటీ నాకు జాగ్రత్తలు సెప్పక్కర్లే! నానేటీ తెలివిగలోడ్నని వొపులితోటి అన్నేదు. ఈలందరిమంచికీ ఇస్టపడినట్టిగయితే కాపలా కాయమనండి. నా కవతల సానా పనున్నాది. బత్తాలు బళ్ళకెత్తాల! నాను నిద్దర మానీసి ఊరుకాయను గాక కాయను" అని స్పష్టంగా చెప్పి వెళ్ళిపోయాడు.

అతని వెనకనే కూలీలంతా నడిచారు. ఆ వెనకనే మిగిలిన జనమంతా నడిచారు.

గడ్డిసెట్టితొందరగా నడిచివస్తున్న కళాసి కురమయ్యను కలుసుకొని

"మాబాగా సొప్పినావు కురమన్నా!" అన్నాడు.

కురమయ్య చాలా తీవ్రంగా

"నంజికొడుకులు ఎఁగిలిసేత్తోని కాకిని కొట్టరు. కాలొట్టుకోని బతిమిలాడినా కానీ అప్పు ఇయ్యరు! గాదిలనిండా దాన్నిం ఉంచుకోని బత్తా వొందరూపాయలు పలికిందాకా గింజ కదపరు. ఇదిగీలంతా పెల్లాల పక్కన సుకంగా తొంగుంటారట! మనఁవీ ఊరు కాయాలట! ఈలెత్తులన్నీ వొపులకీ తెలవనుకొన్నారు గావాల!" అన్నాడు.

గడ్డిసెట్టి సంతోషంతో పొంగిపోతూ

"అన్నా! మనంగాని పల్లకూరుకున్నావంతే ఇదిగీనాయాలంతా పేడసాలల్లోనా పెంటకుప్పలమీదా తొంగుంతారు. ఈలకి పేనాలమీద మా సెడ్డ తీపి" అన్నాడు.

కురమయ్య నవ్వేడు. గడ్డిసెట్టికూడా నవ్వేడు. అలా నవ్వుకుంటూ చాకలివీధి దగ్గర ఇద్దరూ విడిపోయారు.

# 12

గుగ్గిలం చెట్లు లావుగా ఎత్తుగా పెరిగిఉన్న పెద్ద కొండవాలు దగ్గరకు వచ్చిన గార్డు అప్పారావూ కంట్రాక్టరు గురయ్యా జువ్విచెట్టు నీడన నిలబడి ఒకసారి గట్టిగా ఊపిరి విడిచి అలుపు తీర్చుకున్నారు. తరువాత గార్డు అప్పారావు చేతినున్న పొట్టి గొడ్డలిని నేలను పడేసి జువ్వి చెట్టు మొదలుమీద చతికిలబడుతూ

"ఎండకి వొళ్ళు మండిపోతంది. గురయ్యగురూ!" అన్నాడు.

గురయ్యకూడా చతికిలబడుతూ

"నన్నుజూడు! కమీజంతా తడిసి ముద్దయిపోయి స్తానం చేసినట్టి గయిపోయింది" అని గుండెలమీద ఊదుకున్నాడు.

అప్పారావుగార్డు గురయ్యాను ఈర్షగా చూస్తూ

నీకేటిపోయింది గురయ్యగురూ! ఈ గుగ్గిలంమడ రవానా జేస్పినావంటే పాతికవేలకి సొచ్చుండదు. చెమటైనా కారుస్తావు. రక్తమైనా కక్కుతావు. నాకు చూడు తగులుకుంది. ఈ చెట్లకు హేమరు వేసే సరికి తలప్రాణం తోకకి వచ్చి కూకుంది. ఒకటా? రెండా? వొళ్ళంతా పుండైపోయింది. రెండు రూపాయల సారా తాగినా చాలదు. లాబాలునీవి! చెమట నాది. అలాగున్నాది మా డిపార్టుమెంటు అన్నాడు.

గురయ్య కాళ్ళు బార్లా చాపుతూ

"అంతా తెలిసి అలా అంటావేటి అప్పారావు గురూ! చెట్లకి హేమరు వేయించడానికి రేంజర్ని కదిపేసరికీ ఎన్ని పులిబుర్ర కాయితా లొదిపోయాయో నీకు తెలియదా? రేంజరు మా గట్టిపిండం లాగున్నాడు" అన్నాడు.

అప్పారావుగార్డు గురయ్యని చూస్తూ

"నీ అదృష్టం బాగుంది. ఈ రేంజరు చాలా మంచోడు. డబ్బు

పుచ్చుకోడం కొంచెం ఎక్కువే గానీ అనుకున్న పని అనుకున్నట్టే చేస్తాడు. నీకు తెల్దుగాని గురయ్యగురూ! ఈడికంటా ముందున్న రేంజరు ఆడు సానికి తల్లంటే నమ్ము! ఇప్పుడిచ్చింది మరొక గడియకే పరగడుపు. హేమరు వెయ్యడానికి కంట్రాక్టర్ల దగ్గర లాగవలసింది ఒక్క కానీకూడా వదలకుండా లాగీసీవోడు. వాళ్ళని కుక్కల్ని తిప్పి నట్టిగ తిప్పి పెరిమిట్ల టైము అయిపోయిందాకా హేమరు వేసీవోడుకాడు. ఆళ్ళంతా ముక్కూ నోటా ఏడుసుకోని పెనాలిటీలు కట్టుకోని మళ్ళా ఈడికి సదివించుకోని సచ్చీచెడీ హేమరు వేయించుకునీవోళ్ళు!

ఆడు మా ఆఫీసువాళ్ళకి మాత్రం సుక పెట్టీవోడనుకుంటున్నావేటి? అదీలేదు. ఒక నెలకూడా మా జీతం మేము అందుకున్న పాపాన పోలేదంటే నమ్ము. ఆడిబొక్కలన్నీ కప్పుకోడానికి మా జీతాల బిల్లులన్నీ పై ఆఫీసులోనే వొదిలీసీవోడు. మేమంతా అడివిని బుక్కురుకోని బతికీవోళ్ళం. అలాగ ఏడిపించీవోడు. అలాగని ఆడేటి సుకపడ్డాడను కొంటున్నావేటి? అన్నేయం ఎపుడన్నా బాగుజేస్తాదంటావేటి?" అని అడిగాడు.

గురయ్య కంట్రాక్టరు అడ్డంగా తలఊపి

"అన్యాయం ఎవుడ్ని బాగుజేస్తాది? ఎండు దురదలమీద వేన్నీళ్ళు పోస్సుకొని గోక్కున్నట్టిగ ఆ గడియకే సుకంగా ఉంటాది. తరవాత మండిపోతాది" అన్నాడు.

అప్పారావు ఉత్సాహంగా

"అదీ మా బాగా చెప్పినావు. ఆ రేంజరుగాడికి కూడా అలాగే జరిగిందంటే నమ్ము! ఆడి పెళ్ళాం ఎర్రగా నాజూగ్గా; చిక్కితే రక్తం కారినట్టిగ, నీలు తాగితే కంటంలోన కనబడినట్టిగ ఉండీది. దానికి పదేళ్ళ తరవాత మొదటిసారిగా కడుపు కనబడింది. ఏటి జెపుతావు గురూ! ఈ రేంజరుగాడు పెళ్ళాం కడుపు జూసి ఉబ్బులింగడై పోయి పగలూరాత్రీ పెళ్ళాం కడుపు గురించే మాట్లాడీవాడు. కాంట్రాక్టర్లు ఇది కనిపెట్టి ఈడికి ఇంకా ఎర్రెక్కించడానికి బుట్టలతోటి యాపిల్సపల్లూ కోళ్ళూ గుడ్లూ ఒకటేటి నాయినా ఆడి ముందల గదంతా నింపీసేరు.

అడి పెల్లాంకూడా మంచం దిగిదికాదు. ఒకవేల దిగవలసి వచ్చిందంటే అలగొక అడుగూ ఇలాగొక అడుగూ గాలిలోన వేసినట్టిగ వేసీది. ఈడు ఇద్దరి పని మనుసుల్ని పెట్టి ఆలకి టైమ్‌టేబిల్ రాసిచ్చినాడు. అదేటను కొన్నావేటి?

అడి పెల్లాం ఆరోగంటకి లెగిసీసరికి పది యాపిల్‌పల్లు పిండి రసం తాగించాల. ఎనిమిది గంటలకి అరడజను కోడిగుడ్లు ఉడకెట్టి తినిపించాల. పదిగంటలు ఠంగున కొట్టీసరికి ఒత్తాయి రసం రొండు గలాసులు తాగించాల! మధ్యాహ్నం అది గాయమ్మ రెండంటీరెండుమెతుకులు ముని పళ్ళతో కొరికి గిన్నిడు కోడి మాంసం పూర్తి జేస్సేది. సాయంత్రం బోర్నవిటా, హార్లిక్సు, రాత్రికి మరి జెప్పకు....!

ఇలాగా మేపేడు. మనిషి అంతోటి అయిపోయింది, కడుపు మరడక్కు! గూనంత తయారైంది. కడుపుల బిడ్డ పెరిగిపోయాడు. తొమ్మిది మాసాలు అయిపోయిం తరవాత నొప్పులు రావా మరి! వచ్చినాయి.

"అప్పుడు సూడుగురూ! ఈడిబాద. ఊర్లోన డాక్టర్లు పనికిరాలేదు. ఆపరేసను అవసరమన్నారు. ఇక దిక్కేటిమరి? ఇసాపట్నం తీసికెల్లినాడు. కడుపు కోస్తేనేగానీ బిడ్డరాలేదు. వచ్చినోడు మాత్రం రొండు రూపాయల యాపిల్ కాయలాగ ఉన్నాడనుకో.

"కానీ అడి పెల్లానికి మాత్రం మా చెడ్డచిక్కొచ్చిపడింది. ఇంటికి వచ్చి మూడుమాసాలు గడిచీసరికి మళ్ళీ దాని కడుపు తొమ్మిది మాసాలంత తయారైంది. ఈడు గాబరాపడిపోయి మళ్ళా పెసలిస్టులికిచూపెడితే కడుపుల సెత్త ఉండిపోయిందన్నారు. ఇకన ఇసాపట్నం చాలక; రాయివెల్లూరు తీసికెళ్ళినాడు రాయితోని బుర్రబద్దలు కొటుకోవడానికి. అదిగక్కడకూడా బాగు పళ్ళేదుగాని గురూ! ఆలొక గొప్పమాట మాత్రం చెప్పినారు.

"ఇక నీ పెల్లం సంసారానికి పనికి రాదంటే పనికిరాదనీసేరు. ఇక వాడి సంగతి చూడు గురూ! ఆలనీ ఈలనీ ఏడిపించి గడించింది

దాకచేర్లు కారిపించీసినారు. చేతిల డబ్బాచెల్లి పోయింది. పెల్లావాఁ తొంగో దానికి పనికిరాకుండా పోయింది.

ఈలోగా మా పాత ఆఫీసరు మారిపోయి కొత్తోడు వచ్చాడు. ఆ బాబుగారికి ఈడికి ఎక్కడ కుదర్లేదో మనకైతే తెల్దుగాని ఈడిన్ని సర్వేలోకి తోస్నేడు. సర్వేసంగతి నీకు తెలుసునుగదా! కానీ కిసగదు. రాళ్ళపాతి, తారు డబ్బాలు పట్టుకొని సరిహద్దు లెయ్యాల. అడివంతా తిరిగి తిరిగి సవ్వాల. అలాగై పోయింది ఆడి బతుకు!" అని ఆగి ఊపిరి పీల్చాడు.

గురవయ్య కంట్రాక్టరు ఆత్రుత ఆపుకోలేక

"ఆడి పెళ్లాం కడుపు బాగైందా పోనీ!" అని అడిగాడు.

"అదెవులుకి తెలుస్తాది! ఇదంతా ఎందుకు చెప్పినానంటే అన్యాయం ఎవుడ్ని బాగుచెయ్యదని. హెమరేసి నేనింత చెవటలు కక్కినానా.... నా కస్టం నువ్వుంచుకున్నావంటే గురూ! ఇదిగిదేకత!" అన్నాడు అప్పారావుగార్డు గురయ్యకి గురిపెట్టి కొట్టి.

గురయ్య కంట్రాక్టరుకి అప్పారావు గార్డుమాటలు గురితప్పకుండా గుండెల్లో తగిలాయి. మనిషి కోడిపోయిన వాడి నవ్వు నవ్వి

"హమ్మ దొంగనాకొడక గదరా! అందుకే నీకు తల్లికి మొగుడన్నారు. చుట్టూరు తిప్పి నాకే దెబ్బకొట్టేవు గదరా! దేవాంతకమ్ముండకొడక అని మనసులో అనుకొని

"అదేటి అప్పారావు గురూ! నీకిష్టం నాకేల? ఇంటి కెళ్ళగానే ఇచ్చీసూ! అన్నాడు."

అప్పారావు సమాధానంగా

"ఇవ్వకుండా ఎటెలిపోతావుగాని గురూ! కడుపులోన ఎలకలు పరిగెడతన్నాయి. పదపద గంటొంస ఎత్తే సొంది సాంమన్నగాడు ఇంత పిండం పడేస్తాడు. కాని ఆడి రెండో పెళ్ళాం ఉందిగురూ! నువ్వు చూశావో లేదోగాని చుక్కలా గుంటాది. మన రాజుబాపు కాతా అది. దాన్ని అడ్డెట్టుకొని ఆ లంజీకొడుకు ఎంత గడించాడో తెలీదు. అడివికి

అడివంతోటిన్నూ ఆడింటిలోన ఉందంటే నమ్ముదూ! ఆడిమద్దిన జెండా ఎత్తేస్తాడని తెలుస్తంది" అన్నాడు.

గురయ్య ఆశ్చర్యంగా

"అదేటి? అంత లాభంగా వుంటే వెళిపోడం ఎందుకు?" అని అడిగాడు.

అప్పారావు గార్దు పకపక నవ్వేడు.

"ఆడూ ఎలిపోతాడు. నువ్వూ నేనూ ఎలిపోవాల. నువ్వుగాని, నెల తిరక్కుండా ఈ కర్రలు పట్టుకెలిపోతే అదృష్టవంతుడివి. లేకపోతే మనే! ఆడులేడా ఆ కమీనిస్టు గురువు. పురుగుల్ని ఏరినట్టిగా ఈ ఏజెన్సీకి పట్టేసినోళ్ళని ఏరెస్తండు. రెండుమూడు కూనీలు అప్పుడే అయిపోయాయి. పోలీసోళ్ళూ కమీనిస్టులూ ఎదరెదరగా తిరుగుతన్నారు. కొంచెం వొళ్లు దగ్గిరుంచుకో" అన్నాడు.

గురయ్య కంట్రాక్టరు అదురుగా

"ఆడు ఇటుకాసి కూడా వస్తండంటావేటి?" అని అడిగాడు.

అప్పారావు ఒక్కసారిగా కిసుక్కున నవ్వేడు. నవ్వేసి

"ఇక్కడా అక్కడా అని మరడక్కుమీ! పెద్దపులి రోజుకి తిండి కోసం అరపై ఆమడలు నడిస్తే ఈ గురువున్నాడే, ఆరొందలామడలు నడిచేస్తాడు. మాకానోడు. గవర్నమెంటే ఇన్ని తుపాకుల్తోటీ ఇంత మంది పోలీసులతోటీ గడగడలాడి పోతంది. ఈ సొంటిసాంబడి గాడికీ మనకీ దిక్కేటి?" అని కూచున్న దగ్గరనుండి లేచి బద్దకంగా ఒకసారి వొళ్ళు విరిచి

"పద పోదుం" అని నడిచాడు.

ముందు అప్పారావుగార్దూ వెనక గురయ్య కంట్రాక్టరూ నడుస్తుంటగా, కొండవాలు దిగువగా గెడ్డపక్కన దూరంగా అప్పారావుగార్దుకి ఇద్దరు కనిపించారు.

అప్పారావు గార్దు ఆగి మరొకసారి చూసి

"గురయ్యగురూ! గెడ్డపక్కన కోకలు కనపడతన్నాయి. నసీబు బాగుంటే రెండు లాబాలు. రారా!" అని అటుపై నడిచాడు.

గెడ్డపక్కన కనపడ్డ వాళ్ళిద్దరూ ఆడవాళ్ళుకారు. దూరంనుండి చూడడంచేత అప్పారావు గార్దు అలా భ్రమపడ్డాడు. అక్కడ ఉన్న వాళ్ళిద్దరూ గడ్డిసెట్టి, అదెమ్మ!

అదెమ్మ అప్పటికి కోసిన దబ్బగడ్డి కట్టలు కట్టడం పూర్తి చేసి మోపుగా కడుతూంది. కొడవలి పట్టుకునిల్చున్న గడ్డిసెట్టి అదెమ్మతో

"పేనం తినేసేవే, గడ్డికొచ్చిందాకా! కోత అయిపోనాది గదా! అదిగా గట్టుపక్కకెళ్ళినాను కిత్తలనార కోసుకోనొత్తాను. ఇల్లునేసి నప్పుడు నారకి మల్లా ఎవులొత్తారు" అన్నాడు.

అదెమ్మ దబ్బగడ్డి మోపును తాడుతో గట్టిగా బిగిస్తూ

"వానా కాలం వత్తన్నాదిగాదా! ఇల్లు ఇప్పుడే నేసుకోకపోతే మరెప్పుడునేత్తావేటి? వొల్లువొంచకపోతే బతుకెనాగెల్తాది? బేగెల్లి కిత్తల నార కోసుకోని రా! నానిక్కడే అ సెట్టుకింద నుంతాను" అంది.

గడ్డిసెట్టి కొడవలి తీసుకోని గెడ్డదాటి అవతల పక్కనున్న కిత్త పెండి దగ్గరకు పెళ్ళి కిత్తల మట్టలు పరపరమని కోస్తున్నాడు. అదెమ్మ మోపుగా కట్టిన గడ్డిని పక్కనున్న చెట్టుకిందకుతెచ్చి పైటతో ముఖానికి పట్టిన చెమటను తుడుచుకొని ఎదరగా చూసేసరికి అప్పారావుగార్దూ గురయ్య కంట్రాక్టరు కనిపించారు. వాళ్ళనుచూసి గాభరాగా

"ఇదేటోలమ్మ. ఈలిక్కడ దాపరించినారు" అనుకొంది.

అప్పారావుగార్దు చెట్టుకిందనున్న అదెమ్మ దగ్గరగావచ్చి

"ఏటొలే ఆదీ! సాకలోడితోటి లెగిసి పోనావట, ఎలాగుంది యాపారం?" అని అడిగాడు.

అదెమ్మ మాట్లాడలేదు, అప్పారావుగార్దు కిశ్శగరేస్తూ

"పిక్కలాగ పెటపెటలాడతన్నావే! నీముందల అ సొండిసొంబడి గాడి పెల్లాం బలాదూరు. సాకలోడి సంగతిచూసినావుగదా! నా సంగతొక సారి చూడరాదటే?" అన్నాడు.

అదెమ్మ అప్పటికీ మాట్లాడలేదు. అది అదనుగా తీసుకొని అప్పా రావుగార్దు అదెమ్మపైట లాగాడు, అదెమ్మ కస్సున నాగుపాములా బుసకొట్టి

"బావూ! వొల్లు దగ్గిటుంచుకోని తిన్నగెల్లుమీ మల్ల" అంది.

అప్పారావు గార్డు వెకిలినవ్వు నవ్వుతూ

"నిన్నొకసారి జూస్సి దారంట తిన్నగే ఎల్లి పోనాన్లేయే! రద్దూ! గురయ్య కంట్రాక్టరు ఉట్టి చేతుల్తో పంపడులేయే! రా! అని పట్టుకున్నాడు.

ఆదెమ్మ అప్పారావు గార్డుని ఒక్క తోపు తోసింది. దానితో అప్పారావు రెచ్చిపోతూ హేమరు వేయడానికని తెచ్చిన గొడ్డలిని దూరంగా విసిరేసి

"గదబనంజికూతరా! కోరి పిలిస్తే కులం తక్కువే! పతివ్రాత నాగ బెట్టుజేస్తున్నావు. సాకలోడిపాటి సెయ్యదేటే ఈ అప్పారావుగార్డు. రాయెస్" అని పైట లాగేడు.

ఆదెమ్మ గుండెలు నగ్నంగా బైట పడ్డాయి.

ఆదెమ్మ గుండెలమీద చెయ్యి వేయబోతున్న అప్పారావుగార్డు దవడ పగల గొట్టి

"సంపేత్తన్నారు. రారోరి మాంవో!" అని పెద్ద పెట్టున గావు కేక వేసింది.

అప్పారావుగార్డుకి చెంపదెబ్బ తినడంతో విపరీతమైన రోషం వచ్చింది. అంతవరకూ అలా దెబ్బ తినని అప్పారావు గార్డు; అందులోకి గురయ్య కంట్రాక్టరు ముందు గదబగుంటచేత లెంపకాయ తినడంతో రెట్టింపుగా విజృంభిస్తూ

"ఎవుడే మీ మాంవ? రమ్మనే! అడికి చెట్టుకి కట్టి ఆడి కళ్ళముందల నీ కోక విప్పకపోతే ఈడు తల్లికి మొగుడేకాడు" అని ఆదెమ్మమీద పడి గబగబా కోక ముడి లాగడానికి ప్రయత్నించాడు.

ఆదెమ్మ అడ్డుకుంటుంది. అప్పారావు బొడ్డుముడి తడువుతున్నాడు. గురయ్య కంట్రాక్టరు నవ్వుతూ ఆనందంగా చూస్తున్నాడు.

అంతలో ఆదెమ్మ గావుకేక వినబడిన గడ్డిసెట్టి గెడ్డ అడ్డంగాపడి పరుగు పరుగునవచ్చి; చెట్టుకింద జరుగుతున్న దృశ్యం చూశాడు. కళ్ళవెంబడి నిప్పులురాలగా అటూ ఇటూ చూసి; అప్పారావుగార్డు పారవేసిన హేమరువేసిన గొడ్డలి తీసి

"ఒరే! తల్లికి మొగుడా! నీ యమ్మకి నువ్వు మొగుడువిగానీ" ఊరందరి పెళ్లాలకీ మొగుడువికాదురా?! అని గడ్డిసెట్టి గొడ్డలి ఎత్తేడు.

అప్పారావుగార్డు హఠాత్తుగా గడ్డిసెట్టి మాటవిని, ఆదెమ్మను వదిలి పారిపోబోయాడు.

పారిపోతాడని గ్రహించిన గడ్డిసెట్టి విపరీతమైన క్రోధంతో

"ఆగారే" అని గొడ్డలి విసిరాడు. అది గిరగిర గాలిలో తిరిగి అప్పారావుగార్డు కుడికాలిలో కసుక్కున దిగబడిపోయింది.

అది చూసి గురయ్య కంట్రాక్టరు పరుగు పుచ్చుకున్నాడు. అప్పారావు గార్డు గావుకేక వేస్తూ

"చంపీసేవురారే సాకల్నంజకొడకా!" అని తనచేతిలోకి వూడి వచ్చిన ఆదెమ్మ కోకని అక్కడే వదిలేసి అదే ఊపున గురయ్య వెనుక పరుగు పుచ్చుకున్నాడు.

అప్పారావుగార్డు పరిగెడుతున్న మేర రక్తం ధారగా కారుతూనే ఉంది. గడ్డిసెట్టి అప్పారావుగార్డుని కొంతవరకూ వెంటతరిమి తరువాత కొంట్రించి ఉమ్ముతూ

"బతికిపోనావురా! నంజికొడకా! ఆ తాటకి ముండకి ముండ మొయ్యానికి రాసినేదు" అని ఆదెమ్మ దగ్గరకు వచ్చాడు.

ఆదెమ్మ అప్పారావుగార్డు వదిలేసిన తన కోకని గబగబా వంటికి చుట్టుకుంటూ గడ్డిసెట్టిని కౌగలించుకొని ఏడ్చింది.

గడ్డిసెట్టి

"వల్లకో! వల్లకోయే! పిరికి నంజికొడుకు పరుగుచ్చుకున్నాడు. నేపోతేనే! ఆడిని పదిముక్కల కింద నరుకుదును" అని ఉద్రేకం అపుకోలేక ఆదెమ్మతోపాటు తనూ ఏడ్చాడు.

ఆదెమ్మ అంత విచారంలోనూ ఆశ్చర్యంగా గడ్డిసెట్టి ముఖంలోకి చూసి

"అదేటి? నువ్వేడస్తన్నావు? ఆడేటన్నా సేత్తాడని బెంగపడి పోతన్నావేటి? ఆడేటి సేత్తాడు? కుక్కల కొడుకు" అంది కసిగా!

గడ్డిసెట్టి తల అడ్డంగా ఊపుతూ

"ఆదిగందుకు ఏడనేదే! కొట్టిన దెబ్బకి ఆ నంజకొడుకు కేసెనాగా ఎడతాడు. నా కెనాగా కటకటాలు తప్పవుగాదా! ఆ తగిలినదెబ్బ ఆడి పీక మీద తగిలినాదిగాదు. ఇక్కడే పాతిద్దును. అదిగందుకు నాకు సానాఇదిగా ఉన్నాది" అన్నాడు.

అదెమ్మ గడ్డిసెట్టి కళ్ళు తుడిచి

"పదపద! గదబోలన ఎల్దుంగాని. అన్నకి సెపితే అడు గురువుకి సొప్పి ఏదైన సేత్తాడు అంది.

గడ్డిసెట్టి నిరాశగా

"అన్నేటి సేత్తాడు? ఆ తల్లికి మొగుడ్ని. ఇదిగిక్కడే గుమ్మితీసీ పాతిత్తే గురువు మెచ్చుకున్ను!" అని దబ్బగడ్డిమోపును తలమీదికి ఎత్తుకున్నాడు. అదెమ్మ కొడవలి పట్టుకొని వెనక నడిచింది.

ఇద్దరూ గదబవలస దిశగా నడిచారు.

# 13

గడ్డిసెట్టి ఇంటిముందర నాయుడివలసలోని పెద్దలంతా సమావేశమైనారు. అదెమ్మ ఏడుస్తూ నట్టింట్లో కూచొనివుంది. సోమయ్య, నాయుడు కరణాల కెదరగా నిలబడి వున్నాడు. చాకలిపెద్ద ఇసాయిగాడు గడ్డిసెట్టి గడపమీద కూర్చున్నాడు. సాయంకాలపు నీరెండ గడ్డిసెట్టి గడపలోపడి అందరి ముఖాలమీద ప్రతిఫలిస్తుంది.

నాయుడుచేతిలో గడ్డిసెట్టి వ్రాసి ఇచ్చిన తనఖా కాగితం వుంది. కరణం ఇసాయిగాడితో

"అంతా చూసేవు గదరా ఇసాయిగా! మీ వీధిలో ఇలాటి గోర కలి ఇంతకు ముందు ఎన్నడూ జరగలేదు గదా! అ గార్దుగాడి కాలు సెప్టిక్కయిపోయి తీస్సినారు. దాంతో డిపార్టుమెంటు డిపార్టుమెంటంతా

ఒకటై పోయింది. ఇవాళ ఆడికైంది, రేపుమనకి అవుతుందని గడ్డిసెట్టికి గట్టి శిక్షపడినట్టు చేశారు. మనం మరేటి జేస్తాం. అయినా కాలం ఇలాగ ఎప్పుడైనా కాలిపోయిందంటారా? నాయినా, బాబూ, చిత్తంబత్తెం అని బతకవలసిన చాకలోళ్ళు గొడ్డలి విసిరి ఖూనీలకు దిగడం ఏకాలంలోనైనా విన్నావటరా? ఆ గడ్డిసెట్టిగాడికి పోయీకాలం పట్టుకుంది. నక్సలైట్లు ఖూనీలు చేస్తున్నారని ఈఁడూ రెగిస్తే ఇలాగే అవుతాది? అన్ని పాములూ తలెత్తి ఆడాయని లేడికి పామూ తలెత్త బోయిందట. అలా గుంది ఈ వ్యవహారం। అన్నాడు.

ఇసాయిగాడు గంగిరెద్దులా తలాడిస్తూ

"గంగిగోవు నాటోడు బావూ ఈ గడ్డిసెట్టిగాడు। ఈఁడికేటీ పొయ్యే కాలం పట్టుకున్నాదోగానీ ఇలాగ సేసినాడు। అసలాడు మీద ఊసిత్తే తుడుసుకోని ఎలిపోయీవోడు. నాయుడి బావుకి తెలదా ఏటి" అన్నాడు।

నాయుడుకూడా విచారం నటిస్తూ

"ఎవుడు చేసుకున్నదాడికి కట్టి కుడుపుతాది. మంచోలు చెడ్డోలు గావడం మన కళ్ళతోటె చూసేం గదా। ఒకప్పుడు పిల్లుల్లాగా కనబడిన జాతాపులూ సవర్లూ గదబలూ పులుల్లాగ తిరగబడతన్నారుగదా? ఆ గదబ గుంట ఆడి ఇంట్లోన అడుగుపెట్టింది. ఆడికి శని పట్టిసింది" అని ఓరగా సోమయ్య వైపు చూశాడు.

సోమయ్య ఏమీ మాట్లాడలేదు. అదిచూసి నాయుడు మళ్ళీ తనే మాట్లాడుతూ

ఆడు బాగుపడి ఒక ఇంటివాడుకావాలని మూడువందలు కరుకుల్లాటి రూపాయలిచ్చాను. ఆడికర్మ ఇలాగ కాలిపోయింది. మీరంతా చూసేరు గదా। ఆడినట్టింట్లో వున్న ధాన్యం గింజిలు నూటయాభై రూపాయలకి కట్టారు. మిగిలిన నూటాయాభై రూపాయలకి ఈ ఇల్లు వదిలేసీ మనండీ; ఆడు ఇంతకాలం నాగుడ్డలు గుంజేడు గాబట్టి వడ్డీ వదిలేస్తున్నాను అన్నాడు.

అది విని ఇసాయిగాడు నాయుడ్ని పొగుడుతూ

"నాయుడు బావు సానా మంచోడు. వొడ్డి వొదిలీసినాడు. మరొక లయినట్టి గయితే ముక్కుపిండి మూడు చెరువులనీరు తాగించుద్దురు" అన్నాడు.

కరణం సంతోషంగా దానికి వంతపాడుతూ

"గ్రామపెద్దలన్నతరవాత ఉదారంగా ఉండాల గదరా! కష్టమైనా, నష్టమైనా భరాయించాల. ఊరందరికీ తగువులు చెప్పిన మేము అన్యాయంగా ఉంటామా? గడ్డిసెట్టి సంగతి పూర్తిగా తెలిసే ఇలా చేసాము. ఏమంటావు సోమయా?" అని సోమయ్య నడిగాడు.

సోమయ్య అంతావిని మారు మాటాడకండా నట్టింట్లో ఏడుస్తున్న ఆదెమ్మతో

"అమ్మీ నెగునెగు! పొద్దుపోతన్నాదిగాదా! గదబొలస నడాల" అన్నాడు.

ఆదెమ్మ మరొక్కసారి గొల్లున ఏడ్చి

"అన్నా" అంది.

సోమయ్య ఉబికి వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంటూ

"నెగే! నీ అన్న బతికే ఉన్నాడు. నెగు నెగు" అని లేపేడు,

ముందు సోమయ్య నడవగా వెనక ఆదెమ్మ నడిచింది. గదబవలస గోరిజవైపు నడుస్తున్న వారిద్దర్నీ చూసి మొదట కరణం నవ్వగా తరువాత ఇసాయిగాడూ ఇతర పెద్దలతో కలిసి నాయుడూ నవ్వేడు.

సోమయ్య నడుస్తూ ఆదెమ్మతో

"అమ్మీ! ఆయాల నీ ఇంటికి నానూ గురువూ వొచ్చిన్నాడు, నీ బతుకు అలాగే ఉండాలని సొప్పి సానా అనుకొన్నాను. ఏది? మూనాలకె ఇనాగై పోనాది. నాయిడొలసోలంతన్నూ తడి గుడ్డలతోటి గొంతుకలు కోస్సిన రకం. నా కిప్పుడే తెలిసినాది. నువ్వేటీ బెంగెట్టుకోక! గడ్డియ్యకి సిచ్చ అయిపోగానే వొదిలేత్తారు. కల్లుమూసి తిరగ జూసీ సరికి గడ్డియ్య నీ దగ్గిటుంటాడు!" అని ఊరడించాడు.

ఆదెమ్మ అన్న సోమయ్య మాటవిని కుమిలిపోతూ

"అదిగాదన్నా! ఆడొచ్చిందాకా అదిల్లుకవిపెట్టుకోని ఉండనే. పోనాను గదా! కుదురుగా కుందిర్లాటి పింటిఇల్లు; ఆ గంటడు నాయిడికొప్ప జెప్పేసి ఆదెమ్మ దాని మన్నాన అదెల్లిపోనాదని గడ్డియ్య మాఁవ అను కోడా?" అంది ఆదెమ్మ బాధగా

సోమయ్య ఆదెమ్మ మాటను కొట్టివేస్తూ

"ఓలె; ఎర్రిదానా! గడ్డియ్య అలాటి పింటోడు కాదే! ఆడు ఈ మేక తోలు కప్పుకున్ని పులులు ఏసికాలన్నీ ఎరుగున్నెయే! ఈ నాయు దొలస నాయిడ్ని ఎరగడా ఏటి? ఆడు మల్లా రానిద్దూ, ఈడిపని సూసే త్తాడు" అన్నాడు.

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు. చీకట్లునాలుగు 'క్కులా కమ్ముకుంటున్నాయి. దూరంగా నక్కలు అరుస్తున్నాయి. గదబవలస పొలిమేరఁకు చేరేసరికి, వలసలోనుండి కేకలు వినిపిస్తున్నాయి. కేకలు విన్న సోమయ్య ఆదెమ్మతో

"తెల్లారి నెగిసి ఇటిలిపొచ్చినాను, ఏటైనాదో ఏటో" అన్నాడు.

ఆదెమ్మ

''ఏటన్నా?'' అని అడిగింది.

సోమయ్య విట్టూరుస్తూ

"సొండిసాంబడు పోలీసోఁతోటి కలిసిపోయి గోరాలు సేయిత్త న్నాడు. పైకి కనబడకండా సుక్కుడ్నీ అడ్డేసుకోని సెలాయిస్తన్నాడు. రోజు కొకల మేకపిల్ల కొండబోతున్నారు. కోడిపెట్టలకి నెక్కేనేదు. ఇయాల ఎవలది పోనాదో ఏటో!'' అని లుచ్చ గొట్టాడు.

ఆదెమ్మ సోమయ్యని తొఁదర చేస్తూ

"బేగి నడైతే మరి'' అని ముందు నడిచింది.

గదబవలస ఆదెమ్మా సోమయ్యా చేరేసరికి పూర్తిగా చీకటి పడి పోయింది. ఆదెమ్మ గడపలోకి వెళ్ళి

అన్నా! దీపాలెట్టిన ఏలైపోనాది" అంది.

సోమయ్య పరధ్యానంగా

"ముత్తేలు కూకల్నాగున్నాయేటి? ఏటి జరిగిపోనాదోగానీ!" అని కేకలు వినిపిస్తున్న వైపు వెళ్తూ

"అమ్మీ! నువ్వెల్లి దీపం ఎట్టిమీ! నానలాగ ఆ కూకలేటో సూసుకొనొత్తాను" అని ఆదెమ్మని వదిలి వెళ్ళేడు.

సోమయ్య వెళ్ళేసరికి ముత్తేలు సుక్కడ్ని పట్టుకొని

"ఉక్కలోడి కొడక! నీ పీకముడి కొరికేత్తాను. నా మేక దొరికినాదిరా నీకు; ఆ పోలీసోల కొప్పజెప్పటానికి? ఇప్పుడు నీకెవులు దిక్కో, ఏ పోలీసోలు నీ కడ్డుపడతారో సూత్తాన్రా" అని సుక్కడి జుత్తుపట్టుకొని కిందకి వంచేస్తుంది.

బోడయ్య ఇద్దర్నీ విడదియ్యటానికి చాలా కష్టపడి విడదీయలేకపోతున్నాడు. చుట్టూ మూగివున్న జనం సుక్కడ్ని నోటికి వచ్చినట్టు తిడుతున్నారు. మరికొందరు సొంటిసాంబన్నని తిడుతున్నారు. సోమయ్య గుంపును వొత్తిగించుకొని

"ముత్తేలూ! వొదిలియ్యే!" అన్నాడు.

ముత్తేలు సుక్కడ్ని వదిలేసింది. బోడయ్య ముత్తేల్ని కసురుతూ

"ముడుకుల బిడ్డనెట్టుకోని ఏటా ఎగరడం? మేకపోతే సూసుకోనానికి మాఁవునేఁవేటి? నువ్వెల్లు" అని నడిపించాడు.

సోమయ్యకూడా కసురుతూ

"అంత తాఁవస పడపోతావేటే? నిండానెలలు గదా? వుత్తమడిసివి కావన్నిది గూడా మరిసిపోతే ఎలాగే?" అన్నాడు.

ముత్తేలు మారు మాటాడకుండా ఇంటివైపుగా నడిచి వెళ్ళిపోయింది. సోమయ్య బోడయ్యతో

"సూడ్రా బోడీ! ఇనాగ ఈఁడ్ని వొదిలీసినాఁవంటే సానా సిక్కులు తెత్తాడు. మన పేనాలికే ముప్పు తెత్తాడు. ఇయాల ఈఁడితోటి తేలిస్సికుందుంగాని. ఆడ్ని ఈ దవతలకి ఈడుసుకోని రా!" అన్నాడు.

బోడయ్య కూడా

"నానూ అదే అనుకొంటున్నాను" అని సుక్కడి దగ్గరకువెళ్ళి

"రారారే సుక్కా" అని పిలిచాడు.

సుక్కడు రోషంగా

"నాను రాను గాక రాను. రేపు పోలీసు బావుల్తోటివొ త్తాను. అది గప్పుడు నాటీ దెబ్బ తెలుత్తాది" అన్నాడు.

సోమయ్య ఉద్రేకంగా సుక్కడి దగ్గరకువచ్చి మెడపట్టి గెంటుతూ

"పదొస్ నా కొడక నీలిగినావంతే పులుసులోకి ఎఁవికి మిగల కండా ఇరిసీగల్ను" అని త్రోసాడు.

సుక్కడు చేసేదిలేక బోడయ్య వెనక నడిచాడు. ముగ్గురూ వీధి చివర కంకరనేలమీద కూర్చున్నారు. సోమయ్య మాట్లాడతాడేమోనని మొదట బోడయ్య ఊరుకున్నాడు. సోమయ్య మాట్లాడక పోయేసరికి సుక్కడితో

"ఒరే! సుక్కా.... ఎందుకీపింటి ఇదంగా అయిపోనావురా? మా జాతోడివి! అ సొండిసాంబడిగాడి కల్లు సుక్కలకి కుక్కనాగ తిరగ తన్నావు. మా కోలూ, గొర్రెలూ అలకి సూపెడతన్నావు. మాపిటికి గురువొచ్చినా ఆ పోలీసోలకి సూపెట్టేత్తావేటి? అని అడిగాడు.

సుక్కడు నవ్వేడు. నవ్వుతూ

"ఒరే బోడియ్యా! నీకేటి ఎరికెరా? గురువు గురుండి పోలీసు బావులు పటాలాఁకి పటాలాలు దిగిపోతన్నారు. ఆ బోడి గురువు ఎక్కడదొరికితే అక్కడే సపాసేసేస్తారు. జాతాపు గూడలూ సవర గూడలూ గురువు గురుండి తగలెట్టేత్తన్నారు.

అలంతా అడివి వెంటా అగంద్రాలంటా కొంపల్లేక తిరగతన్నారు. సొండిసాంబన్న పోలేసు ఇనసపెట్టేరు తోటి సెప్పి మనూర్ల గూడా పోలేసుల్ని పెడతన్నాడు. సొండి సాంబన్న పట్నం ఎల్లిపోతాడట! బాకీలు జమ సేసుకుంతండు. గురువుపనీ, ఇంకా నీలిగినారంతే మీపనీ

సరి! నీ పెల్లం ఆడదాయని పల్లకూరుకున్నాను. నే పోయినట్టిగయితే ఎవికెలు ఇరిసేద్దును మల్లా ! ''అని ఇంకా వాగుతున్నాడు.

సోమయ్య కళ్ళవెంట నిప్పులు పడుతున్నాయి. ఇక ఒక్క క్షణం ఉంటే సుక్కడి శవం చూడవలసి వస్తుందని లేచి నిలబడి ఇంటివైపుగా నడిచాడు. సోమయ్య పరిస్థితి గ్రహించి బోడయ్యకూడా మాటాడకుండా సోమయ్యను అనుసరించాడు. వెళ్ళిపోతున్న ఆ ఇద్దర్నీ చూసి సుక్కడు విపరీతంగా నవ్వుతూ

"పోలీసు బావులనీ తప్పుడికి బెంబేలెత్తి పోనారు. పిరికి ఎదవలు గద ఎదవలు. ఇకమట్టి నీలిగినారంతే ఈలనీ ఆ గడ్డిగాడిదగ్గిటికే పోలేసు బావులికి సెప్పి తోలించేత్తాను" అని సొండిసొంబన్న ఇంటివైపు నడిచాడు.

నడుస్తున్న సోమయ్య బోడయ్యతో

"బోడే ! సొండిసొంబడుగాడు దాటెత్తాడు. మనకి పోలేసోలకి వొప్పు జెప్పీసి ఎలిపోతాడు. అలుమన పానాలు కొరికీసి తినేత్తారు. మన ఆడోలని.... మరడక్కు. నాను సీకట్నే నెగిసి గురువుకాడకెల్తాను. తిరిగొచ్చిందాకా అదెమ్మని కనిపెట్టుకోనుండు" అన్నాడు.

బోడయ్య

"అనాగే! బేగీ రావలమీ" అన్నాడు.

తరువాత ఇద్దరూ సోమయ్య ఇంటిలో కూర్చొని చాలా రాత్రి వరకూ మాట్లాడుకొని అక్కడే నిద్రబోయారు.

# 14

రాత్రి పెనుగాలి వీచి చెట్లనూ కొమ్మలను విరిచిపారేసింది. కొబ్బరికాయలంత వడగళ్ళు పడి తెల్లవారినా కరగకుండా కొండరాళ్ళ

మధ్యన కుప్పలు కుప్పలుగా పడివున్నాయి. ఆడవాళ్ళూ పిల్లలూ వడ గళ్ళ దెబ్బలకు రాలిన కాయలనూ పిట్టలను తెచ్చుకుంటున్నారు. చల్లని గాలి కొండల మీదనుండి వేస్తోంది. సూర్యుడు తూర్పున ఎర్రగా ఉదయించినప్పటికి కూడా వాతావరణం చలిచలిగా గిలిగింతలుగా ఉంది.

ఊరి వెలుపల గుడ్డిలమీదనున్న తురాయిచెట్లు కుప్పలు తెప్పలుగా తురాయి పూలను రాల్చి ఎర్రని నీరెండలో కెంపులు పరిచినట్టుగా మెరుస్తున్నాయి. కొందరు పిల్లలు పూలను బుట్టలతో ఏరితెచ్చి రకరకాల ఆటలు ఆడుకొని చివరికి చిదిమి పారేస్తున్నారు.

ముత్తేలుకి దొరికిన గువ్వపిట్టల ఈకలు బోడయ్య తీస్తున్నాడు. ముత్తేలు ఉప్పూకారం ఉందోలేదోనని మట్టిపిడతలను చూసి

"వర్రనేదు. ఏటిసేత్తాం?" అని అడిగింది.

"సొండిసాంబడిగాడి కొట్టుకెళ్ళి ఆరువొట్టుకొనిరాయే" అన్నాడు. ముత్తేలు పెదవి విరుస్తూ

"ఆడివ్వడు, నానంతే మాసెడ్డ దుక్కపడిపోతన్నాడు" అంది.

బోడయ్య ముత్తేల్ని చూసేడు. ముత్తేలు పూర్ణగర్భంతో నిండు కుండలా కనిపిస్తుంది. బోడయ్య కారంగుండ సంగతి వదిలేసి

"పిక్కరోడ పుడతాడ్నేయే!" అన్నాడు.

ముత్తేలుకూడా నవ్వి

"సాల్నెత్తూ పరేసికాలు" అంది.

బోడయ్య ఉత్సాహంగా

"సిక్కరోడికి గురుపు పేరెట్టుకుందుం గానేటీ?" అని అడిగాడు.

ముత్తేలు ఆనందంగా తల ఊపింది. బోడయ్య గువ్వల ఈకల్ని దూస్సి పిట్టల్ని ముత్తేలు దగ్గర పడేసి

"నా నెల్తాన్నేయే! సాంబడి కొట్టుకీ" అని బయల్దేరాడు.

బోడయ్య సొండిసాంబన్న దుకాణం దగ్గరకు వెళ్ళేసరికి పారెన్టు వాచర్లు ఇద్దరు అక్కడ వంట ఏర్పాట్లు చూస్తున్నారు. సాంబన్నా సుక్కడూ హడవుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. చంపిన కోళ్ళూ

మరికొన్ని అడవి పిట్టలూ సాంబన్న గదపలో పడివున్నాయి. సాంబన్న రెండో పెళ్ళాం చక్కగా అలంకరించుకొని కోళ్ళనూ పిట్టల్నీ కత్తి పీటతో కోసి మాసం చేస్తూంది. కాలిన కోళ్ళవాసనా ఉడుకుతున్న ఇతర పదార్థాల వాసనా కలిసి ఒక రకమైన వింత వాసనగా మారి నోరూరించింది సాంబన్న ఇంటికి దూరంగానే నిలబడి బోడయ్య మనసులో

"ఇదేట మల్లా! పారిష్టు నాకొడుకులు తయారై పోనారు. ఏటో ఉన్నాది గావాల మల్లా" అనుకొని రెండడుగులు వేసేసరికి సుక్కడు కావిడితో నీళ్ళు తేవడానికని బయల్దేరుతూ ఎదురు వచ్చాడు. బోడయ్య విషయం తెలుసుకుందామని

"ఏట్రా! సుక్కయ్యా! సాంబన్న ఇంటికాడ గందికవు తన్నాది" అని అడిగాడు.

సుక్కడు పలక్కుండా తిరస్కారంగా ముందుకు నడిచాడు. బోడయ్య అనుమానం మరీ ఎక్కువై సుక్కడి వెనక రెండడుగులు వేసి

"గొప్పలు పోతన్నా వేందిరా? సెప్పరాదేటి" అని అడిగాడు!"

సుక్కడు ఆగి బోడయ్యవైపు ఒకసారిచూసి వికారంగా చిన్న నవ్వు నవ్వి

"కొవ్వు దిగిపోతాదినేరా ఈ దెబ్బతోటి మీకు? పారిస్టేరు రాజు బావు నారీలతోటి నీలగిరి మొక్కలు తెచ్చినాడురా మీ సాగు గుడ్డిల మీదన పాతటానికి. ఇకన నూన్కోండిరా! అంబలి దప్పిక్కి వోసివోసి సాంబన్న కాలట్టుకోవాల తుక్కల కొడకల్లారా" అని కావిడితో వెళ్ళి పోయాడు.

బోడయ్యకి ఒక్కసారి అంతా తలక్రిందులుగా కనిపించింది. కొండలు విరిగి అమాంతం ఊళ్ళమీద పడిపోతున్నట్టూ, పిడుగులు మనుషుల నెత్తిన కురుస్తున్నట్టూ అనిపించి ఉణకాలం నిల్చున్న దగ్గరే ఉండిపోయాడు. తరువాత సాంబన్న దుకాణానికి వెళ్ళకుండా ఇంటికి వెళ్ళాడు.

కారం గుండ తీసుకురాకుండా దిగులుగా వస్తున్న బోడయ్యను

చూసి ముత్తేలు ఆశ్చర్యపడింది. ఏదో జరిగితేగాని బోడయ్య అలా ఉండడని ముత్తేలుకి తెలుసు. అందుచేత మరేమీ ప్రశ్నించకుండా బోడయ్యను చూస్తూ అలా నిల్చున్న దగ్గరే ఉండిపోయింది.

బోడయ్య ముత్తేలుకి దగ్గరగావస్తూ

"గోరం జరిగిపోతన్నాదే! అఫారిస్టు నా కొడుకులు మన గుడ్డిల మీదన మొక్కలేసేత్తన్నారు. ఈ సాంబడు గాడు మన కూటిల బుగ్గి పోసీడానికి ఏసినాడే ఎత్తు. ఏటిసేత్తాం(వు?సో(వియ్య నేనప్పుడే ఈ పింటి అపదొచ్చి పడి పోనాది" అన్నాడు.

ముత్తేలు శివాలెత్తిపోయింది.

ఆ సొండోడు అంతోటి పని సేత్తుంటే సూత్తాపల్లకుంతవా? నువ్వా మొగోడివేనే? సిగ్గూ సెరం(వూ నేదా? సో(వియ్యా నేకపోతే వాలసల మరి మొగోడే నేడా? అదిగా గండలు గుడ్డిలమీదన ఎనాగ కాలెదతారో నానూ సూత్తాను. పద పద! ముందెల్లి ఈ సొండోడి బుర్ర సిదగ బొడుత్తాను'' అని మూలనున్న రోకలి తీసింది.

బోడయ్య ముత్తేలు చేతిలోనున్న రోకలి పట్టిలాక్కుంటూ

"నువ్వేటీ అన్నిటికి అనాగ నెగిసిపోతావు. సిటం(వో గడియో నాగున్నాది నీ పురుడు. ససీగా ఉండప్పోతే సత్తావు. నా నెల్లి ఆలు గుడ్డిలమీదన ఏటి సేత్తన్నారో సూసొత్తాన్నేయే! నీకేల మద్దిన'' అని మూలనున్న సేపాటి కర్రతీసి బయల్దేరాడు.

బోడయ్య కర్రతో మెరక భూములకు అడ్డంగాపడి వేగంగా బోడి కొండ దిగువగా నున్న సాగు గుడ్డెల దగ్గరగా వెళ్ళాడు. గోరిజ పక్కనున్న రిజరు మామిడి చెట్టుదగ్గిర రెండు లారీలు ఆగివున్నాయి.

సోమయ్య గుడ్డిమీదా, కొసింటి చలమయ్య గుడ్డిమీదా తనస్వంత సాగు గుడ్డిమీదా కొంతమంది కూలీలు గోతులు తీసి మొక్కలు వరసలు వరసలుగా నాటుతున్నారు? నలుగురు పోలీసుల్తో వచ్చిన ఇనస్పెక్టరు పక్కన ఫారెస్టు రాజు నిలబడి పని పురమాయిస్తున్నారు.

బోడయ్య తిన్నగా రాజు దగ్గరకు వెళ్ళేడు. ఫారెస్టరు రాజు బోడయ్యను చూడనట్టుగానే నటిస్తూ కూలీలను కసురుతున్నాడు.

బోడయ్య ఫారెస్టరు రాజుతో

"బావూ! ఏటీ అన్నేయం? సాగు గుడ్డిల మీదన మొక్క లేయిస్తన్నావేటి? బోడికొండ ఎగవన గదా మొక్క లెయ్యావాలసింది. ఇదిగిదేటి బావూ? మా నోటికాడ కూడు నాగేత్తన్నావు?" అన్నాడు.

ఫారెస్టురాజు వినిపించుకోలేదు. ప్లాస్టిక్ కవర్లలో నున్న మొక్కలు విరిగిపోకుండా జాగ్రత్త చెబుతూ, సోమయ్య గుడ్డిమీద పని చేస్తున్న కూలీలను హెచ్చరించడానికి అటుగా నడిచాడు.

బోడయ్యరాజును వదలకుండా వెనకనే నడిచివెళ్ళి అతను ఆగిన దగ్గర నిలబడి

''ఇదిగిది సోఁవియ్య గుడ్డి బావూ! పట్టాఉన్నాది. నిన్నన వోన పడ్డాదిగాదా! రేపుటికి అదునిస్తే దున్నాలనుకొంతన్నాఁవు" అన్నాడు.

పట్టా అనేసరికి ఫారెస్టరురాజు మండి పడ్డాడు.

"పట్టా ఉందిరా లంజకొడకా! పట్టుకు రారా! ప[త్రమని మూడు ముక్కలకింద చింపుతాను'' అన్నాడు.

బోడయ్య అయోమయంగా

"అదేటి బావూ?" అని అడిగాడు.

రాజు ఇంకా రాజుకుంటూ

"అదంతే[రా! పట్టాలెందుకురా? నాలిక గీసుకోవడానికా? ఈ భూమిని మేము రిజర్వంటే అది రిజర్వే. రిజర్వుకాదంటే అది రిజర్వుకాదే! మీకు వొళ్ళు కొవ్వెక్కి మాతో తగువులు తెచ్చుకున్నారు. మేమంతా కూర కోసుకోని లేమురా! డిపార్టుమెంటు డిపార్టుమెంటు ఏకమై మీ దూల తీరుస్తాము. చూద్దురుగాని" అని ,అక్కడనుండి కావాలనే బోడియ్య గుడ్డిపైపుగా నడిచి వెళ్ళి అక్కడ పనిచేస్తున్నవారితో

"ఈ గుడ్డి పని ముందు చూడండి'' అన్నాడు.

కూలీలు వేగంగా గోతులు తవ్వుతూ మొక్కలు పాతేస్తున్నారు. తన భూమి మీద కూలీలు పొడుస్తున్న ప్రతి గునపంపోటూ బోడయ్య

గుండెమీద పొడుస్తున్నట్టుగా బాధపడి ఫారెస్టరుతో

''బాబ్బావూ! రచ్చించాల బావూ! నాకున్నిది ఇదొక్క గుడ్డేని బావూ! అన్నేయం సేసీకండి బావూ'' అని రాజు చేతులు పట్టుకున్నాడు.

రాజు చేతులు విదిలించుకొని

''నేనేమీ అన్యాయం సేయలేదురా! అంత నేను చేసింది అన్యాయ మనిపిస్తే పట్టా ఉందిగదా కోర్టుకెళ్ళరా'' అన్నాడు.

బోడయ్య మరేమీ మాట్లాడలేకపోయాడు. కూలీలు తొందరగా పనిచేస్తూ గుడ్డికి సగానికి పైగా మొక్కలు వేసేస్తున్నారు. పోలీసు ఇన స్పెక్టరూ పోలీసులు అట్నుండి ఇటూ ఇట్నుండి అటూ తిరుగుతున్నారు.

బోడయ్యకు పిచ్చిపట్టినట్టయింది. ఒక్కసారిగా పెద్దగా కేకలేస్తూ

"బావూ! పారిస్టుబావూ! సూత్తా సూత్తా నా గుడ్డి నా నొదులుకోని నా బతుకుల బుగ్గి నాసేతుల్తోటి పోస్కోనుగాక పోస్కోను. నన్ను సంపి నా గుడ్డిల మొక్క పాతండి'' అని నేలను వదేసిన కర్రను తీస్తూ

''అగండొరే మరొక మొక్క పాతినారంటే మీ కిక్కడే పాతేత్తాను'' అని పరిగెత్తాడు.

ఫారెస్టరురాజు పరిగెత్తాడు. పోలీసులు పరిగెత్తారు. పరుగున పోతున్న బోడయ్యను కూలీలదగ్గరకు వెళ్ళకుండానే పోలీసులుపట్టేసారు. బోడయ్య గింజుకున్నాడు. లాఠీలు బోడయ్య శరీరం మీద చిత్తాను సారంగా పడిపోతున్నాయి. బోడయ్య మెలితిరిగి పోతున్నాడు. రాజు బోడయ్య జుత్తుపట్టి దవడమీద చాచి లెంపకాయకొట్టి

"తిరగబడతావట్రా గదబ నా కొడకా! ఏ కీలుకి ఆ కీలు తీస్తాము" అని గుండెలమీద గుభీమని తన్నాడు.

అంతలో సుక్కడు పరుగెత్తుకొనివస్తూ

"బావూ! రాజుబావూ! కొంప మునిగిపోనాదిబాబూ! వొలసలోకి గురు వొచ్చినట్టిగ తెలిసినాది. రాండి బావూ! పోలీసు బావులూ'' అని అలసిపోయి చెమటలు కక్కేస్తున్నాడు.

ఫారెస్టరురాజు విపరీతంగా భయపడి పోతున్నాడు. పోలీసులు తొందరపడిపోతూ

"తుపాకుల్తోటి వచ్చేదేట్రా?" అని అడిగారు.

సుక్కడు అలుపు తీర్చుకొని

''వొక్కడే వచ్చినట్టిగున్నాది. తుపాకీలూనేవు. మడుసులూ మరెవలూ నేరు, సోమయ్యగాడింట్లవున్నట్టిగ సాంబన్నగోరుపసిగట్టినారు. బేగి బయలెల్లిరండి బావూ!" అన్నాడు.

పోలీసు ఇనస్పెక్టరు సంతోషంగా ఎగిరిగంతువేస్తూ

''వంటింట్లో కుందేలు దొరికినట్టుగుంది. మనం పట్టేశామా ఈ ప్రాంతానికి గొడవ పోతుంది'' అని బైటకు అంటూ లోపల తనకు రాబోయే ప్రమోషనూ ప్రభుత్వం ఇవ్వబోయే బహుమతులూ ఊహించుకుంటూ పోలీసులతోసహా కదిలి వలసదిక్కుగా సుక్కడ్ని పసిగెత్తిస్తూ కదిలిపోయాడు.

ఫారెస్టరు రాజు కూలీలకు పనిఆపమనిచెప్పి బోడయ్యని అక్కడే వదిలేసి పరుగుపరుగున లారీలవైపుగా పెళ్ళిపోయి డ్రైవర్లతో

"ఒరే బాబూ! అర్జంటుగా స్టార్టు చెయ్యండిరా ఎటుపోయి ఎటొస్తుందో! అసలు నక్సలైటు వచ్చాడట. మన పీకలు తెగిపోతాయి. ఆఫీసుకి పోదాం నాయినా మనకెందుకీ బాధ?" అంటూ లారీలలో కూలీలను ఎక్కించుకొనిజోరుగా లాగించుకు పోయాడు.

బోడయ్య తగిలిన దెబ్బలనుండి తేరుకొని చూసేసరికి ఆ ప్రాంతమంతా నిర్మానుష్యమై పోయింది. అతడి చెవుల్లో సుక్కడి మాటలు గింగురు మంటున్నాయి.

"సుక్కడు నంజికొడుకు ఎంతపని జేస్సినాడు. గురు వొక్కడే వొచ్చినాడు గావాల. ఈల కంట ముందల ఎల్లి ఎనాగ సెపతా....?" అనుకొని ఏమి చెయ్యడానికి పాలుపోక నిల్చున్న దగ్గరే ఉండిపోయాడు.

తనకి తగిలిన దెబ్బలు మరచిపోయాడు. పరిసరాల్ని మరచిపోయాడు. అతడికి అంతా చీకటిగా భయంకరంగాకనిపిస్తూంది. మరొకసారి తనలో తనే గొణుక్కుంటూ

''దొరికిపోతాడు గావాల! మా గురువు దొరికిపోతాడు గావాల!"అని చతికిల బడిపోయి నెత్తిన చేతులు వేసుకొని

''ఈ వొక్కపాల తప్పోవాల!" అనుకొని మళ్ళీలేచి

"సీ....నానేటి ఆడదాన్నాగ ఇదిగిక్కడ సతకల్ల బడిపోనాను. నానూ వొలసెల్లి గురువును తప్పించాల. నా పానం పోతేపోనాది;గురువు కోసం కావాలంతే ఈ పానమే ఇచ్చేత్తాను" అని లేచి గదబవలస వైపు త్వరత్వరగా నడిచాడు.

మూడు నాలుగు గుడ్డిలుదాటి నక్కెరి చెట్టుదగ్గిర బలుసు తుప్పల మలుపు తిరిగి గోరిజలోకి దిగేసరికి బోడియ్య తనముందు కనిపించిన మనిషిని చూచి ఆశ్చర్యపోయాడు.

''గురువూ!'' అని పరుగుపరుగునపోయి వాటేసుకున్నాడు.

గురువు నవ్వుతూ

''కామ్రేడ్! పద పద! ఇక్కడ నిముషం ఆలస్యం చెయ్యడానికి వీల్లేదు నడుస్తూ మాటాడుకుందాం. రిజరు మామిడి చెట్టు దాటేసి గెడ్డ జొలలోకి దిగింతరువాత వివరాలు చెప్తాను." అని ముందుకు నడిచాడు.

గురువు వెనక బోడయ్య పరుగుతీస్తూ

"మడిసి సూత్తే పిట్టంత గద్దునేడు నడకకి నాను పరిగెడతన్నాను. అనుకొని ఇద్దరు క్షణంలో రిజరు మామిడిచెట్టు దాటి గెడ్డజొలలోకి దిగిపోయారు. గెడ్డలో పదిబారలు నడిచి పిట్టపళ్ళ తీగల క్రింద నీడన ఆగి "కామ్రేడ్'' అని బోడయ్యను చూసాడు. గురువుకి బోడయ్య శరీరం నిండా దెబ్బలు కనిపించాయి.

"కొట్టారా కామ్రేడ్" అని అడిగాడు. అతను అలా అడుగు తున్నప్పుడు కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి.

బోడయ్య తల వూపేడు. గురువు తిరిగి మాటాడుతూ

''కామ్రేడ్ నీ భార్య ముత్తేలుకి పార్టీ నేను ఎంతో కృతజ్ఞత చెప్పాలి" అన్నాడు.

గురువు నోటినుండి ఆ మాట వినేసరికి బోడయ్య బాధనంతా మరచిపోయి

"ఏటయినాది గురువూ?" అని అడిగాడు.

గురువు బోడయ్య భుజం తడుతూ

"కామ్రేడ్ అంటే అంత ధైర్యం చూపించాలి. నేనూ సోమయ్యా వలసలోకి వచ్చేటప్పటికి నీ భార్య పురిటి నొప్పులు పడుతూందని అదెమ్మ చెప్పింది. వెంటనే పెరటి దారిన నేనూ అదెమ్మా నీ ఇంటికి వెళ్ళాము. ఆ సొండిసాంబన్న నేను సోమయ్య ఇంటిలోనికి వెళ్ళడం చూసి సుక్కడి చేత పోలీసులకు కబురుపెట్టాడు.

ఈ తంతు మాకు తెలియదు. నువ్వు ఇంటిదగ్గరలేవని తెలిసి ముత్తేలు అవసరం చూడ్డానికి అదెమ్మని పంపించి, నేను పెరటిలో కూచున్నాను. ఇంతలో పోలీసులు సోమయ్య ఇంట్లో చొరబడ్డారు. అప్పటికే ముత్తేలు మగబిడ్డని కన్నాది. సోమయ్య ఇల్లు సోదాచేసిన పోలీసులు నీ ఇంటివైపు వస్తున్నారు. నేనది గమనించి నీ ఇంట్లో చొరబడి అదెమ్మకు విషయం చెప్పాను. అదెమ్మ గాభరాపడిపోయి తన అన్నకు ఏం జేస్తున్నారో చూడ్డానికి పరిగెత్తింది.

అప్పుడు, కామ్రేడ్ ముత్తేలు చూపిన సాహసం, చొరవ నన్ను ముగ్ధుణ్ని చేస్తుంది. ఆ స్థితిలోలేచి పురిటి కోకమీద మరొక కోక చుట్టుకుంది. నన్ను నీ బిడ్డపక్కన పడుకోమని మాసిన కోక కప్పింది. అలా కప్పటం జరిగింది. పోలీసులు నీ ఇంట్లో చొరబడ్డారు. ముత్తేలు ధైర్యంగా నిలబడింది. పోలీసులు ఇల్లంతా గాలించారు. పురిటి వాసన వాళ్ళ ముక్కుల్ని బద్దలు కొడుతూంది. తిట్టుకుంటూ, మంచంమీద నీ బిడ్డ పక్కన పురటాలులా పడుకున్న నన్ను జూసి అదెవరని అడిగారు. ముత్తేలు తొణుకూ బెణుకూ లేకుండా బోడయ్య పెళ్ళాం పురుడైంది. నేను పురుడు పొయ్యడానికి వచ్చానుబాబూ! అని చెప్పింది. పోలీసులు గురువు వచ్చాడేటని అడిగారు. రాలేదని ఖచ్చితంగా చెప్పింది. వాళ్ళు సాంబన్న ఇంటివైపు వెళ్ళిపోయారు.

"అలా ఉండాలి కామ్రేడ్ అన్నప్పుడు" అని అభినందించాడు.

బోడయ్య పాలుపొంగినట్టు పొంగిపోయాడు. ముత్తేలు తన భార్య

అయినందుకు గర్వించాడు. కొడుకు పుట్టాడనీ గురువు పేరు పెట్టుకొ వచ్చుననీ ఉబ్బి తబ్బిబ్బు అయిపోయాడు.

సంతోషంలో కొట్టుకుపోతున్న బోడయ్యను గురువు కుదుపుతూ

"కామ్రేడ్! నేను దొరక్కుండా పోవడంతో పోలీసులు సోమయ్యను హింసిస్తున్నారు కామ్రేడ్ సోమయ్య ప్రాణం పోయినా నోరు జారడన్న నమ్మకం నాకుంది. అయినా పార్టీ నిర్మాణ సూత్రాన్ని మనం పాటించాలి. సోమయ్యకు మన సాయుధ కామ్రేడ్స్ చీకటి తోటలో ఉన్నటు తెలుసు. అందుచేత మనం స్థలం మార్చెయ్యాలి. నేను గెడ్డ అవత మిమ్మును కలుస్తాను. నువ్వు పరుగుమీద చీకటితోటకు వెళ్ళాలి. తోట యాభై గజాల దూరం ఉందనేసరికి నువ్వు మరిచిపోకుండా మూడు సార్లు చప్పట్లు కొట్టాలి. లేకపోతే నీకు ప్రమాదం. అక్కడ ఉన్న మన కామ్రేడ్స్‌కి విషయం చెప్పి ఈ గెడ్డ అవతల వున్న గుగ్గిలపు మడ లోకి చేర్చాలి. మీరు చేరిన తరువాత నేను కలుస్తాను. చాలా జాగ్రత్త సుమా!" అని చెప్పవలసిన జాగ్రత్తలు చెప్పి, గురువు గెడ్డగట్టెక్కి అవతలకు దాటి చెట్లలో కలిసిపోయాడు.

గురువు చెప్పిన మాటలన్నీ జ్ఞాపకం పెట్టుకుంటూ బోడయ్య చీకటి తోటవైపు పరుగుతీసాడు.

# 15

గుగ్గిలం మడ చిక్కగా ఆకుల్తో చక్కగా ఉంది. అడివిమీద చంద్రుడు అందంగా వెలుగుతున్నాడు. అక్కడమాత్రం ఆకులుఆకాశాన్నీ భూమినీ వేరుచేయడంచేత వెన్నెలవెలుగు భూమిమీద మచ్చలు మచ్చలుగా పడుతూంది. ఆడా మగా వందమందికి పైగా అక్కడ మనుషులున్నా కీచురాళ్ళ ధ్వనీ, పక్షుల రెక్కల చప్పుడూ, అడవి జంతువుల అరుపులూ

మినహాయిస్తే; మనుషులున్నట్టు అడివితో ఎంత పరిచయమున్న వాడికైనా తెలియడం చాలా కష్టం. అంతటి నిశ్శబ్ద వాతావరణంలో సోమయ్య కంఠం ఖంగుమంది. అతడు గురువుతో

"గురువూ! మాకేటీ తెలదు. తెల్లటి కమీజుని సూసి మాఁవు సానా ఇయ్యం పడిపోయివోలం. సొండి సాంబడుగాడు మా వొలస వొచ్చి నప్పుడు ఆ యిదంగానే దగా పడిపోనాం. ఆడు కట్టు గుడ్డముక్కలతోటి మా వొలసవచ్చి అప్పొ కావా వొరసలుకట్టి మా కట్టాన్ని మాకు తెల కండా దోసేసి దాసీసుకోని కుద బలిసిపోనాడు. నువ్వొచ్చి మా బతుకుల గురుంచి సొప్పిందాకా మా కేటీతెల్దు. నువ్వు సొప్పినప్పటికి ఆ సాంబడు గాడు మా పీకల మీదకి ఎక్కి కూకుండి పోనాడు.

ఇయాల మా బూఁవులు మాకు నేవు. మా కట్టం మాకు నేదు. మాఁవు పెంచుకున్న కోడీ మేకా నేదు. ఇదిగీ పింటి ఇదంగా మాకు జేస్సిండు. మా సాగు గుడ్డిల మీదన మొక్కలేయించీసి మాఁవు తిన్ని కూట్ల బుగ్గిపోసీసినాడు. పేనానికి పేనంగా సూసుకుంతున్ని సిన్ను పోలీసోలకి వొప్పజెప్పనానికి ఎత్తేసినాడు. అదిగా సుక్కడు సుట్టపోడైనా ఆ సొందోడి పక్కనే కాపుకాసినాడు.

అలు వొలసల బతికినారంతేమరి మా కెవులికీ బతుకుండదు గాక ఉండదని తేలిపోనాది. సూడు గురువూ! నా వొల్లంతా రగతాలు సిమ్ము తన్నాది. ఆ పోలేసోలు సొప్పకోనేనిసోట్ల సిదగ బొడిసినారు. ఇయాల మరొదలగూడదు. ఆ సాంబడిగాడి పనీ సుక్కడుగాడి పనీ పట్టియ్యాల" అన్నాడు.

సోమయ్య మాట్లాడిన తరువాత అంతా గురువు ఏమి చెబుతాడోనని నిశ్శబ్దంగా చూస్తున్నారు. అప్పుడు గురువు గంభీరంగా

"కామ్రేడ్స్, వర్గ శత్రువు అంటే; మన కష్టాన్నీ రక్తాన్నీ దోచుకు దాచినవాడు సుఖంగా బ్రతికివుంటే మనకిగానీ మన పార్టీకి గానీ బ్రతుకుండదు. అందుచేత మనం మొదట అటువంటివాళ్ళపని పట్టాలి. అప్పుడు మన ఆచూకి చెప్పినవాడు ఆ గ్రామంలో ఉండడు. అది మన

పార్టీ నిర్ణయం. ఇప్పుడు మీరంతా అనుభవం మీద ఆ నిర్ణయానికే వచ్చారు.

"సుక్కడి దగ్గరకు వచ్చేసరికి మనకి మరో ప్రశ్న ఎదురౌతుంది; సుక్కడు మన వర్గమే; అంటే మనవాడేగదా! మరి వాడ్ని కూడా సొండి సాంబన్నతోపాటే నిర్మూలించవలసినఅవసరంఎందుకుకనబడుతుందంటే

"వాడికి మన పార్టీలో స్థానం ఇచ్చి చూసాం. వాడు తప్పుడు దార్లు తొక్కుతుంటే అనేక విధాల నచ్చజెప్పాం; అయినా వాడు మనకు ఉపయోగపడకుండా ఆ సొండోడికి అనుకూలంగా చివరివరకూ పని చేశాడు; ఇవాళ మనం రక్షించబడ్డామంటే ముత్తేలుధైర్యం, సోమయ్య నిజాయితీ మాత్రమే కాని మరేమీ కాదు; వాళ్ళు ఎక్కడ పొరపాటుగా వ్యవహరించినా మన పార్టీ చాలా చికాకుల్లో పడవలసి వచ్చును;

అందుచేత ఈ దినం మనం గదబవలసని విముక్తం చెయ్యాలి; గదబవలస విముక్తం కావాలంటే మన ప్రధానవర్గ శత్రువైన సొండి సాంబన్ననూ వాడికి అన్ని విధాలా ఉపయోగపడుతున్న సుక్కడ్నీ మనం నిర్మూలించాలి.

"మనకి చంపటం సరదాకాదు. కాని వందల, వేల, లక్షల్లోవున్న మనలాటి ప్రజానీకం సుఖపడాలంటే ఒకడ్ని తొలగించడం నేరంకాదు; మనం మాతృదేశ ఉజ్వల భవిష్యత్తుకోసం మొట్టమొదటిసారిగా ఈ పోరాట పంథా చేపట్టాం; ఇదేమే సులభం కాదని గుర్తించుకోవాలి: ఒక పక్క దేశ విప్లవ పరిస్థితులు మనని సవాల్ చేస్తుండగా, మరొక వైపు పార్టీలోని అవకాశవాదులు వెన్నుపోటు పొడుస్తున్నారు; ఏమైనా ఇందులో మన ప్రాణాలుపోయినా, మనదేశంలో ప్రజలు ఉన్నంతకాలం మన త్యాగాలు చిరస్థాయిగా నిలుస్తాయి! తీవ్రమైన నష్టాలు జరుగుతాయని తెలిసికూడా మనం ముందుకే పోతున్నాం.

"సమయం ఇస్తే శత్రువు దాటిపోవచ్చు. అందుకు మనం ఇప్పుడే కదలాలి" అన్నాడు.

గుగ్గిలం మడ విప్లవ నినాదాలతో ప్రతిధ్వనించింది.

విప్లవం వర్ధిల్లాలి.

తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుంది.

వర్గ శత్రువులు నశించాలి.

అన్న వినాదాలు మిన్నుముట్టాయి.

ఆ ప్రశాంత సమయంలో! వెన్నెల వెలుగులో, గదబవలసలో సొండి సాంబన్న ఇంటిముందు శ్రమజీవులైన విప్లవకారుల తుపాకీ వినూత్న సమాజాన్ని ఆహ్వానిస్తూ 'ధన్' మని పేలింది.

సొండి సాంబన్న వీధిలో రాటకి కట్టబడి ఉన్నాడు. సాంబన్న గాదెలలో దాచిన దినుసంతా వలసలోని శ్రమజీవులు తమ తమ ఇళ్ళలో పదిల పరుచుకున్నారు. సాంబన్న దాచిన బంగారు నగలూ, వెండీ, రొక్కమూ పార్టీ పరమైంది. సాంబన్న వ్రాయించిన ప్రామిసరీ నోట్లూ దస్తావేజులూ ఇతర దోపిడీ పత్రాలు అగ్నిపాలైనాయి.

సాంబన్నకు ఎదరగా రాటకి కట్టబడిన సుక్కడు లబోదిబోమని ఏడుస్తున్నాడు. సాయుధులైన సోమయ్యా బోడయ్యా సాంబన్న ఇంటి నుండి వెలుపలికి వచ్చారు.

బోడయ్య ఉద్రేకంగా అక్కడ మూగివున్న ప్రజల నుద్దేశించి

"ఇదిగో! ఈడునేడా ఈ సుక్కడు. మనజాతిలపుట్టి ఆ సాంబడి గాడి దగ్గిట కుక్కనాగపడి మనకి సానా అన్నేయం సేసిండు. వొద్దురా నాయినా అని సొప్పినా ఇన్నాడుగాడు. ఇలాటి పింటోడు బతికినాడంటే మన బతుకులికే ముప్పు. అందుసేతన ఈడ్ని....ఈడ్ని....!" అని విపరీతమైన క్రోధంతో గండ్రగొడ్డలి ఎత్తి నరికాడు.

అప్పటికే శివాలెత్తిపోయి ఉన్న సోమయ్య

"ఒరే! ఓరె సొండినాకొడకా. నువ్వికడికెనాగొచ్చినావు?

ఎనాగ ఎదిగిపోయి మా పీకల మీదన కత్తినాగ ఎలాగ కూకున్నావు? నీకు ఈ వొలసల సోటు సూపించి నీకు బతకనానికి దారి సూపిత్తే మాకు దారే నేకంటా సేస్సినావు నిన్ను ...." అని చేతిసున్న గొడ్డలి ఎత్తేసరికి సాంబన్న రెండో పెళ్ళాం ఏడుస్తూ దూరంగా నిలుచున్న గురువుకాళ్ళ మీద పడి

"బాబూ! నన్ను సంపేసి అతగాడ్ని వొదిలీయండి" అని ప్రాధేయ పడింది.

గురువు నిర్లిప్తంగా

"అమ్మా! ఆడవాళ్ళనీ, పసిపిల్లల్నీ, కళాకారుల్నీ చంపడం మా ఉద్యమం ఉద్దేశ్యంకాదు. చంపటం మాకేమీ సరదాకాదు. ఇప్పుడు ఈ సాంబన్నని మేము కనికరించి వదిలిపెడితే, ఇతడు రేపు పోలీసుల్తో కలిసి, బ్రతికున్నంతకాలమూ, మమ్మల్నీ మా పార్టీనీ సర్వనాశనం చెయ్యడానికి తప్పకుండా ప్రయత్నిస్తాడు.

నువ్వు ఆడదానివైనా ఒక్కసారి ఆలోచించు. ఈ రోజు మధ్యాహ్నం పోలీసులకు నా ఆచూకీ చెప్పాడు. నేను దొరికి వుంటే వాళ్ళు ఏ మాత్రం సంశయించకుండా నన్ను చంపుతారు. మా వినాశనం నీ భర్త కోరినప్పుడు మేము అతణ్ణి క్షమించడం మాపార్టీకేముప్పు.

గదబవలసని దోచుకుతిన్న నీ భర్తమీద చాలా ఆలోచన చేసే ఈ నిర్ణయం తీసుకున్నాం. అక్కడ అందరి ఆడవాళ్ళలాగే కష్టపడి నువ్వూ బ్రతకాలనుకుంటే ఇక్కడ ఉండు. నీకు ఇష్టం లేకపోతే నీ సవితితో పిల్లలతో వెళ్ళిపో

ఒక్క గదబవలసనే కాకుండా ఈ చుట్టుపక్కల జనం శ్రమనీ రక్తాన్నీ దోచుకు తినమరిగిన నీ భర్త బ్రతకడం మేం ఆశించిన సమాజానికి చాలా ప్రమాదం. ఇవాళ ఎవరుకూడా సాంబన్న చావుని ఆపలేరు" అన్నాడు.

సోమయ్య పని పూర్తి చేశాడు.

సాంబన్న తలను తీసి ఉట్టికి వ్రేలాడ గట్టారు. గడకర్ర పాతి అడుగున నాటుబాంబు పెట్టి చివర సాంబన్న తలను వ్రేలాడదీశారు. పోలీసులు గెడకర్ర కదిపితే నాటుబాంబు ప్రేలేలాగా ఏర్పాట్లు పూర్తి జేసి, అంతా వలసమధ్యని సమావేశమయారు

కోళ్ళు కూయలేదు. అర్ధరాత్రిని తెలుపుతూ ఇలకోళ్ళు అరుస్తుండగా చింతగీర్లు గీపెడుతున్నాయి.

అప్పుడు ఆదెమ్మ క్రోధంగా లేచి

"అన్నలూ! నా బతుకు ఈ గదబొలసలోన బద్దలై పోనాది. అది గందుకు నా జాతోడు కా పోయినా ఆ సెట్టోడి పంచ సేరినాను. అక్కడి గూడా నా బతుకు బద్దలై పోనాది. నాయుడొలసలోన నాను ఎల్లకముందల సక్కగా బతికిన నా మొగుడు జేలుపాలైనాడు. ఆడి ఇల్లు నాయుడు పాలై పోనాది. అ నాయుడొలసలోన నాయిడు నానాగే సానా మంది బతుకుల బుగ్గిపోసీసి ఆల ఇల్లూ బూంవులూ నాగీసుకుంతన్నాడు.

అది గందుకు ఇయాలే ఇప్పుడే నాను నాయుడొలస నాయిడిని సొండిసాంబన్న గాడ్ని సేసినట్టుగా సెయ్యాలనీసి నా కున్నాది. నాతోని ఎవులొత్తారో బయలెల్లండి" అని లేచింది.

ఆదెమ్మ లేచింది. సోమయ్య లేచాడు. పసికందుని వీపుకు కట్టుకొని ముత్తేలు లేచింది.

కొండలూ, కోనలూ, గట్టులు, పుట్టలూ, చెట్టులూ, చేమలూ, వాగులూ, వంకలూ, నడిచాయి. కొండలు కదిలాయి. కొండగాలి దేశం నలుమూలలా పెను ప్రళయంగా వీచింది.